ISSN 0971-278X

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంచిక : 451
వెల : రూ.25/-
అక్టోబర్ 2022



నిలువగ దోచే పెత్తందారుల
గొప్పలు ముప్పలు ఇకపై చెల్లవ్

జనసాహితి ప్రచురణ

కవిత

# మోహినీ పిశాచం!

- ఎ.కె. ప్రభాకర్

పురాణం
పదేపదే పునరావృతమౌతూనే వుంది
కలిసి చిలికి సాధించిన
'అమృత' ఫలం అనాదిగా కొందరి సొత్తే అవుతోంది
యెన్ని మాయలు పన్నావు మోహినీ
యెన్ని వేషాలు వేశావు మోహినీ
యెంత మోసం చేశావు మోహినీ
న్యాయబద్ధమైన భాగం అడిగినందుకు
కుత్తుకలు కత్తిరించావ్

గ్లాసులు రెండు
కుండలు రెండు
బావులు రెండు
చెరువులు రెండు
అయినా అంతా 'అఖండ'మే అంటావ్
దాహంతోనో ఆకలితోనో
అజ్ఞానంతోనో అమాయకంగానో
ఆవేదనతోనో ఆత్మగౌరవంతోనో
దరికి చేరితే కసిరి కొడతావ్
వెలి వేస్తావ్ ఉసురుతీస్తావ్
గుడి కాదు బడి కావాలన్నందుకేగా
యేలిన్నాటి అమానవీయ మనుధర్మం
యీనాటికీ అమలు చేస్తున్నావ్

నిజం చెప్పు
దేశాన్ని నిలువుగా చీల్చిందెవరు
'తుకడా బ్యాచ్' ఎవరిది
'అలగా జనం' అని కొందరిని అలగ్ చేసిందెవరు
పుట్టుమచ్చలు
యే భాగ్య విధాతలు ప్రసాదించినవి
ఆజాది అమృతోత్సవ వేళ
గుడిసెల్లో నీ 'బంతి భోజనం' సరే
మీ 'కర్తవ్య పథం' మీద
మా నీడ కూడా నీకు యింకా అస్పృశ్యమే కదా

నీ తిండి వేరు నా తిండి వేరు
నీ కట్టూ బట్టా వేరు నా తట్టా బుట్టా వేరు
అందుకేగా 'దేశద్రోహి' ముద్ర వేసి
యింట్లోంచి బయటగ్గుంజి
రైళ్లోంచి వెలిక్కి నెట్టి
నగరం నడిబొడ్డున వెలివాడలు కట్టి
మూక దాడులు చేశావు

నీ రంగు వేరు నా రంగు వేరు
ఏక సంస్కృతి వాదమో
ద్వి జాతి సిద్ధాంతమో నీది
కడుపుకూటి కోసం బతుకు రాద్ధాంతం నాది
దేశం కోసం ధర్మం కోసం
కడుపులో పిండాల్ని చీల్చి
'జాతిహనన'ానికి పూనుకున్నావు
పౌరసత్వం అడిగిన నేరానికి
వున్న ఇంటిని 'బుల్డోజ్' చేసి
కుటుంబాల్ని బజారు పాల్జేశావ్

నేరాలకు అతీతమైన 'సంస్కారవంత'మైన పుట్టుక నీది
శిక్షలకు మాత్రమే అర్హమైన అకాలపు చావు నాది
పుట్టుకతోనే వేరు చేశావ్
అన్నీ వున్న భద్ర జీవివి నువ్వు
యేమీ లేని 'ఆందోళన జీవి'ని నేను
యీ అసమానపు పొత్తే
నీ ఆధిపత్యాలకు 'శ్రీరామ'రక్ష

నీ అందరి వికాసంలో
మా కొందరం లేనప్పుడు
కలిసి నడవాలనేది కుట్ర అని తెలిసిపోయింది మోహినీ
నీ కుతంత్రాలు యికపై నడవ్వు మోహినీ
దేశాన్ని కొందరికి దోచిపెట్టడానికి
నీ అయ్య జాగీరేం కాదు
నీ రూపం నీ మాట నీ పంపకం
అంతా ఝూటా అని గ్రహించాక
గనిలో పనిలో కార్ఖానాల్లో
మా నెత్తురు మండించి మా చెమటను చిందించి
మా కండలు కరిగించి మా ఎముకలు పొడిచేసి
సృజించిన సంపదలో
మా వాటా కోసం దేనికైనా సిద్ధమే
గుర్తుపెట్టుకో మోహినీ
గురి కాసుకో మోహినీ
అమీ తుమీ తేల్చుకుందాం
యుద్ధం మాకు కొత్త కాదు

46 ఏళ్ళుగా నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

# ప్రజాసాహితి

451

సంపుటి : 46
సంచిక : 3
అక్టోబర్ 2022

జనసాహితి ప్రచురణ

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

website : www.prajaasaahithi.com

## ఈ సంచికలో...

| | | | | |
|---|---|---|---|---|
| ✦ ముఖచిత్రం | : | చిత్రం – అంతర్జాలం నుండి | | .....01 |
| ✦ రెండవ అట్ట | : | మోహినీ పిశాచం! (కవిత) | – ఎ.కె. ప్రభాకర్ | .....02 |
| ✦ మూడవ అట్ట | : | సెల్ఫీకాదు (కవిత) | – కంచరాన భుజంగరావు | .....35 |
| ✦ నాల్గవ అట్ట | : | చిత్రం – ఆనంద్ | | .....36 |
| ✦ సంపాదకీయం | : | వీర తెలంగాణ – ప్రజా ఉద్యమాలకు వేగుచుక్క కావాలి!! | | .....05 |
| ✦ కథలు | : | ఓడిపోయాను హిందీ – మన్ను భండారి | అను – డా॥ వెన్నా వల్లభరావు | .....08 |
| ✦ వ్యాసాలు | : | ఈ కొత్త పన్నులెందుకొచ్చే.... | – గౌరీశంకర్ | .....19 |
| | : | ముప్పాతికేళ్ళ విషాద భారతం – పాయసంలో గరిట వంటి విద్యావిధానాలు | – పి.ఎస్. నాగరాజు | .....23 |
| | : | ఆత్మ గౌరవ పతాక | – ఎస్. జతిన్ కుమార్ | .....29 |
| | : | జూ లుక్ గొదార్ | – బాలాజీ (కోల్‌కతా) | .....32 |
| ✦ ధారావాహికలు | : | వ్యాసం – దేశ విభజన వస్తువుగా సాహిత్యం (2) 'ట్రైన్ టు పాకిస్తాన్' | – కొత్తపల్లి రవిబాబు | .....12 |
| | : | దీర్ఘకవిత – రంగు వెలసిన చిత్రం (2) | – శీలా సుభద్రాదేవి | .....07 |
| ✦ జాతీయ అక్షరయోధులు | : | ఖుర్రతులైన్ హైదర్ | – సింగంపల్లి అశోక్‌కుమార్ | .....18 |
| ✦ పుస్తక పరిచయం | : | 'నా జాతి ప్రజల కోసం నిలబడతా!' | – జి.వి. భద్రం | .....15 |
| ✦ కవితలు | : | సునీత గంగవరపు (**22**), ఎస్. శంకర్రావు (**14**) | | |
| ✦ వివిధ | : | ముప్ఫై ఏళ్ళ క్రితం 'ప్రజాసాహితి' (**31**); చైతన్యవాహిని (**34**) | | |
| ✦ స్మరించుకుందాం | : | న్యాయమూర్తి జస్టిస్ ఓ. చిన్నపరెడ్డి శతజయంతి | | .....04 |
| ✦ సంతాపాలు | : | బార్బరా ఎహ్రైన్ రీక్; నిజాం వెంకటేశం; పారెళ్ళ రత్తయ్య | | .....28 |

**ప్రధాన సంపాదకుడు : కొత్తపల్లి రవిబాబు** **ఫోన్ : 9490196890** E-mail : ravibabujs@yahoo.co.in

*చందాలు పంపవలసిన చిరునామా :*
**డా॥ బి. అరుణ,** జనసాహితి ప్రధాన కార్యదర్శి
జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి
30–7–6, అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,
దుర్గాఅగ్రహారం, విజయవాడ – 520002.
ఫోన్ : 7075957010 prajasahithi1977@gmail.com

ISSN 0971-278X
LCCN 94903393

*రచనలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా :*
**పి.ఎస్.నాగరాజు,** సంపాదకుడు, ప్రజాసాహితి
ప్లాట్ నెం. 59, రాధాక్రిష్ణ నగర్ కాలనీ
ఆర్మీ క్యాంటీన్ దగ్గర, డగ్లస్ స్కూల్ ఎదురు వీధి,
శ్రీకాకుళం – 532001
ఫోన్ : 9441913829 prajasahithi1977@gmail.com

**'ప్రజాసాహితి'**
**కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు**
**"అకౌంట్ నెం.**
***0680101004936***
***IFSC No. CNRB0000680***
**ఫోన్ : 94901 96890**

| | | |
|---|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | | రు. 300-00 |
| ఐదేళ్లకు | చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | | రు. 500-00 |

**చందాలు, విరాళాలు**
**మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.**
**చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.**
డి.డి.లపై 'ప్రజాసాహితి, విజయవాడ' అని రాయండి

**ప్రజాసాహితి ప్రకటనల ధరలు**
**1/4 డెమ్మీ పరిమాణం**

| | |
|---|---|
| 2వ, 3వ అట్ట మల్టీకలర్ | రు. 20,000 |
| లోపలి పూర్తి పేజి | రు. 15,000 |
| లోపలి అరపేజి | రు. 7,000 |

ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు, సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప) ప్రకటనలు సేకరించి పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం

## చందాదారులకు విజ్ఞప్తి

1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు పోస్టల్ శాఖవారి ఆదేశాల ప్రకారం ముద్రించటంలేదు. ప్రజాసాహితి కార్యాలయం నుండి చందా పూర్తికాకమునుపే మీకు సమాచారం పంపుతాము. వెంటనే చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రిక పంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత 'ప్రజాసాహితి'కి చందాలు, విరాళాలు సేకరించండి.

– సంపాదకవర్గం

# న్యాయమూర్తి ఓ. చిన్నపరెడ్డికి శతజయంతి నివాళి

**(జననం : 25 సెప్టెంబర్ 1922 – మరణం : 14 ఏప్రియల్ 2013)**



**సామాజిక** న్యాయం కోసం నిరంతరం తపించిన న్యాయమూర్తి ఓ. చిన్నపరెడ్డి శతజయంతి సంవత్సరం ఇది. "ఈ ఆధునిక కాలంలో న్యాయమూర్తులు కమ్యూనిస్టు మేనిఫెస్టో చదివి అర్థం చేసుకోకపోతే న్యాయాన్ని విశాలమైన అర్థంలో అమలుచేయడం కష్టతర మౌతుంది" అని ప్రకటించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఆయన. దీనిని పాటించిన నలుగురు న్యాయమూర్తులలో చిన్నపరెడ్డి ఒకరు. మిగిలిన ముగ్గురు వి.ఆర్. కృష్ణయ్యర్, పి.ఎన్. భగవతి, డి.ఏ. దేశాయ్.

న్యాయవ్యవస్థ రాజ్యాంగబద్ధంగాకాక, ఈనాడు పాలకవర్గాల బద్ధంగా మారిన దుస్థితిలో వున్నాం. న్యాయమూర్తిగా రిటైరైన తర్వాత గవర్నర్ పదవో, రాజ్యసభ సభ్యత్వమో అంగీకరించే పతన దశ మన కళ్ళముందుంది. న్యాయవ్యవస్థలో మితవాద, మతవాద ధోరణిని చిన్నపరెడ్డి నిరసించారు.

1971లో జ్వాలాముఖి, నిఖిలేశ్వర్, చెరబండరాజులను వారు రాసిన కవితల ఆధారంగా పి.డి. చట్టం ప్రయోగించి నిర్బంధించిన కేసులో చిన్నపరెడ్డి తీర్పునిస్తూ "విశ్వాసాలు నియంత్రణకు లోనుకావు. విశ్వాసాల మూలంగా ఎవరినీ నిర్బంధించరాదు" అని ప్రకటించి వారిని విడుదల చేస్తూ, భావప్రకటనాస్వేచ్ఛకు పట్టం గట్టారు.

'మత పునరుద్ధరణవాదంపై పోరాటం వర్గపోరాటంలో భాగంగా సాగాలి' అంటూ 1983లో బెర్ట్రెండ్ రస్సెల్ స్మారకోపన్యాసంలో ఎలుగెత్తి చాటారు. అహేతుక ఆలోచనలు వర్గపోరాట విజయంతోనే అంతమౌతాయన్నారు. కర్మ సిద్ధాంతం యథాతథ పరిస్థితిని సమర్థిస్తుంది కనుక దానిని పాటించవద్దని కోరారు. తమ పేదరికం తమ కర్మ అనుకునే భావం నుండి ప్రజలు బయటపడాలన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం నినాదాలతో సాగిన ఫ్రెంచి విప్లవం ఆదర్శాలను నేడు నోటితో పొగుడు తున్నారేగాని ఆచరించడంలేదని విమర్శించారు. మన విద్యా విధానం సమూలంగా మారాలనీ, అంధవిశ్వాసాలు, మతభావాలు, బూర్జువా సిద్ధాంతాలకు దూరంగా వుండాలనీ చెప్పారు.

ఆయన తన తీర్పులు ప్రజానుకూలంగా ఇచ్చారు. సమాన పనికి సమాన వేతనం సూత్రం ప్రతిపాదించారు. కాంట్రాక్టు లేబరును వ్యతిరేకించారు. పాలకవర్గాల కుహనా లౌకికవాదాన్ని ఎండగట్టారు. అధికార వికేంద్రీకరణను సమర్థించారు. హిందీతోపాటు ఇతర ప్రాంతీయ భాషల అభివృద్ధిని వాంఛించారు.

వారి రస్సెల్ స్మారకోపన్యాసం తెలుగు అనువాదాన్ని 'ప్రజాసాహితి' 1983లో ప్రచురించింది. ఆ తర్వాత పుస్తక రూపంలోనూ జనసాహితి ముద్రించింది.

సామాజిక, రాజకీయ, ఆర్థిక విముక్తి మార్క్సిజం ద్వారానే సాధ్యమని పదే పదే చెప్పిన చిన్నపరెడ్డి సందేశం – కుల, మత, ప్రాంతీయ విద్వేషాలను సమాజంలో నింపుతున్న ఈనాటి మతవాదులను ఎదుర్కోడానికి ఒక వజ్రాయుధంగా వుంటుంది. ●

సంపాదకీయం

# వీర తెలంగాణ - ప్రజా ఉద్యమాలకు వేగుచుక్క కావాలి!!

ఏ సంస్కృతికి వ్యతిరేకంగా ఈ పోరాటం!!
ఆ సంస్కృతి నేడు ఎలా ప్రబలుతోంది!!!

ఈ కీలక ప్రశ్న దగ్గర నిలబడి మహత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటపు వాస్తవాలను, అనుభవాలను సమీక్షించుకోవలసిన సందర్భంలో ఉన్నాము. నూతన ప్రజాతంత్ర సాంస్కృతిక దృక్పథంతో ఆ పోరాటాన్ని సమీక్షిస్తూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సాహిత్య సమీక్ష సంచికను (1981 జూలై – ఆగస్టు) 'ప్రజాసాహితి' తీసుకు వచ్చింది. అసంఖ్యాకమైన అజ్ఞాతవీరుల్ని – సుపరిచితులుగా, ఆత్మీయులుగా, రక్త బంధువులుగా గుండెల్లో పొదుపుకోవాల్సిన శ్రామిక ప్రజా సంస్కృతిని ఈ తెలంగాణ ప్రత్యేక సంచిక చాటింది.

భావజాలంలో మార్పు భౌతిక రూపం తీసుకుంటేనే సామాజిక మార్పు వస్తుంది. భావజాలంలో మార్పు రావాలంటే సాంస్కృతిక అణచివేత నుండి, ఉక్కపోత నుండి ప్రతిఘటన పిడికిళ్లు నిప్పురవ్వల్లా రాజుకోవాలి. తెలంగాణ సాయుధ పోరాటానికి దారి తీసిన కీలకమైన భాషా సాంస్కృతిక చైతన్య క్రమాన్ని అర్థం చేసుకోవాలి. నిజాం రుద్దిన ఉర్దూ భాషాధిపత్యం క్రింద తెలుగు భాష అణచివేతకు గురికాగా, అడుగడుగునా అవమానాలను, నిషేధాలను, భాషా వివక్షను తెలంగాణ ప్రజలు అనుభవించారు. (కొత్త రూపాలలో.... ఈనాటి తెలుగు భాష స్థితిగతుల్లాగే, ఆనాడు కూడా) కవులు, రచయితలు, సామాన్య మధ్యతరగతి ప్రజలు ఒక కనిపించని ఉక్కపోతకు గురయ్యారు. ఆ ఉక్కపోతలోంచి 1921లో ఒక ధిక్కారస్వరంగా నిజాం ఆంధ్ర మహాసభ అంకురించింది. అది విస్తరించి, తెలుగు భాషా సాంస్కృతిక సామాజిక పోరాట చైతన్యంగా రూపుదిద్దుకుంది. ఉపరితలాంశమైనా, భాషతో ముడిపడి ఉన్న ప్రజల జీవన సాంస్కృతిక మూలాలు కాపాడుకోవాల్సిన ఆత్మరక్షణ క్రమంలో ఆంధ్రభాషోద్యమం రాజ్యంతో తలపడాల్సి వచ్చింది. భాషా సాంస్కృతిక పోరాటం, చివరికి సామాజిక ఉద్యమంగా విస్ఫోటించింది. పండితుల దగ్గర, కవుల దగ్గర, రచయితల దగ్గర ప్రారంభమైన ధిక్కారం విశాల ప్రజా ఉద్యమ రూపాన్ని సంతరించుకుంది. దాంతో, 1944 భువనగిరి నిజాం ఆంధ్ర మహాసభ నాయకత్వం ప్రజాఉద్యమశక్తుల చేతుల్లోకి వచ్చింది. దాంతో భాషోద్యమం రూపమే కాదు సారం కూడా మారిపోయింది.

'ఒక వీరుడు మరణిస్తే వేల కొలది ప్రభవింతురు!!' అని అనగలిగే వజ్రాయుధం లాంటి పోరాట చైతన్యం మన వర్తమాన సంక్షోభ కాలానికి ఎందుకు అవసరమో విశ్లేషించుకోవాల్సి వుంది. తెలంగాణ సాయుధ పోరాట సమయంలో రజాకార్ల దారుణ మారణకాండకు గురైన నగ్న మహిళను రైలులో చూసిన ఆరుద్ర ఆ పీడిత ప్రజల పక్షాన మమేకమై "త్వమేవాహం" కావ్య రచన చేశాడు. దాశరథి సోదరులు, వట్టికోట ఆళ్వారుస్వామి, తిరునగరి, సుద్దాల, కాళోజీ ఆ పోరాటంలో మమేకమై వున్నారు. అప్పటికే హైదరాబాదులో నిర్మాణశక్తిగా పెరుగుతున్న కార్మికోద్యమంతోనూ, విద్యార్థి యువజనోద్యమంగా సంఘటితమవుతున్న కామ్రేడ్స్ అసోసియేషన్‌తోనూ కలగలిసిన ఆంధ్ర మహాసభ సుసంఘటిత శక్తి అయింది. ఆ విధంగా ఆనాటి నిజాం నవాబు పరిపాలన కాలంలో దారుణమైనటువంటి పరిస్థితులను ప్రజా సాహిత్యం నమోదు చేసింది. ఎంతో విలువైన ప్రజా పోరాట సాహిత్యాన్ని తెలంగాణ సాయుధ పోరాటం పీడిత సమాజానికి ఆయుధంగా అందించింది. అదంతా నేటికి అన్వయించుకోవాల్సిన సాహిత్య, సామాజిక చరిత్ర.

"నీ బాంచెన్ దొరా!" అనే బానిస పరిస్థితుల నుండి ప్రజలు సాయుధ పోరాట చైతన్యాన్ని అందుకోవడానికి దారితీసిన సామాజిక సాంస్కృతిక, అణచివేత ధిక్కార క్రమాన్ని పరిశీలిస్తేనే, నాటి సంక్షోభ తీవ్రతని కనీసం ఆలోచించే చైతన్యాన్ని నేడు మనం అందుకోగలం.

ఆకునూరు, మాచిరెడ్డి పల్లె గ్రామ ప్రజలు దుర్భర ఆకలి, పేదరికంలో కొట్టుమిట్టాడుతున్నారు. అటువంటి పరిస్థితుల్లో లెవీ కట్టమంటే, సహజంగానే నిరాకరించారు. నిజాం పోలీసుల దుర్మార్గమైన అణచివేతతో ప్రజా ఉద్యమం మరింత ఊపందుకుంది. చిట్యాల ఐలమ్మలు వీరనారులుగా రూపొందారు. ఈ క్రమంలోనే 1946 జూలై 4న దొడ్డి కొమరయ్య అమరత్వంతో తెలంగాణ సాయుధ పోరాటానికి బీజం పడింది. అంతవరకు దొరల భూస్వామ్య దోపిడీ పీడనలో మగ్గిన తెలంగాణ ప్రజలు ప్రజాస్వామిక సాంస్కృతిక విలువలను సంతరించుకోవటం వల్ల వారి పోరాటం ఆయుధం కోసం ఆయుధం అన్న తీరుగా రూపుదాల్చలేదు. ధిక్కార ఉద్యమం మలుపు తిరిగి, భూమికోసం – భుక్తి కోసం – విముక్తి కోసం ఫ్యూడల్ వ్యతిరేక వ్యవసాయక విప్లవ పోరాటంగా బలోపేతమైంది. పేదలకు 10 లక్షల ఎకరాల భూమి పంపిణీ అయింది. దొరల ఫ్యూడల్ సంకెళ్ల నుండి 3000 గ్రామాలు విముక్తమయ్యాయి. మహిళల పాలిట భూలోక నరకాలుగా పేరుపొందిన వందలకొద్దీ గడీలు నేలకూలాయి. దొరల ధాన్యాగారాల నుండి వేలకొలది టన్నుల ధాన్యం ఆకలితో అలమటిస్తున్న ప్రజలకు పంపిణీ

అయింది. ఈ సాయుధ పోరాటం ప్రజా రచయితల్ని, ప్రజా కళాకారుల్ని పదును దేల్చింది. అపురూపమైన ఆ ప్రజాసాహిత్యం ఇప్పటికీ ఆ చారిత్రక పోరాట వాస్తవికతను ప్రతిబింబిస్తూ అందుబాటులో ఉంది.

సత్యం కోసం పోరాటం జీవన అవసరాల నుండే ఉత్పన్న మవుతుంది. ఇదొక చారిత్రక వాస్తవికత. ఈ చారిత్రక వాస్తవికతను తెలంగాణ సాయుధ పోరాటం మరోసారి రుజువు చేసింది. ఎందుకంటే, నిజాం నవాబుల పాలన, అగ్రకుల జమీందారుల జాగిర్దారుల అణచివేత పీడన, పటేల్ పట్వారి కరణాల దాష్టీకాలు, కర్కోటక రజాకార్ల మారణకాండ, ఫ్యూడల్ అహంకారాలు, ఆధిపత్యాలు, అధికారాలు ఓడిపోక తప్పలేదు. ప్రజలే చరిత్ర నిర్మాతలని తెలంగాణ సాయుధ పోరాటం నిరూపించింది.

ఆ తెలంగాణ పోరాటపు వాస్తవాలను మరుగుపరచి, మసిపూసి మారేడుకాయ చేసి, ఈరోజు ఈ దళారీ పాలకముఠాలు వంతులువారీగా, ప్రజల బలహీనతల మీద, విలోమ భావోద్వేగాల మీద, సంకుచిత మనోభావాలతో చాలా అసత్యాలను అదేపనిగా ప్రచారంలో పెడుతున్నారు. వాటినే సత్యాలుగా నమ్మమంటున్నారు. దీన్నే సామ్రాజ్య వాదుల, దళారీ పాలకవర్గాల వ్యూహాత్మకమైన "సత్యానంతరత" (Post Truth) అని ప్రజా మేధావులు చెప్తున్నారు. ఇది చాలా ప్రమాదకరమైన రాజకీయ క్రీడ.

ఆనాటి తెలంగాణలోనే కాదు, నేడు దేశమంతా సామ్రాజ్యవాద దోపిడీ పీడనలు రూపాలు మార్చుకుని కొనసాగుతూ ఉన్నాయి. ఆనాటి నెహ్రూ – పటేల్ నుండి, నేటి మోడీ – షా ల వరకు ప్రజావ్యతిరేక ఫ్యూడల్ సామ్రాజ్యవాద దళారీ మతతత్త్వ రాజకీయాల కోసం ఈ "సత్యానంతరత" వ్యూహమే రాజ్యమేలుతోంది. అవి తాత్కాలికంగా ఎన్నికల కోసం కూడా అయి వుంటాయి.

ఇక్కడే మనం సూటిగా ఎక్కుపెట్టాల్సిన ప్రశ్నలు రెండు ఉన్నాయి:

1. నెహ్రూ–పటేల్ ప్రభుత్వం చేసిన "మిలటరీ చర్య"ని "పోలీసు చర్య" అని నేటికీ ఎందుకు కుదిస్తున్నారు?!

2. నిజాం నవాబే మిలటరీ చర్యకు లక్ష్యం అయితే, నాలుగు రోజుల్లో లొంగిపోయిన నిజాం నవాబును వదిలిపెట్టి, నెహ్రూ పటేల్ సైన్యాలు గ్రామాల్లోకి ఎందుకు చొరపడ్డాయి?! మూడు సంవత్సరాలు గ్రామాల్లోనే వుండి ఏంచేశాయవి?!

3. అవే సైన్యాలు మరట్వాడా జిల్లాలలో వేలాది ముస్లిములను ఊచకోత కోసినట్లు రుజువుగా నిలిచిన పండిత సుందరలాల్ కమిషన్ నివేదిక నేటికీ రహస్యంగానే ఎందుకుంచారు?

1948 సెప్టెంబర్ తర్వాత 3000 మందికి పైగా తెలంగాణ ప్రజా పోరాట బిడ్డలను నెహ్రూ పటేల్ సైన్యం పొట్టన పెట్టుకుంది. తెలంగాణ గ్రామీణ ప్రజలని, ప్రత్యేకంగా మహిళలని రకరకాలుగా చిత్రహింసలకు గురిచేశారు. తెలంగాణ ప్రజల్ని ఇరుకైన డేరాల్లో కుక్కి, మలమూత్రాలకు కూడా అవకాశం ఇవ్వకుండా దారుణంగా నిర్బంధించారు.

నిజానికి పోలీసు చర్య అనేది దేశంలోపల ప్రజల మీద తీసుకునే చర్య. మిలటరీ చర్య అలాంటిది కాదు. ఒక దేశం మరో దేశం మీద తీసుకునే చర్య. ఈ లోపలి వాస్తవికతను మసిపూయడానికే "పోలీసు చర్య"గా చూపిస్తున్నారు. నిజానికి తెలంగాణ సాయుధ పోరాటం భూస్వామ్య వ్యవస్థ పునాదుల్ని కూకటి వేళ్ళతో పెకలించింది. ఇది చారిత్రక వాస్తవం. అందుకే సారంలో విముక్తి పథంలో వున్న తెలంగాణను భారత పాలకులు పరాయి దేశంగా భావించి మిలటరీ చర్యకు దిగారు. మరో వాస్తవం ఏంటంటే, అధికార మార్పిడి పేరుమీద భారత బడా బూర్జువా భూస్వామ్య దోపిడీ పునాదుల్ని కొనసాగించటానికి స్థిరపరచటానికి ఉద్దేశించినదే నాటి సైనిక చర్య. నిజానికి ఈ సైన్యాన్ని నిర్మించి పెట్టినది బ్రిటీషు సామ్రాజ్యవాద ప్రభువులు!!

నెహ్రూ – పటేల్ కేంద్ర ప్రభుత్వం సైనిక చర్య ముందు నిజాం ప్రభుత్వంతో యథాతథ ఒప్పందం కుదుర్చుకుంది. లొంగిపోయినాడని చెప్పుకునే నిజాం నవాబుకు సైనిక చర్య తర్వాత రెండేళ్ళకు రాజ ప్రముఖ్‌గా అధికార హోదాను ఇచ్చింది. 850 కోట్ల రూపాయలు విలువ చేసే రాజభరణాలు నిజాం నవాబుకే వదిలేశారు. పైగా ఏడాదికి 50 లక్షల రూపాయలు జీతంగా కూడా మంజూరు చేశారు. నవాబుకే కాదు, జమీందారులు జాగిర్దారులకు, ప్రజలు పోరాడి సాధించుకున్న భూముల్ని తిరిగి కట్టబెట్టారు. ఆ విధంగా తెలంగాణ భూస్వామ్య వ్యవస్థని పునరుద్ధరించారు. మూడు పాతికల భారత దళారీ పాలకుల విద్రోహపూరిత జిత్తులమారి రాజకీయ క్రమం కూడా ఇదే.

ఈ నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకునే 1981లో 'ప్రజాసాహితి' తెలంగాణ పోరాట సాహిత్య ప్రత్యేక సంచికను, 1982వ సంవత్సరంలో తెలంగాణ పోరాట కథలను ప్రచురించటమేకాక 2007లో 1981 నాటి సంచికను జనసాహితి మళ్లీ ముద్రించింది. ఒక ప్రజాతంత్ర మాసపత్రిక పునర్ ముద్రణకు నోచుకుందంటే, ఆ సామాజిక వ్యవస్థలో ఆశించిన మార్పు లేదన్నదే కదా అసలు వాస్తవికత. తెలంగాణ సాయుధ పోరాట సంస్కృతి సృష్టించిన 20 నవలల పరిచయ సమీక్షలతో జనసాహితి ఒక విశిష్ట గ్రంథాన్ని (2011) కూడా ముద్రించింది. ఆనాటి పోరాటంతోనూ దాని సాహిత్యంతోనూ ఎలాంటి సంబంధంలేని నేటి మతతత్త్వ రాజకీయ ముఠా అయిన బిజెపి తెలంగాణ ముస్లిం నవాబు నుండి విమోచన అంటూ మతతత్త్వ అరాచకాల్ని రగిలించి అధికార పీఠానికి ఎగబాకాలని చూస్తోంది. అలాగే తెలంగాణ రాష్ట్ర సమితి అనే పాలక ముఠా కూడా ఈ మత చిచ్చు స్థితుల నుండి విలీనం అంటూ పేలాలు ఏరుకోవడానికి సిద్ధపడుతోంది.

నిజానికి తెలంగాణ సాయుధ పోరాటం ముస్లిం మత వ్యతిరేక పోరాటం కాదు. షేక్ బందగి లాంటి ఫ్యూడల్ ధిక్కార యోధుల్ని, సాయుధ పోరాట పిలుపునిచ్చిన కార్మికోద్యమ నాయకుడు ముగ్దుం మొహియుద్దీన్ వంటి కవులను, రచయితలను, షోయబుల్లా ఖాన్ లాంటి కాకలు తీరిన పత్రికారచయితల్ని, జువాద్ రజ్వీ లాంటి కామ్రేడ్స్ అసోసియేషన్ నాయకులను, హబీబుద్దీన్, సయ్యద్ ఇబ్రహీం, అలంఖీర్ లాంటి నిజాం వ్యతిరేక పోరాట శక్తుల్ని, ...ఇంకా నిజాం ఫర్మానాన్ని

ధిక్కరించి, ఆగస్టు 15 కి భారత స్వాతంత్ర పతాకను ఎగరవేసిన రఫీ అహ్మద్, నిజాం కుటుంబంలో పుట్టి, నిజాం పాలనను ధిక్కరించి, అభ్యుదయ కవిత్వం రాసిన జహందార్ అఫ్సర్.... ఇలా చెప్పుకుంటూపోతే తెలంగాణ సాయుధ పోరాటం కుల మతాలకు అతీతంగా ఒక ప్రజాతంత్ర సంస్కృతిని నిలువెత్తు పతాకంగా ఆవిష్కరించింది. ఆ చారిత్రక సత్యాన్ని నయవంచక వక్రీకరణలతో సత్యానంతరత అనే కుటిల వ్యూహాలతో పాలకవర్గాలు నేడు తూట్లు పొడిచే ప్రయత్నాలు సాగుతున్నాయి. అంటే మనం తెలుసుకోవాల్సిన వర్తమాన వాస్తవికత ఏంటంటే, మనం ఇప్పుడు హిందూ రజాకార్ల పాలనలో ఉన్నామని!!

కులాలకు మతాలకు ప్రాంతీయ వాదాలకు భాషాద్వేషాలకు జండర్ వివక్షలకు అతీతమైన భూస్వామ్య సామ్రాజ్యవాద వ్యతిరేక సంఘటిత సాంస్కృతిక పోరాటాలు ప్రజాఉద్యమాలు పురుడు పోసుకోవాల్సిన సందర్భంలో ఉన్నాం. పుడమి తల్లికి పురిటి నొప్పులు కొనసాగుతూనే వున్నాయి.

'వీరతెలంగాణా విప్లవ పోరాట గాథలు' రచించిన కవి హరీంద్రనాథ్ చటోపాధ్యాయ చెప్పినట్లు **"ఇది జోస్యంకాదు కాదు, ఇతిహాసపు గతితర్కం, అధికారపు పీఠాలను, అది గాలికి ఎగురకొట్టు"!!**

22 సెప్టెంబర్ 2022

దీర్ఘ కవిత

# రంగు వెలిసిన చిత్రం

– శీలా సుభద్రాదేవి

(గత సంచిక తరువాయి....)

ఎప్పుడో అకస్మాత్తుగా
ఎన్నికలకోడి మీడియా గూట్లోంచి కూస్తుంది
అంతే
అంతవరకూ నిశ్చింతగా నిద్రమత్తులో జోగుతున్న
బంగారుకోడిపుంజులన్నీ ఒక్కసారిగా లేచి
బద్ధకపురెక్కల్ని టపటపలాడించుకుంటూ
మత్తువదిలించుకుని గొంతు సవరించుకుంటూ
కొక్కొరొకో మంటూ కూతలు మొదలెడ్తాయ్
ఎగరటం చేతకాని పక్షులన్నీ గెంతులేస్తుంటాయ్
ఎటుగెంతాలో తెలియని వన్నీ ఆలోచించి ఆలోచించి
నెమ్మదిగా గోడమీదకి ఎగబాకుతాయ్
దేనికి తోచిన కూతల్ని అదికూస్తూ
అందమైన రాగాలాపాల్ని సాధన చేస్తూ
జనాల్ని ఆకర్షించటానికి విశ్వప్రయత్నాలు చేస్తాయి

★ ★ ★ ★ ★

ముందస్తుగానే అశరీరవాణో ఆకాశవాణో
శృతిపేయంగా ప్రచారగీతాల్ని
గాలిలోకి పావురాల్లా ఎగరేస్తుంటే
నట్టింట్లో కూచుని అచ్చుక్క బుచ్చుక్క కబుర్లు చెప్పే
ముద్దుల ప్రియదర్శిని
రంగుల పరదాలు సవరించుకుంటూ
అందమైన సీతాకోకచిలుకలు
ఎంచక్కని చిలకపలుకులతో
అభివృద్ధి పథకాలు ఫలాల్ని
ముక్కున కరిచి తెచ్చిచ్చినంత సంబరంగా
పాటల్తో మాటల్తో మెస్మరిజం చేస్తూ
నృత్యాలతో కళ్ళకు పొరలు కప్పుతూ
విశ్వరూప అభినయచాతుర్యాలతో
ప్రజాస్వామ్య రంజక ప్రచారరథసారథులై
జనాల్ని ఆలోచనల్ని కొల్లగొట్టి
ఓటర్లుగా మార్చటానికి
పాములూ నిచ్చెనల
వైకుంఠపాళీ ఆటలు ఒకవైపు !

ఆవేశకావేషాల నిప్పులు కురిపిస్తూ
ఎదుటివారి అభిప్రాయాలకు బ్రేకులు వేస్తూ
ఒకరి సంభాషణల్లోకి ఇంకొకరు చొచ్చుకుపోయి
కలగాపులగంగా అర్థరహితంగా
శ్రోతలు చెవుల్ని చిల్లులు పొడుస్తూ
చర్చోపచర్చలు మరోవైపు!

ఎవరికెన్ని గెలుపు గుర్రాలో
ఎవరికెన్ని పందెంకోళ్ళో
ఏ కోటకు ఎవరు రాజో
ఏ ప్రాంతానికి ఎవరు మంత్రో
ఏ రాజును ఎలా పడగొట్టాలో
ఏ మంత్రిని ఎలా మాటెయ్యాలో
వెనకనడిచే భక్తులెందరో
చేజారే బంటులెవ్వరో
ఏ గెలుపుకు ఎన్ని ఎత్తులో
ఏ నాటకానికి ఎలా తెరదించాలో
ఎత్తులూ పైఎత్తులుతో
చదరంగపు జిత్తులు ఇంకోవైపు !

★ ★ ★ ★ ★

(మూడవ భాగం వచ్చే సంచికలో....)

కథ

# ఓడిపోయాను

హిందీ మూలం : మన్నూ భండారి

అనువాదం : డా॥ వెన్నావల్లభరావు

**కవి** సమ్మేళనం పరిసమాప్తమయ్యిందో లేదో సమావేశ మందిరమంతా నవ్వులు, కేరింతలు, చప్పట్లతో మార్మోగిపోయింది. బహుశా నాకొక్కదానికేనేమో ఆ చివరి కవిత విని కోపంతో ఒళ్ళు మండిపోయింది. ఆ కవిత పేరు 'కొడుకు భవిష్యత్తు'. క్లుప్తంగా కవిత సారాంశం చెపుతాను, వినండి : ఒక తండ్రి తన కుమారుని భవిష్యత్తు అంచనా వేయటం కోసం అతని గదిలో ఒక సినీనటి ఫొటో, బ్రాందీ సీసా, భగవద్గీత ఉంచుతాడు. కొడుకు ఏకాంతంలో ఏం చేస్తాడో చూద్దామని గదిలోనే దాక్కొని ఉంటాడు. అతడు గదిలోకి రావడంతోటే ముందుగా సినీనటి ఫొటోను చేతిలోకి తీసుకుంటాడు. అతని ముఖం ఆనందంతో వెలిగిపోతుంది. ఫొటోను గుండెలకు హత్తుకుంటాడు. ముద్దు పెట్టుకుంటాడు. తరువాత బ్రాందీ సీసా మూత తెరిచి నాలుగు గుక్కలు తాగుతాడు. పిమ్మట భగవద్గీత చేతిలో పెట్టుకుని చాలా గంభీరంగా గది బయటకు వెళతాడు. కొడుకు వ్యవహారాన్ని గమనించిన తండ్రి అతని భవిష్యత్తుని అంచనావేసి 'ఈ వెధవ, రాజకీయ నాయకుడవుతాడు'అని తీర్మానించుకుంటాడు.

కవిగారు ఈ చివరిపంక్తి చదివాడో లేదో సభాస్థలిలో ఒక మూల నుంచి మరో మూలకి నవ్వుల అల పరుగు తీసింది. నాకైతే నాయకుల్ని అవమానించిన తీరు చూసి పట్టరాని కోపం వచ్చింది. దానికి తోడు నాతో వచ్చిన స్నేహితురాలు వ్యంగ్యంగా నాతో 'నీకు ఈ కవిత ఎంతమాత్రం నచ్చుండదులే! మీ నాన్న పెద్ద నాయకుడు కదా!' అన్నది.

నేను కోపంతో 'నచ్చటమా? ఇంత అసహ్యమైన దరిద్రపుగొట్టు కవిత నేనింతవరకు వినలేదు' అన్నాను.

మా స్నేహితురాలి వ్యంగ్యంలోని మర్మం నేను బాగా అర్థం చేసుకున్నాను. ఆమె కోపం చాలా మటుకు 'ద్రాక్ష పళ్ళు అందని...' వారి ఆక్రోశం లాంటిది. ఆమె తండ్రి ఎన్నికల్లో మా నాన్నకి ప్రత్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. ఆ ఓటమి అక్కసు ఆమె ఇంకా మర్చిపోలేదు. ఈరోజు ఈ కవిత విన్నాక ఆవిడ హృదయంలోని అసూయ వెళ్ళగక్కుకునే అవకాశం వచ్చింది. తన తండ్రి ఓటమి కూడా తనకీరోజు ఉపయోగ పడినట్లు ఆమెకి అనిపించింది. కానీ నా మనసులో మాత్రం ఇంకేదో సుడులు తిరగ సాగింది.

నేను కోపంతో బయటకి వెళ్లి కారులో కూర్చున్నానన్నమాటేగాని, నన్ను నమ్మండి, ఇంటికి వెళుతున్నంతసేపు ఒకటే ఆలోచన– ఆ కవికి ఏ విధంగా జవాబు చెప్పాలా అని. మా నాన్నగారి పాలనలోనే నాయకుల పట్ల ఇటువంటి పనికిమాలిన ఆరోపణలు సహించి ఊరుకోదగినదేనా!

కవిత ద్వారానే దానికి సమాధానం చెప్పాలి అనుకున్నాను, కానీ ఆ దిశగా మునుపెన్నడూ అడుగు ముందుకు వెయ్యలేదు. అందుకే కవిత్వంతో కాదు, కథ ద్వారా జవాబు ఇవ్వదలచాను. నా కథలో సర్వగుణ సంపన్నుడైన నాయకుడిని నిర్మించే ప్రణాళిక సిద్ధం చేశాను. దాన్ని చదివి ఆ కవి పరాజయం అంగీకరించి తీరుతాడు అని భావించాను. నిండు సభలో పిచ్చి కూతలు కూసిన వ్యక్తికి కుక్క కాటుకు చెప్పు దెబ్బగా ఉంటుందని, ఎట్టి పరిస్థితుల్లోనైనా నా వాదమే పైచేయిగా నిలుస్తుందని భావించాను.

ఇదే ఆలోచిస్తూ నా గదిలోకి అడుగు పెట్టాను. గోడకు వేలాడుతున్న గొప్ప గొప్ప నాయకుల చిత్రపటాలు నా దృష్టిని ఆకర్షించాయి. ఆ ప్రతిభావంతుల దివ్యమైన ముఖారవిందాలు నన్ను ప్రోత్సహించ సాగాయి. ఆ మహా నాయకులందరి వ్యక్తిగత సద్గుణాలన్నింటినీ నా కథలోని నాయకునిలో చొప్పించాలని నిర్ణయించుకున్నాను.

ఒక వారం పాటు నేను గొప్ప గొప్ప నాయకుల జీవిత చరిత్రలు చదివి, రాయబోయే కథలోని నాయకుని స్వరూప స్వభావాల్ని ఊహించుకో సాగాను. చాలామంది మహనీయ నాయకుల గురించి విని, చదివి అనేక విషయాలు గ్రహించాను. కమలం బురదలోనే పుట్టినట్టు, గొప్ప గొప్ప వాళ్ళు పేదల ఇళ్లల్లోనే జన్మించారని తెలిసింది. బాగా ఆలోచించి ఒక శుభ ముహూర్తం చూసుకుని అన్ని సద్గుణాలు సంతరించుకున్న నా నాయకుడిని పల్లెటూర్లో ఒక పేద రైతు పూరిగుడిసెలో జన్మింపజేశాను.

మనసులో కోరికలు, ఆశలు పెరిగే విధంగా నా నాయకుడు కూడా ఎదగ సాగాడు. బడికి వెళ్లే ఈడు రాగానే గ్రామంలోని స్కూల్లోనే అతని చదువు ప్రారంభమైంది, ఆ ఏర్పాటుకు నేనైతే పూర్తిగా సంతృప్తి చెందలేదు, కానీ గత్యంతరం లేని స్థితిలో నా అంతట నేనే అటువంటి పరిస్థితి కల్పించాను. క్రమక్రమంగా అతడు మాధ్యమిక తరగతులు ఉత్తీర్ణుడయ్యాడు. అప్పటికే ప్రపంచంలో లేని గొప్ప గొప్ప వ్యక్తుల జీవితాల్ని, విప్లవోద్యమ చరిత్రల్ని అతను చదివేశాడు. చూడండి, ఎనిమిదవ తరగతి చదివే కుర్రాడు ఈ విషయాలన్నింటినీ ఎలా అర్థం చేసుకోగలడు అని మీరు మధ్యలో ప్రశ్నించొద్దు. ఇది పూర్తిగా అసహజమైన విషయమే. ఇప్పుడు నేను మీరు వేసే ఏ ప్రశ్నకీ సమాధానం ఇచ్చే మనఃస్థితిలో లేను. ఈ కుర్రాడు ఒక గొప్ప భావి నాయకుడు అని మీరు మర్చిపోవద్దు సుమా!

అవును, ఇవన్నీ చదివి అతని మనసులో గొప్ప గొప్ప కోర్కెలు రేకెత్త సాగాయి, గొప్ప గొప్ప కలలు సాకారం అవ్వ సాగాయి, సరికొత్త ఉత్సాహం పొంగ సాగింది. ఎక్కడ ఏ అన్యాయం జరిగినా అతడు పిడికిలి బిగించి వాటిని రూపుమాపుతానని ప్రతిన పూనుతున్నాడు. దానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించుకుంటున్నాడు. అతని ప్రతినల్లోను, ప్రణాళికల్లోను నా విజయం తారసపడసాగింది. ఒకసారి ప్రాణాలకు తెగించి జమిందారుగారి గుమస్తాలతో కూడా అతను తలపడేటట్టు చేశాను. అప్పుడు అతని విజయంపై అతని కంటే ఎక్కువ సంతోషం నాకే కలిగింది.

ఇంతలో అకస్మాత్తుగా ఒక సంఘటన జరిగింది. అతని తండ్రి ఆకస్మికంగా మరణించాడు. వైద్యానికి – మందులకు కూడా ఇంటిలో డబ్బు లేదు. దానితో అతని తండ్రి గిలగిల తన్నుకుని ప్రాణాలు విడుస్తున్నా పాపం అతనేమీ చెయ్యలేకపోయాడు. దయనీయమైన స్థితిలో తండ్రి మరణించటంతో అతనికి భరింపరాని బాధ కలిగింది. వృద్ధురాలైన అతని తల్లి ఏడ్చి ఏడ్చి ప్రాణాలైతే విడవలేదు గాని, కంటిచూపు కోల్పోయింది. ఇంట్లో విధవరాలైన మేనత్త, క్షయవ్యాధితో బాధపడుతున్న చెల్లెలు కూడా ఉన్నారు. అందరి పోషణ బాధ్యత ఒక్కసారిగా అతనిపైనే పడింది. దమ్మిడీ ఆదాయం లేదు. కొద్దిపాటి భూమి ఉంటే, జమీందారు పన్ను బకాయిల నిమిత్తం హస్తగతం చేసేసుకున్నాడు. తన తండ్రి వినయం, మాట మంచితనం కారణంగా ఇప్పటివరకు ఆయన మౌనంగా ఉన్నాడు. ఇక ఇప్పుడు ఎందుకు ఊరుకుంటాడు? విప్లవకారుడయిన అతని కొడుకు గురించి జమీందారుకి తెలుసు. అందుకే అవకాశం రాగానే ప్రతీకారం తీర్చుకున్నాడు.

ఇప్పుడు నా భావి నాయకుని ముందు పెను సమస్య వచ్చి పడింది. సలహా కోసం అతను నా దగ్గరకొచ్చాడు. నేను అతనితో "ఇప్పుడు సమయం వచ్చింది. నువ్వు ఇల్లు–వాకిలి, తిండి–తిప్పలు గురించిన ఆలోచనలన్నీ పక్కన పెట్టి దేశ సేవకు నడుం కట్టు. నువ్వు దేశాన్ని చక్కదిద్దాలి. నవ నిర్మాణం గావించాలి. దోపిడీకి గురయ్యేవారి కోసం గళమెత్తి వర్గ హీన సమాజాన్ని స్థాపించాలి. వీటన్నిటిని నువ్వు విజయవంతంగా నిర్వహించగలుగుతావు. అందుకు అవసరమైన సద్గుణాలన్నీ నేను నీలో నింపాను. వెంటనే కార్యోన్ముఖుడివవ్వు" అని హితవు పలికాను.

అప్పుడతను చాలా నిరుత్సాహంగా "అంతా బాగానే ఉంది కానీ గుడ్డిదైపోయిన మా అమ్మ, జబ్బుతో ఉన్న నా చెల్లెలు సంగతేమిటి? నాకు దేశమంటే ఎనలేని ప్రేమే. కానీ నా వాళ్ళంటే కూడా నాకు తక్కువ ప్రేమేమీ లేదు" అన్నాడు.

అతని మాటలు విని నేను మండిపడ్డాను "నువ్వు కాబోయే నాయకుడివని మర్చిపోయావా? నాయకుడవ్వటమంటే ఆషామాషీ అనుకున్నావా? నాయకులనేవాళ్ళు తన గురించి, తన కుటుంబం గురించి ఆలోచించరు. వాళ్లు దేశం గురించి, సమాజం గురించి మాత్రమే ఆలోచిస్తారు. నువ్వు నా ఆజ్ఞానుసారమే నడుచుకోవాలని మర్చిపోకు. నేను నిన్ను సృష్టించిన దాన్ని, నీ విధాతను."

అతను నా మాటల్ని పట్టించుకోకుండా "అది నిజమే, కానీ అంధురాలైన మా అమ్మ బాధ పడటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నేను భరించలేను. నువ్వు నాకు ఎక్కడైనా ఉద్యోగం ఎందుకు ఇప్పించకూడదు? కుటుంబం జరుగుబాటుకు నాకు ఏదన్నా ఆధారం దొరికితే అప్పుడు మిగిలిన సమయాన్నంతా ఆనందంగా దేశ సేవకే వినియోగిస్తాను. నువ్వు కన్న కలల్ని సహకారం చేస్తాను. ముందు నువ్వు మాకు కడుపు నింపే ఏర్పాటు చెయ్యి" అన్నాడు.

మా నాన్నగారు పనిచేసే విభాగంలోనే అతనికి ఏదైనా ఉద్యోగం ఇప్పించుదామని ఆలోచించాను. కానీ నాన్నగారి ఉదార వైఖరి కారణంగా అక్కడ ఒక్క ఉద్యోగమూ ఖాళీ లేదు. అన్నిటికి అన్నీ భర్తీ అయిపోయాయి. అందువల్ల అతనికి ఎక్కడా ఉద్యోగం ఇప్పించలేకపోయాను. అతని నోరైతే కట్టగలిగానుగానీ కడుపు నింపే ఏర్పాటు చేయలేకపోయాను. గత్యంతరం లేని స్థితిలో అతను కూలి పని చేయటం ప్రారంభించాడు. ఊళ్లో జమీందారు కొత్తగా భవంతి కట్టిస్తుంటే, అక్కడ అతను ఇటుకలు మోసే పని చేయ సాగాడు. తలపై ఇటుకలు ఎత్తుకుంటుంటే, అతని ఆశలు అడుగంటిపోసాగాయి. నేను ఎన్నోసార్లు ఆ పని మానేయమని అన్నాను. ఆమాట చెప్పినప్పుడల్లా అతను తన తల్లి–చెల్లి దైన్యాన్ని గురించి చెప్పి నన్ను నోరు మెదపనీయకుండా చేసేవాడు. నాకు అతని మీద అమితమైన కోపం వచ్చేది. అయినా నా నమ్మకం బ్రతికే ఉంది. ఎందుకంటే గొప్ప గొప్ప సద్గుణాల్ని, ప్రతిభా పాటవాల్ని ఉగ్గుపాలతో అతనికి పట్టించాను. అవన్నీ ఎలాంటి స్థితిలోనైనా ప్రభావాన్ని చూపి తీరతాయి అని భావించి, అతన్ని అతని అదృష్టానికి విడిచి పెట్టాను. ఒక తటస్థ ప్రేక్షకురాలుగా అతని ప్రతి కదలికను గమనిస్తూ ఉండిపోయాను.

ఇంతలో జబ్బుతో ఉన్న అతని చెల్లి పరిస్థితి విషమించింది. చెల్లెలంటే అతనికి చెప్పలేనంత ప్రేమ. ఆమె వైద్యానికి పట్టణంలో గల అవకాశాన్ని తెలుసుకునేందుకు, పనికి సెలవు చెప్పి పట్నం వెళ్లి ఆరా తీశాడు. చాలా డబ్బు ఉంటే తప్ప తన చెల్లి బ్రతకదని అతనికి అర్థమైంది. పట్నం నుంచి తిరిగి వచ్చేటప్పుడు తన చెల్లి దీనంగా ఆరుస్తున్న అరుపులే అతని హృదయాన్ని కకావికలం చెయ్యసాగాయి. "అన్నయ్యా! నన్ను కాపాడు. ఎలాగైనా డబ్బు సమకూర్చు, నన్ను కాపాడు. అన్నయ్యా! నాకు చనిపోవాలనిలేదు..." అని చెల్లెలు దీనంగా అంటున్నట్లు అనిపించింది. ఆ సమయంలో తన తండ్రి మరణించిన దృశ్యం అతని కళ్ళ ముందు మెదిలింది. తండ్రిని కోల్పోయానని బాధపడ్డాడు. ఊరికి వచ్చి డబ్బున్న వాళ్ళందరి వద్దకు వెళ్లి అప్పు ఇవ్వమని ప్రాధేయపడ్డాడు. చేతులెత్తి దండాలు పెట్టాడు. కానీ నిరాశే ఎదురైంది. ఆ వైఫల్యంతో అతని ఉద్రేకమైన మనసు రగిలిపోయింది. పగలంతా ఎవరితోనూ ఏమీ మాట్లాడకుండా ఏవేవో ఆలోచనలు చేస్తూ గడిపాడు. సుమారు అర్ధరాత్రి అయ్యేసరికి ఒక నిర్ణయానికొచ్చాడు.

అతను దొంగతనానికి పాల్పడబోతున్నాడని తెలిసి నేను కంపించిపోయాను. నేను రుపొందించబోయిన నాయకుడు ఇలా పతనమవ్వటమా! దొంగతనం చేస్తాడా! ఛీ ఛీ! దొంగతనం చేసి తన నైతికతను చంపుకొనేలోపు నేనే అతన్ని పరిసమాప్తి గావించాను... అప్పటివరకు నేను రాసిన కథ పేజీలన్నీ చింపి ముక్కలు చేసిపారేశాను.

మళ్లీ కలం పట్టాను. ఈసారి నాయకుడు మారిన రూపంలో, మారిన పరిస్థితులలో మరొకసారి ఈ లోకంలోకి వచ్చాడు. ఈసారి అతను పట్టణంలో కోటీశ్వరుని ఇంట జన్మించాడు. అక్కడతనికి కడుపు నింపుకోవడానికి, జబ్బు చేసిన చెల్లి వైద్యానికి సమస్యలు లాంటివి లేనే లేవు. అల్లారుముద్దుగా సిరిసంపదల మధ్య పెరగసాగాడు. పెద్ద పేరున్న స్కూల్లో అతను చదువుకున్నాడు. అతని అలౌకిక ప్రతిభ చూసి అందరూ ఆశ్చర్యపోసాగారు. అన్యాయాల్ని, అత్యాచారాల్ని చూసి అతను చలించిపోయేవాడు. ఆవేశంగా ప్రసంగం చేసేవాడు. పల్లెటూళ్ళకి వెళ్లి నిరక్షరాస్యులైన పిల్లలకి చదువు చెప్పేవాడు. పేదరికం చూసి అతని హృదయం వెన్నలా కరిగిపోయేది. ధనవంతుడై ఉండి కూడా నిరాడంబర జీవితం గడుపుతూ ఉండేవాడు. ఒక్కమాటలో చెప్పాలంటే గొప్ప నాయకుడు అయ్యే శుభ లక్షణాలన్నీ అతనిలో కనిపించసాగాయి. అడుగడుగునా నా సలహా తీసుకుంటున్నాడు. నేను కూడా అతని భావి జీవితపు పటాన్ని అతని మనసులో పూర్తిగా ముద్రింపజేశాను. ఎట్టి పరిస్థితుల్లోనూ అతను దారి తప్పకూడదని శ్రద్ధ వహించాను.

మెట్రిక్ పాసై అతను కాలేజీలో అడుగు పెట్టాడు. పెద్ద పేరుమోసిన కాలేజీ అది. ఒకానొక సమయంలో అందులో కేవలం జమీందార్ల పిల్లలే చదువుతూ ఉండేవారు. అక్కడ సర్వత్రా ఖరీదైన వాతావరణమే. అలాంటి కాలేజీలో తండ్రి అతన్ని చేర్పించాడు. నేను ఎంత జాగ్రత్త తీసుకున్నా ధనవంతుల పిల్లల సాంగత్యం అతనిపై ప్రభావం చూపక మానలేదు. ఇప్పుడిక అతను స్వేచ్ఛా జీవితానికి అలవాటుపడ్డాడు. నా సలహా సంప్రదింపులు అతనికి రుచించటం లేదు. గంటల తరబడి రెస్టారెంట్లలో గడపసాగాడు. ఒకరోజు అతన్ని నేను హౌసీ ఆడుతూ ఉండగా చూశాను. నా గుండె ఆగినంత పని అయింది. జూదమా! అయ్యో! ఏమిటి వీడు ఇలా తయారయ్యాడు? నేను సంభాళించుకుని కుర్చీలో కూలబడ్డాను. కలాన్ని గట్టిగా పట్టుకున్నాను. అతని ఆకతాయితనాన్ని అదుపులో పెట్టానా అన్నట్టు కలాన్ని ఒడిసి పట్టుకున్నాను. కానీ ఇప్పుడు అతనికి రెక్కలొచ్చాయి. కేవలం జూదమే అతని నైతిక పతనానికి సరిహద్దు కాలేదు. కొన్నాళ్ళ తరువాత నేనతన్ని తాగుతుండగా చూశాను. నా కోపం కట్టలు తెంచుకుంది. పిలిచిదగ్గర కూర్చోబెట్టాను. రగులుతున్న కోపాన్ని నియంత్రించుకుని "నిన్ను నేను ఏ ఆశయంతో తయారు చేశానో తెలుసా?" అని అడిగాను.

అతను కూడా నన్ను ఎదుర్కోవటానికి పూర్తిగా సిద్ధమై వచ్చాడు."నీ స్వార్థం కోసం. నీగొంతెమ్మ కోర్కెలు తీర్చుకోటానికి నన్ను తయారు చేశావు. నాకైతే నీ ఇష్టానుసారం నడుచుకోవాల్సిన అవసరం లేదు. నా అస్తిత్వం నాకుంది. నా ఆలోచనలు నాకున్నాయి" అన్నాడు.

నేను గద్దించాను. "ఎవరితో మాట్లాడుతున్నావో తెలుస్తుందా నీకు? నేను నీ సృష్టికర్తను. నిర్మాతను. నా ఇష్టానికి విరుద్ధంగా నీకు స్వతంత్ర అస్తిత్వం లేదు" అన్నాను.

ఆ మాట విని అతను ఒక నవ్వు నవ్వాడు. "నువ్వు కేవలం నీ కలంతో నన్ను సృష్టించావు. నా స్నేహితుల్ని చూశావా! వీళ్ళ తల్లులు వీళ్ళని తమ రక్తమాంసాలు ఇచ్చి కన్నారు. అయినా నువ్వు జోక్యం చేసుకుంటున్నంతగా వీళ్ళ తల్లులు వీళ్ళ వ్యక్తిగత జీవితంలో జోక్యం చేసుకోవటం లేదు. 'నేనేదో మనిషిని కాదు, కొయ్య బొమ్మన'న్నట్టు అడుగడుగునా ఇది చేయొద్దు, అది చేయొద్దు అని ఇప్పటికే నన్నెంతో విసిగించావు. నువ్వనుకునే నేతాగిరి నావల్ల కాదు. ఈ వయసు, ఈ రంగుల లోకం, ఇంట్లో ఐశ్వర్యం. ఆనందాన్ని అనుభవించకుండా జీవితాన్ని నాశనం చేసుకోమంటావా? ఇవన్నీ చేసి నాయకుడు అవ్వటం కుదరదా?" అని ప్రశ్నించాడు.

నేనేదో అనబోయేలోపే ఈల వేసుకుంటూ కులాసాగా అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

అతని దురుసుతనాన్ని, దౌష్ట్యాన్ని నేను ఎలా సహించి ఉంటానో మీరే ఊహించుకోండి. మునుపటి నాయకుడి కథ ముగించినట్టుగానే వీణ్ణి కూడా సమాప్తం చేసి పారెయ్యాలని ఆ క్షణాన నాకు అనిపించింది. కానీ కోపం కంటే బాధ ఎంత ఎక్కువ కలిగిందంటే ఏమి చెయ్యడానికీ శక్తి లేకపోయింది.

ఇంత జరిగిన తర్వాత కూడా బహుశా అతను మళ్లీ సరైన దారికి వస్తాడేమోనన్న చిన్న ఆశేదో నా మనసులో మిగిలి ఉంది. గాంధీగారి లాంటివాడు కూడా చిన్నతనంలో ఒకసారి దొంగతనం చేశారు. ఇంకేవో తప్పులు కూడా చేశారు. కానీ తనంతట తానుగా మంచి దారిలోకి వచ్చారు. ఇతను కూడా బహుశా తన చెడు ప్రవర్తనకి పశ్చాత్తాపపడి తనంతట తానే మంచి దారిలోకి వస్తాడేమో! ఇక నేను అతనికి ఆదేశాలివ్వడం కట్టిపెట్టి, తన తప్పు తెలుసుకుని నా కాళ్ళపై పడి క్షమాపణ కోరే రోజు వస్తుందని శాంతంగా ఎదురుచూడసాగాను.

అయితే అలాంటి శుభ దినం ఎన్నటికీ రాలేదు. కలలో కూడా ఊహించని రోజు మాత్రం వచ్చింది. ఒక చక్కని సాయంత్రం వేళ అతను ప్రత్యేకంగా అలంకరించు కుంటున్నాడు. అందమైన సిల్క్ శర్వాణి ధరించాడు. సిగరెట్ తాగే పెదవులు కిళ్ళీ వేసుకోవడం వల్ల ఎర్రబడ్డాయి. సెంటు గుబాళిస్తోంది. ఇంతలో బయట హారన్ మోగింది. అతను కులాసాగా కూనిరాగాలు తీస్తూ వెళ్లి ఫ్రెండ్ వచ్చిన కార్లో కూర్చున్నాడు. కారు ఒక బార్ ముందు ఆగింది. జమీందారు బిడ్డలిద్దరూ రాత్రి పొద్దుపోయే వరకు పెగ్గు మీద పెగ్గు తాగుతూనే ఉన్నారు. అశ్లీలమైన జోకులు వేసుకుంటూ పగలబడి నవ్వుకున్నారు. రాత్రి 9 గంటలకు లేచారు. వాళ్ళ కాళ్ళు తడబడుతున్నాయి. ఎలాగోలా వెళ్లి కార్లో కూలబడ్డాడు. డ్రైవర్‌తో ఫలాన వీధికి పోనిమ్మని చెప్పారు, ఆ ప్రదేశం పేరు రాయాలంటేనే నాకు సిగ్గుగా ఉంది.

నన్ను నేను నిగ్రహించుకోవాలని ఎంతో ప్రయత్నించాను, అతని పతనాన్ని చూసి

సహించలేకపోయాను. ఇక ఆ రోజు అటోఇటో తేల్చుకోవాలని నిర్ణయించుకున్నాను. కోపంతో ఊగిపోతూ అతని వద్దకు వెళ్లాను. నిజానికి ఆ స్థితిలో అతనితో మాట్లాడటానికి కూడా నాకు అసహ్యం అనిపించింది. క్రోధంతో నా అణువణువు రగిలి పోసాగింది. అయినా నన్ను నేను నిగ్రహించుకుంటూ సాధ్యమైనంత మృదువుగా "నిన్ను ఆఖరిసారిగా హెచ్చరించడానికి వచ్చాను. నువ్విలా సర్వ నాశనమైపోతుంటే చూసి నా హృదయం ఎంత బాధ పడుతున్నదో నీకు తెలుసా? ఇప్పటికైనా మించిపోయింది ఏమీ లేదు. నిన్ను నువ్వు సంభాళించుకో. తెలియక తప్పుచేసి పెడదోవ పట్టినా, తప్పు తెలుసుకుని మంచి దారిలోకి రావడం ఆమోదయోగ్యమైనదే!" అన్నాను.

కానీ ఆ సమయంలో బహుశా అతను నాతో మాట్లాడటానికి సిద్ధంగా లేడు. కిళ్ళీ నములుకుంటూ "చూడు తల్లి! నువ్వు పొద్దస్తమానం నా వెంట పడి నేతాగిరి అంటూ ఎందుకు నా ప్రాణం తీస్తావు? నీ నేతాగిరి ఎక్కడ, ఈ రంగేళి రవళి ఎక్కడ! ఒక్కసారి చూశావంటే నీకే కళ్ళు జిగేల్ మంటాయి" అన్నాడు.

నేను చెవులు మూసుకున్నాను. అతను ఏదో అన్నాడు కానీ నేను వినలేదు. అయితే నన్ను చూసి వాడు కన్నుకొట్టాడు. అదిచూసిన నాకు నిలుచున్న నేలంతా తిరిగి పోతున్నట్టు అనిపించింది. క్రోధావేశంలో నా నోట మాట రాలేదు, కేవలం "దుర్మార్గుడా! నీచుడా! పాపాత్ముడా!" అన్న తిట్లు మాత్రమే వెలువడ్డాయి.

వాళ్ళ స్నేహితులు వెళుతూ వెళుతూ అన్న మాటలు నెమ్మదిగా నా చెవిన పడ్డాయి "ఇంత ఘోరమైన భాషలో చివాట్లు పెడితే వీడికేం అర్థమవుతుంది? కొంచెం తేలికైన భాష మాట్లాడు తల్లీ!"

ఇంకా సహించటం నా వశం కాలేదు. ఏ కలంతోనైతే నేనతన్ని సృష్టించానో అదే కలంతో అతన్ని అంతం చేసిపారేశాను. అతను వెళ్లి ఆ రంగేళి సరసన కూర్చోబోతుండగానే అతన్ని చెత్తబుట్టలో పారేశాను. మంచి పనే అయిందిలే! చేసుకున్న దానికి చేసుకున్నంత అనుభవించాడు!

అతనైతే ఫలితం అనుభవించాడు కానీ నా సమస్యకైతే పరిష్కారం కనుక్కోలేకపోయాను. ఈసారి నేను పొందిన వైఫల్యం నన్ను ఏడిపించేసిందంటే నమ్మండి. ఈసారి మధ్యతరగతి నుంచి తన నాయకుణ్ణి సృష్టించే ప్రయత్నానికి ధైర్యం చాలలేదు. ఈ రెండు హత్యల భారంతోనే నా వెన్ను విరిగిపోతోంది. ఇంకొక హత్యాపాతకం మెడకు చుట్టుకోవాలని కోరికా లేదు, శక్తీ లేదు. చేసేదిలేక నా అహాన్ని విడిచిపెట్టి చాలా నిజాయితీగా చెపుతున్నాను, నా శరీరంలో అణువణువూ చెపుతోంది... నిండు సభలో ఆనాడు ఆ కవి చాలా దర్జాగా నాయకుల్ని ఎలాదుయ్యబట్టాడో, దాన్ని 'తప్పు'ని రూఢిగా నిరూపించలేకపోయాను సరిగదా, కనీసం అరుదుగానైనా ఆదర్శ నాయకులుంటారని బుజువు చెయ్యలేకపోయాను. నేను ఓడిపోయాను, చాలా హీనంగా ఓడిపోయాను. ●



ధారావాహిక

# దేశ విభజన వస్తువుగా సాహిత్యం-2

# కుశ్వంత్‌సింగ్ ఇంగ్లీషు నవల 'ట్రైన్ టు పాకిస్తాన్'

- కొత్తపల్లి రవిబాబు

**దేశ** విభజన కథావస్తువుగా ఇంగ్లీషులో వచ్చిన మొదటి నవల 'ట్రైన్ టు పాకిస్తాన్' (పాకిస్తాన్‌కు వెళ్ళే రైలు). 1956లో, అంటే దేశ విభజన జరిగిన 9 సంవత్సరాల తర్వాత రాసిన నవల. దీనికి అదే సంవత్సరం అమెరికాకు చెందిన గ్రోవ్ ప్రెస్ వారి ఇండియా ఫిక్షన్ బహుమతి వచ్చింది. దీనిని కన్నడంలోకి డా॥ యం.పి. రమణమూర్తి, తమిళంలోకి రామన్ రాజా, తెలుగులోకి ఆకుండి నారాయణమూర్తి (బృందావన్ పబ్లిషింగ్ హౌస్, తెనాలి) అనువదించారు.

కుశ్వంత్‌సింగ్ ఇప్పటి పాకిస్తాన్‌లోని హడాలిలో 1915 ఫిబ్రవరి 2న జన్మించారు. తన 99వ యేట 2014 మార్చి 20న ఢిల్లీలో మరణించారు. ఆయన లండన్‌లో ఎల్.ఎల్.బి. చదివి, లాహోర్ హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశారు. 1947లో భారత విదేశాంగ శాఖలో ఉద్యోగిగా చేరి, 1951లో జర్నలిస్టుగా మారారు. అదే సంవత్సరం ఆకాశవాణిలో చేరారు. యునెస్కో వారి మాస్ కమ్యూనికేషన్ శాఖలో పారిస్‌లో 1954-56లో ఉద్యోగం చేశారు.

జర్నలిస్టుగా 'యోజన' పత్రికకు సంస్థాపక సంపాదకునిగా 1951-53 సంవత్సరాలలో పనిచేశారు. 9 ఏళ్ళపాటు జైన్ కుటుంబానికి చెందిన 'టైమ్స్ ఆఫ్ ఇండియా' పత్రికవారి 'ఇల్లస్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ ఇండియా'కు సంపాదకునిగా పనిచేసి రిటైర్ కావడానికి ఒక నెల ముందు 25 జులై 1978లో యాజమాన్యం తొలగించగా, అదేరోజు కార్యాలయంలో ఎవరికీ చెప్పకుండా, తన గొడుగు తీసుకొని నిశ్శబ్దంగా వెళ్ళిపోయారు. ఆయన సంపాదకత్వం వహించిన కాలంలో, అంతకుముందు వున్న 65 వేల ప్రతుల నుంచి 4 లక్షలకు ఆ పత్రిక సర్క్యులేషన్ పెరిగింది.

కుశ్వంత్‌సింగ్ వ్యక్తిత్వం విలక్షణమైనది. విచిత్రమైనది. రాజకీయంగా ఆయన ఇందిరాగాంధీని సంజయ్‌గాంధీని సమర్థించాడు. 1984లో స్వర్ణదేవాలయంపై దాడిచేసి సైనికులు దానిలో ప్రవేశించడం ఖండిస్తూ 1974లో ప్రభుత్వం తనకు ఇచ్చిన పద్మభూషణ్‌ను వెనక్కి ఇచ్చేశాడు. ఆ తర్వాత 2007లో పద్మవిభూషణ్‌ను స్వీకరించాడు. 1978లో కొన్ని నెలలపాటు జీతం లేకుండా నెహ్రూ స్థాపించిన 'ది నేషనల్ హెరాల్డ్'లో సంపాదకునిగా వున్నారు. 1980-83లలో 'హిందుస్తాన్ టైమ్స్'కు సంపాదకత్వం వహించారు. 1981-86 కాలంలో పార్లమెంటు సభ్యునిగా వున్నారు.

ఆయన పక్కా లౌకికవాది. సంశయవాది (Agnostic). ఆయన రాసిన రాసిన 44 గ్రంథాలలో చివరిది 2013 అక్టోబరులో విడుదలైన "ది గుడ్, ది బ్యాడ్ అండ్ ది రిడికుల్యర్" తన రచనలలో ఆయన మతం గురించీ దాని ఆచరణ గురించీ, మతాధిపతుల గురించీ సునిశితమైన విమర్శ చేశారు.

దేశ విభజన సందర్భంగా లాహోర్ తగలబడిపోవడం ప్రత్యక్షంగా ఆయన చూశాడు. మతపరమైన అల్లర్లకు సాక్షి. మారణహోమం తన కళ్ళముందే జరుగుతున్నా దానిని ఆపలేకపోయినందుకు తనను తానే నిందించుకున్నాడు. తానొక దోషిగా బాధపడ్డాడు.

'ట్రైన్ టు పాకిస్తాన్' నవల ఒక విశిష్టమైన రచన అనీ "దేశ విభజన వస్తువుగా రాసిన మంచి నవల' అనీ సాల్మన్ రష్దీ ప్రశంసించాడు. నవలా రచయిత, 2018లో జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత అమితావ్ ఘోష్ దీనిని "అత్యున్నతమైన రచన"గా కొనియాడాడు.

ఆర్.కె. నారాయణ్ తన నవలల్లో మాల్గుడి అనే ఒక కల్పిత గ్రామాన్ని సృష్టించినట్లే, కుశ్వంత్‌సింగ్ తన నవల మనోమజ్రా అనే కల్పిత గ్రామంలో జరిగినట్లు చిత్రించారు. అది భారతదేశం వైపు వున్న సరిహద్దు గ్రామం. సట్లెజ్ నదికి ఆరు మైలు దూరంలో వుంది. సరిహద్దు ప్రాంతాలలో మతపరమైన హింస, దహనకాండ చెలరేగినా ఈ గ్రామం మాత్రం ప్రశాంతంగా వుంటుంది. ఆ గ్రామంలో వున్నవి 70 కుటుంబాలు. సిక్కులు, ముస్లిములు, హిందువులు పరస్పర అవగాహనతో ఆప్యాయతలతో కలసిమెలసి వుంటారు. విభజనకు సంబంధించిన ద్వేషాగ్ని జ్వాలలు ఈ గ్రామాన్ని తాకలేదు. ఆ గ్రామంలో ఎవరికీ బ్రిటీషువారు వెళ్ళిపోయారనిగానీ, దేశం రెండుగా చీల్చబడిందని కానీ తెలియదు. ఆ గ్రామం మీదుగా వెళ్ళే రైళ్ళు మాత్రం వారికి తెలుసు. వడ్డీ వ్యాపారి రామ్‌లాల్ కుటుంబం ఆ వూరిలో ఏకైక హిందూ కుటుంబం. సిక్కులూ, ముస్లిములు కుటుంబాలు సమాన సంఖ్యలో వున్నాయి. తమ కష్టాలు తీర్చమంటూ అన్ని మతాలవాళ్ళు లాలారామ్‌లాల్ అనే స్థానిక దైవాన్ని ప్రార్థించేవారు. ఆ వూరిలో వున్న పక్కా ఇళ్ళు మూడు. వడ్డీ వ్యాపారి ఇల్లు దానిలో ఒకటి. మిగిలినవన్నీ మట్టిగోడల గుడిసెలే. వూరిలో భూమి అంతా సిక్కులది - ముస్లిములు వారి కౌలుదారులు. వారిలో కొందరు చేనేత పనివారు, కుమ్మర్లు.

ఆ వూరి రైల్వేస్టేషన్‌లో రెండు పాసింజరు బండ్లు ఆగుతాయి. అవి ఢిల్లీ నుండి లాహోర్ వెళ్ళేది, లాహోర్ నుండి ఢిల్లీ వెళ్ళేది. ఆ వూరికి చెందినవాడు జగ్గత్‌సింగ్ ఆరడుగుల నాలుగు అంగుళాల ఎత్తుతో భయంకరంగా వుంటాడు. అతడు బందిపోటుల కుటుంబానికి చెందినవాడు. అతడి తండ్రి, తాత బందిపోట్లే. వారిని ఉరితీసారు. ముసలి తల్లి వుంది. అయితే ఒక నైతిక సూత్రం ఇతడు పాటిస్తాడు. చుట్టుప్రక్కల గ్రామాలపై దాడిచేసి దోచుకుంటాడుగాని తన గ్రామంలో చేయడు. పోలీసుస్టేషన్లో నేరస్తుల 10వ నంబరు రిజిస్టరులో ఇతని

పేరు నమోదై వుంది. కొందరు ఇతన్ని పదో నంబరు అని కూడా పిలుస్తుంటారు. పోలీసువారి ఆంక్షల ప్రకారం ఇతను చీకటిపడిన తర్వాత బయటకు రాకూడదు. వేరే వూరు వెళ్ళాలంటే ముందు అనుమతి తీసుకోవాలి. ఇతను ఆ గ్రామంలో మసీదుకు చెందిన మౌల్వీ ఇమాంబక్ష్ కూతురు నూరాన్‌తో ప్రేమ వ్యవహారాలు నడుపుతుంటాడు. ఒకరోజు రాత్రి మరో బందిపోటు ముఠా – మల్లి ముఠా ఆ గ్రామంలోని వడ్డీ వ్యాపారి ఇంటిపై పడి – దోచుకుంటున్న క్రమంలో రామ్‌లాల్‌ను చంపేస్తారు. వాళ్ళు పోతూ పోతూ రామ్‌లాల్ ఇంట్లో దోచుకున్న రెండు గాజులు జగ్గత్‌సింగ్ ఇంట్లోకి విసిరిపోతారు. ఆవిధంగా నేరం అతనిపై మళ్ళించడానికి.

ఇది ఇలా వుండగా బందిపోట్ల దాడి జరిగిన తర్వాత రోజు ఉదయం రైలులో హోల్డాల్‌తో ఒక యువకుడు దిగుతాడు. ఆ రైలులోనే పోలీసులూ వస్తారు. ఈ యువకుడి పేరు ఇక్బాల్. అతను ఇక్బాల్‌సింగో, ఇక్బాల్ మహమ్మదో, ఇక్బాల్ చందో – అంటే అతను ఏ మతం చెందినవాడో తెలియదు. ఆ ఊరికి అపరిచితుడు. అతను పనిచేసే పార్టీ అతన్ని ఈ సరిహద్దు గ్రామంలో దేశ విభజన వల్ల జరుగుతున్న మతపరమైన హింస ఆగేటట్లు ప్రజలను చైతన్యవంతం చేయడానికి పంపింది. గురుద్వారాలో మకాం పెడతాడు. ఇతను ఇంగ్లండ్‌లో చదివి వచ్చినవాడు అవివాహితుడు. ధనికుల దోపిడీ ఆపాలనీ, భూస్వాముల పరిపాలన అంతం చేయాలనీ, ఇంకా గ్రామీణుల అప్పుల భారం, పెట్టుబడిదారీ దోపిడీ గురించి గురుద్వారాకు వచ్చినవారికి ఉపన్యాసం ఇస్తుంటాడు. క్రితం రోజు రాత్రి ఆ వూరిలో జరిగిన దోపిడీ, హత్య గురించి విని గందరగోళపడతాడు. అది చూసి గురుద్వారా నిర్వాహకుడు మీత్‌సింగ్, 'ఇక్కడ మత ఘర్షణలు, హత్యలు ఆపడానికి వచ్చానంటావు. హత్య గురించి విని అంత గాభరా పడుతున్నావేంటి?' అని హేళన చేస్తాడు. గ్రామస్తులతో చేసిన సంభాషణలో, గ్రామస్తులు "స్వాతంత్ర్యం అనేది మీకు (విద్యావంతులకు) మంచి చేసింది. కాని మాకు ఒరిగిందేముంది? మీకైతే మంచి ఉద్యోగాలు వస్తాయి. మరి మాకు ఇంకా ఎక్కువ భూమి, పశువులు వస్తాయా?' అని నిలదీసారు. 'గతంలో మనం ఇంగ్లీషువారికి బానిసలం – ఇక ఇప్పుడు మనదేశంలోనూ, పాకిస్తాన్‌లోనూ విద్యావంతులకు బానిసలం' అనే గ్రామీణులు విశ్లేషణకు ఇక్బాల్ నిర్ఘాంతపోతాడు.

ఆ గ్రామానికి ఇక్బాల్ వచ్చిన క్రిందటి రోజే బందిపోట్ల దాడి జరిగింది. రామ్‌లాల్ హత్యకు గురయ్యాడు. పోలీసులు ఆ తర్వాత రోజు పాత నేరస్తుడు జగ్గత్‌సింగ్‌నూ, ఊరిలోకి కొత్తగా వచ్చిన ఇక్బాల్‌ను పోలీసులు అరెస్టు చేస్తారు; ఇక్బాల్ తనను తాను పనిచేస్తున్న పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా ఇక్కడకు పంపిందనీ, తనకు మతం లేదనీ చెప్తాడు. కాని పోలీసు అధికారి అతని గుడ్డలు విప్పించి, సుంతీ చేసుకున్నాడు గనుక ముస్లిం అనీ, ముస్లిం లీగ్ పార్టీవాడనే నిర్ధారణకు వస్తాడు. లాకప్‌లో ఇక్బాల్‌ను ఎ తరగతి, జగ్గత్‌కు సి తరగతి గది కేటాయిస్తారు.

ఒకరోజు ఆ ప్రశాంతమైన గ్రామానికి ఒక రైలు లాహోర్ నుంచి వచ్చింది. సాధారణంగా రైలు బోగీలపై ఎక్కి ప్రయాణించేవారితోనూ, తలుపుల వద్ద వేలాడేవారితోనూ క్రిక్కిరిసి వుండల్సిన ఆ రైలు పైన ఎవరూ లేరు. అంతా శ్మశాన శాంతిలా వుంది. పోలీసులు గ్రామస్తుల నెవరినీ స్టేషన్ దగ్గరకు అనుమతించలేదు. ఆరోజు సాయంత్రం గ్రామస్తులందరూ తమ వద్ద వున్న కట్టెలు, కిరోసిన్ తెచ్చి ఇవ్వాలని పోలీసులు ఆదేశించారు. వాటికి తగిన పైకం చెల్లిస్తామన్నారు. తమ ఇండ్లపై ఎక్కి రైల్వేస్టేషన్ వంక చూచినవారికి – వేలాది శవాలను దహనం చేస్తున్న దృశ్యం కనబడింది. అంటే పాకిస్తాన్ నుంచి పారిపోయి వస్తున్న హిందువులు, సిక్కుల శవాలు అవి. ఒక్కో బోగీలో ఎంతమంది పడతారు? ఎన్ని బోగీలు? బోగీలపై వున్నవారి లెక్కవేసి చూస్తే 1500 మంది శవాలవి! శవాలతో వచ్చిన ఆ రైలుకు 'దయ్యపు బండి' అని పేరు పెట్టారు.

పాకిస్తాన్ నుంచి పారిపోయి వలస వచ్చిన 40, 50 మంది సిక్కులు ఆ గ్రామం గురుద్వారాలో మకాం పెట్టారు. వాళ్ళు ఇక్కడ నుంచి జలంధర్ శరణార్థుల శిబిరంకు వెళ్ళాలి. ఈ సిక్కులకు గ్రామంలోని ముస్లిములు ఆహారం తెచ్చి ఇస్తున్నారు. పోలీసు అధికారులు ఈ గ్రామంలోని ముస్లిములను ముందు చందునగర్‌లోని ముస్లిం శరణార్థుల శిబిరానికి పంపి అక్కడి నుండి రైలులో లాహోర్ పంపాలి అని ఆలోచిస్తుంటారు. కాని గ్రామంలోని సిక్కులు, ముస్లిములు స్నేహపూర్వకంగా వుంటారు. వారిని ఎలా విడదీసి పంపాలి?

పాకిస్తాన్ నుండి వలస వచ్చిన సిక్కులు అక్కడి చాల అకృత్యాలకు గురై పారిపోయి వచ్చారు. వారు ఈ గ్రామంలోని ముస్లిములపై ప్రతీకారం తీసుకోవచ్చు. కనుక ముస్లిములు గ్రామం ఖాళీ చేసి శిబిరానికి వెళ్ళాలి అని అధికారుల ఆదేశం! అదీగాక, వడ్డీ వ్యాపారిని చంపింది మల్లి అనే సిక్కు ముఠావాళ్ళైతే, దానిని సుల్తానా అనే ముస్లిం ముఠావాడు చంపి పాకిస్తాన్ పారిపోయాడని ప్రచారం చేశారు. నిజానికి ఆ హత్య జరగడానికి ముందే సుల్తానా ముఠా వెళ్ళిపోయింది. అయినా పోలీసువారు కథనం ఒకటి అల్లి, మొత్తంమీద ముస్లిం వ్యతిరేకత సృష్టిస్తారు. ఇంకేముంది, గ్రామం రెండుగా చీలిపోయింది.

సిక్కులు ముస్లిములపై పాటియాలా, అంబాల, కపుర్తాలలో చేసిన అకృత్యాల పుకార్లు గతంలో విన్నవి ముస్లిములకు గుర్తు వచ్చాయి. ముస్లిం స్త్రీల ముసుగులు లాగివేయడం, వారిని నగ్నంగా వీధుల్లో త్రిప్పి మార్కెట్ వద్ద సామూహిక లైంగికదాడి జరపడం, వారిలో చాలమంది జరగబోయే అవమానాలను ఊహించుకుని ఆత్మహత్యలు చేసుకోవడం, మసీదుల్లో పందుల శవాలు వేసి అపవిత్రం చేయడం, పవిత్ర ఖురాన్‌ను తగలబెట్టడం అన్నీ గుర్తువచ్చి ఆ వూరిలో వున్న సిక్కులను అనుమానించే స్థితికి చేరారు.

సిక్కులూ అలాగే వారి ఆఖరి గురువు ముస్లిములపై చేసిన హెచ్చరిక గుర్తుచేసుకున్నారు. ముస్లిం రాజులు, సింహాసనం కోసం కొడుకులను, తండ్రులను, సోదరులను చంపడం లేదా గ్రుడ్డివాళ్ళను చేయడం, ఇద్దరు సిక్కు గురువులను చంపడం, పవిత్ర గ్రంథాన్ని చించివేయడం, సిక్కు స్త్రీలు బావుల్లో దూకి ఆత్మహత్యలు చేసుకోవడం లేదా తమను తామే దహించుకోవడం సిక్కు స్త్రీలను నగ్నంగా వూరేగించి, బహిరంగంగా లైంగికదాడి చేయడం. వారికి గుర్తు వచ్చాయి.

ఈలోగా మరో దయ్యాల రైలు ఈసారి ఎటువంటి లైట్లు లేకుండా ఆ గ్రామం స్టేషన్‌కు వస్తుంది. ఈసారి అధికారులు ఆ శవాలన్నిటినీ పెద్ద గోయి త్రవ్వి పూడ్చి పెడతారు కొన్ని శవాలు నదిలో కొట్టుకు వస్తుంటాయి. ఆ శవాలకు కొన్నిటికి శరీర భాగాలు వుండవు. ఆడవారి రొమ్ములు కోసేసి వుంటాయి. గర్భాలు చీల్చి వుంటాయి.

ట్రక్కులు తీసుకొచ్చి ముస్లిములందరినీ ఆ వూరి నుంచి తరలిస్తారు. తమ స్వస్థలాలు, ఇళ్ళు, పశువులు, బండ్లు వదలి వెళ్ళుతున్నవారి వ్యధ వర్ణనాతీతం. వారితోపాటు జగ్గత్‌సింగ్‌ను ప్రేమించి, 2 నెలల గర్భిణీగా వున్న నూరాన్ కూడా వృద్ధుడైన తండ్రితో గ్రామం వదలి వెళ్తుంది.

రామ్‌లాల్ హత్యానేరం, ముస్లిమైన సుల్తానాపై తోసివేసి జగ్గత్‌సింగ్‌నీ, ఇక్బాల్‌నీ పోలీసులు విడుదల చేస్తారు. వీరు గ్రామంలోకి రాకముందే కొందరు సిక్కు యువకులు – ముస్లిములపై పగ తీర్చుకోవడానికి సిద్ధమైన మల్లి ముఠాతో, మరికొందరితో పాకిస్తాన్‌కు ముస్లిములను తీసుకొని వెళ్ళే రైలులో వారిని చంపాలని ప్రణాళిక సిద్ధం చేసుకుంటారు. ఒక 50 మంది దీనిని అమలుచేయడానికి సిద్ధమౌతారు.

వారి ప్లాన్ ఏమిటంటే – నదిపై వున్న వంతెన మొదటి స్థంభం వద్ద – 20 అడుగుల ఎత్తున అడ్డంగా ఒక మోకును కడతారు. ఇది ఇంజన్‌కి ఒక అడుగు ఎత్తున వుంటుంది. రైలు పెట్టెలపై ప్రయాణిస్తున్న వారందరూ ఈ మోకుకు తగిలి కిందపడి మరణిస్తారు. పెట్టెల లోపల వున్నవారిని తుపాకులతో పేల్చేస్తారు. ఇదీ వారి ప్లాను.

జైలు నుంచి విడుదలై వచ్చిన జగ్గత్‌కు ఇది తెలుస్తుంది. ఆ రైలులోనే తన నూరాన్ కూడా వెళ్తోంది. కనుక వంతెన దగ్గర స్థంభం ఎక్కి రైలు వచ్చే సమయానికి ఆ మోకును అతి కష్టం మీద కోసేస్తాడు. మల్లి ముఠావాళ్ళు ఇది చూసి అతనిపై కాల్పులు జరపగా రైలు కిందపడి మరణిస్తాడు. ట్రైన్ సురక్షితంగా పాకిస్తాన్‌కు వెళ్తుంది. The train went over him, and went on to Pakistan అన్న వాక్యంతో నవల ముగుస్తుంది.

ఇక్బాల్ పాత్రని రచయిత అన్యాపదేశంగా కుహనా కమ్యూనిస్టు అని స్ఫురించేట్లు రాశాడు. జైలు నుండి విడుదలకాగానే ఢిల్లీకి పార్టీ ఆఫీసుకు చేరగానే పార్టీ పత్రికలో మొదటి పేజీలో "బ్రిటిష్, అమెరికన్ పెట్టుబడిదారులు దేశంలో అనిశ్చిత స్థితి సృష్టించడానికి కుట్ర చేస్తున్నారు' అనీ, 'సరిహద్దుల్లో కామ్రేడ్ ఇక్బాల్ అరెస్టు' అనే వార్తలు వస్తాయి అనీ ఇక్బాల్ వూహించినట్లు రాశారు.

నవలలో మరో పాత్ర మేజిస్ట్రేట్ హుకుంచంద్, ఇతడు తన కూతురి వయసు వున్న హసీనా బేగంతో సరస సల్లాపాలు చేయడం, తన ఆత్మగతంగా ఢిల్లీలో పార్లమెంటులో నాయకులు చేసే ఉపన్యాసాలను విమర్శిస్తుంటాడు.

ఒకచోట మతాన్ని నమ్ముతున్నామనుకున్నవారెవరికీ వారివారి మతాల గురించి తెలియదని రచయిత విమర్శిస్తూ హిందువైతే కులం, గోరక్షణ మతమనుకుంటాడనీ, ముస్లిమైతే సుంతి చేసుకోవడం, నెమరువేసే జంతుమాంసభక్షణ అనుకుంటాడనీ, సిక్కు ఐతే జుట్టు పెంచుకోవడం, ముస్లిములను ద్వేషించడం అనుకుంటాడనీ, పార్శీఐతే అగ్నిపూజ, గ్రద్దలకు, రాబందులకు ఆహారం ఇవ్వడమనీ, క్రిస్టియన్ ఐతే చర్చికి పోవడమనీ అనుకుంటారనీ, ఆ మతాలు చెప్పే నైతిక సూత్రాలను గాలికి వదిలేస్తారనీ వ్యాఖ్యానిస్తాడు.

ఈ నవలను హిందీలో చలనచిత్రంగా పమేలారూక్స్ దర్శకత్వంలో 1998లో రూపొందించారు. దీనిలో నిర్మల్‌పాండే, మోహన్ అగస్తి, దివ్యాదత్తా రజిత్‌కపూర్ నటించారు. ఈ నవలను రాంపల్లి శశికుమార్ 'ప్రజాసాహితి' 2004 అగస్టు ఉపఖండపు సాహిత్య సంచికలో పరిచయం చేశారు.

181 పుటల ఈ నవలను చాటో అండ్ విండస్ అనే ప్రచురణకర్తలు 1956లో విడుదల చేశారు. ఆ తరువాత దాదాపు 10 ప్రచురణ సంస్థలు దీనిని ప్రచురించాయి. న్యూఢిల్లీలోని రోలీ బుక్స్‌వారు 2006లో ఈ నవలకు, ఇండియాలో 1946-47లలో పర్యటించిన మహిళా ఫొటోగ్రాఫర్ మార్గరెట్ బూర్కి వైట్ తీసిన మతహింసకు సంబంధించిన బీభత్సకరమైన 66 ఫొటోలను జోడించి ప్రచురించారు.

దీనిని న్యూఢిల్లీలో మండీ హౌస్ ప్రాంతంలో వున్న కామని ఆడిటోరియంలో, బేలా థియేటర్ కారవాన్ నాటక బృందం హిందీ నాటకంగా 2020 జనవరి 10న, జనవరి 23న ప్రదర్శించారు. ఉషా మహాజన్ అనువదించగా డా॥ సుమన్ కుమార్ నాటకీకరణ చేశారు. అమర్‌నాథ్ దర్శకత్వం వహించారు.

ఈ నవల మొదటి అధ్యాయాన్ని కృష్ణ శుక్లా నాటకీకరణ చేస్తే అమి నాటక బృందం మూడుసార్లు ప్రదర్శించింది. ఆఖరి ప్రదర్శన 2014 అగస్టు 26న హైదరాబాదులోని లామకాన్‌లో జరిగింది.

**(వచ్చే సంచికలో 1950లో పంజాబీ భాషలో అమృతాప్రీతమ్ రచించిన 'పింజార్' (అస్థిపంజరం) గురించి)**

కవిత

# గర్వించేదేముంది!

– ఎస్. శంకరరావు

వజ్రోత్సవ
స్వతంత్ర పర్వములో
ఏమున్నది గర్వించేది
ఆరుగాలం శ్రమించి
ఆకలి తీర్చే నాగళ్ళ
ఆత్మహత్యల గోడు తప్ప....
అన్నం పెట్టే కృషీవలునిపై
సంస్కరణల వెన్నుపోటు తప్ప....
ఏడున్నర దశాబ్దాల
తిరంగా రెపరెపలలో
ఏమున్నది సాధించేది

శ్రమ మథించగా
పెల్లుబుకిన అమృతమంతా
పెట్టుబడీ పాదాక్రాంతం తప్ప....
ప్రజల ఆస్తులంతా
కార్పోరేటుల పరం చేయడం తప్ప....
ఏడున్నర పదుల
అర్ధరాత్రి స్వతంత్రంలో
ఏమున్నది బతుకు భరోసాకు
అర్ధాకలితో హాహాకారాలు
బానిస బతుకులు తప్ప....

ప్రశ్నించే గొంతుకలపై
నిరంకుశ అణచివేతలు తప్ప....
పతాకమై
రెపరెపలాడాల్సిన నవ యవ్వనం
ప్రపంచీకరణ వ్యామోహంలో
కొట్టుమిట్టాడటం తప్ప....
దోపిడీ బకాసురుల
వెన్ను విరిచే భీములపై
కొండ కోనల చైతన్యమై
కదులుదాం వెలుగు కోసం.....

పుస్తక పరిచయం

# 'నా జాతి ప్రజల కోసం నిలబడతా!' (HERE I STAND)

– పాల్ రోబ్సన్

పరిచయకర్త : జి.వి. భద్రం

**బానిసయుగ** కాలం నుండీ మానవులు స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల కోసం వివక్ష అణచివేత, పీడన, దోపిడీల రద్దుకోసం పోరాడుతూనే వున్నారు. సాంకేతికంగా మహత్తరమైన అభివృద్ధి సాధించామనుకుకే నేటి అత్యాధునిక యుగంలో కూడా, నిజమైన స్వేచ్ఛా, స్వాతంత్రాల కోసం, వివక్ష – అసమానతలకు వ్యతిరేకంగానూ ప్రపంచమంతటా ప్రజలు పోరాడుతూనే వున్నారు.

స్వేచ్ఛా, స్వాతంత్రాలకు, ప్రజాస్వామ్యానికీ పుట్టినిల్లుగా చెప్పబడే అమెరికా దేశంలో గత $3^1/_2$ శతాబ్దాలకు పైగా, అక్కడి నల్లజాతి ప్రజలు నిజమైన స్వేచ్ఛా స్వాతంత్రాల కొరకూ, సమాన హక్కుల కోసం నిర్విరామంగా పోరాడుతూనే వున్నారు. ఎందరో నల్లజాతి నాయకులు, జాతి విద్వేషం, జాతి వివక్షతలకు వ్యతిరేక పోరాటాలను రగుల్కొల్పారు. ఆ పోరాటాలకు తమ జీవితాలను అంకితం చేశారు. అనేక ఆంక్షలకు, నిర్బంధాలకు గురవుతూనే, పట్టుదలతో తమ లక్ష్యసాధన కోసం కృతనిశ్చయంతో జీవితాంతం పోరాడారు. స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం, సమానత్వం కోసం పోరాడే, ప్రపంచమంతటి ప్రజలకు స్ఫూర్తినిచ్చారు. అటువంటి స్ఫూర్తిదాయకమైన పోరాట యోధులలో పాల్ రోబ్సన్ ఒకరు. పాల్ రోబ్సన్, 1957లో 'HERE I STAND' అనే పేరిట తన స్వీయకథను ప్రచురించారు. ఆ స్వీయకథను, తెలుగులోకి తర్జుమాచేసి, 'ప్రజాసాహితి' పత్రిక ప్రధాన సంపాదకులు కొత్తపల్లి రవిబాబు, తెలుగు పాఠక లోకానికి అందించారు. జనసాహితి యీ పుస్తకాన్ని ప్రచురించింది.




పాల్ రోబ్సన్ యీ పుస్తకాన్ని ప్రధానంగా నల్లజాతి అమెరికన్ల కోసం రాసినా చాలా యితర దేశాలలో యీ పుస్తకం పునర్ముద్రింప బడింది. ఈ పుస్తకం యొక్క ప్రాముఖ్యతను ప్రపంచంలోని ప్రజలు అర్థం చేసుకొన్నారు. నల్లజాతి అమెరికన్‌లకు సాంఘికపరంగా, రాజకీయపరంగా సమానమైన హక్కుల సాధనకై రోబ్సన్ ఏకదీక్షగా పోరాడుతున్న విషయాన్ని అర్థం చేసుకొని పట్టించుకొన్నారు. నల్లజాతి అమెరికన్‌లకు పూర్తిగా, దృఢంగా సహకారం అందించటానికి సంకల్పం చేసుకొన్నారు.

తోటలో పనిచేసే బానిసగా పుట్టి, 1860లో తన 15వ ఏట, బానిస యజమాని నుండి తప్పించుకు వచ్చిన (ఉత్తరాది రాష్ట్రాలకు) విలియం డ్రూ రోబ్సన్ యొక్క కుమారుడు పాల్ రోబ్సన్. పాల్ రోబ్సన్ తన తండ్రి నుండి "నీగ్రోవారు, తెల్లజాతివారితో అన్ని విధాల సమానమనే" విషయం నేర్చుకొన్నాడు. సోదరుడు రీడ్, తెల్లవారి చట్టాన్ని ధిక్కరిస్తూ, సదస్సులలో ఎగతాళి చేస్తూ అవిరామంగా, తిరుగుబాటు చేయటాన్ని గమనించాడు. ఎన్నటికీ లొంగిపోరాదనీ, వారికెదురుగా (తెల్లజాతివారికి) నిలబడిపోరాడాలనీ నేర్చుకొన్నాడు. తొమ్మిదేళ్ళ వయస్సులో తను పుట్టిన వూరు అయిన ప్రిన్స్‌టన్ నుండి వెళ్ళిపోయిన రోబ్సన్ ఆ వూరికీ యితర వూర్లకూ మధ్య నల్లజాతివారితో తిరుగుతూ 21వ యేట కళాశాల విద్య పూర్తిచేశాడు. అతడు నల్లజాతీయుల హక్కుల కోసం పోరాడుతున్న డబ్ల్యు ఇ. బి. డుబోయిస్ యొక్క ప్రభావంలో పడ్డాడు. లాటిన్, గ్రీకు భాషల నభ్యసించాడు. మరో సోదరుడు బెన్ వలన పాల్ రోబ్సన్ వ్యాయామం పట్ల అభిరుచిని పెంచుకొన్నాడు. బానిసత్వ నిర్మూలనకు కంకణం కట్టుకొన్న, ఉపన్యాసకారుడైన వెండెల్ ఫిలిప్స్ యొక్క ఉపన్యాసానికి ఆకర్షితుడైన పాల్ రోబ్సన్, సంపన్నవర్గాలవారు దేన్ని చూసి భయభ్రాంతులౌతారో తెలుసుకొన్నాడు.

కాలేజీలో చదువుతున్న కాలంలో పాల్ రోబ్సన్, ఫుట్‌బాల్ క్రీడాకారుడిగా రూపొందాడు. వృత్తి క్రీడాకారుడయ్యాడు. అంతేకాక అదే కాలంలో నటుడిగా కూడా రూపొందాడు. నటనా వృత్తిని చేబట్టాడు. 1922లో 'టాబూ' అనే నాటకంలో ముఖ్యపాత్ర ధరిస్తూ, ఆ నాటకాన్ని లండన్‌లో ప్రదర్శించారు. ఆ సందర్భంగా పాల్ ఇంగ్లండులోని జిల్లాలన్నీ తిరిగాడు. 1924 నాటికి అమెరికా రంగస్థల ప్రపంచంలో పాల్ రోబ్సన్ నటుడిగా గుర్తింపు పొందాడు.

నల్లజాతివారందరికీ బాల్యంలోనూ, యవ్వనంలోనూ చర్చికి పోవటం ఒక బాధ్యత. అక్కడ పాడటం వారికొక అలవాటు, ఆ రకంగా పాటలు (కీర్తనలు) పాడే పాల్ రోబ్సన్ లారెన్సు బ్రౌన్ అనే నల్లజాతి గాయకునితో కలసి సంగీత కచేరీలలో పాడి, ఒక గొప్ప గాయకుడిగా కూడా గుర్తింపును పొందాడు. "నీగ్రో జానపద గేయాలూ,

వారి శ్రామిక గేయాలలోని సౌందర్యాన్ని, లాలిత్యాన్నీ, గాంభీర్యాన్నీ ప్రజలకు తెలియచేయటం కోసం" పాల్ రోబ్సన్ పాడాలనీ, "నీగ్రో సంగీతంపై కేంద్రీకరించాలనీ, అందరిలో ఒకటయిపోవాలనీ" నిర్ణయించుకొన్నాడు.

1927లో పాల్ యూరోపు వెళ్ళాడు. పారిస్‌లో ఒక కచేరి చేశాడు. అమెరికాలో కంటే, యూరోపులో పాల్‌కు పెద్ద పేరు వచ్చింది. 1928 కాలంలో పాల్‌కు రచయిత హెచ్.జి. వెల్సుతో పరిచయమయింది. ఇంగ్లండ్‌లో స్థిరపడ్డ పాల్ విదేశీ భాషాధ్యయనం చేశాడు. పాటలు పాడటం కోసం చైనీస్, జర్మన్, రష్యన్ భాషలు నేర్చుకొన్నాడు. బ్రిటన్‌లో ప్రచురించిన 'అమెరికాలో ప్రసిద్ధులు' గ్రంథంలో పాల్ రోబ్సన్ పేరు వుంది. పాల్ ఫ్రెంచి భాష కూడా నేర్చుకొన్నాడు. తాను ఒక బానిసకు చెందిన పుత్రుడే అయినా తనను ఇంగ్లండ్‌లోనూ, యూరోపులోనూ ఒక మనిషిగా పరిగణించటాన్ని పరిశీలించాడు.

1933 ప్రారంభంలో హిట్లర్ జర్మనీకి ఛాన్సలర్ అయ్యాడు. యూదులను 'అపరిశుద్ధ' ప్రజలన్నాడు. వేలాదిమంది యూదులు జర్మనీ నుంచి పారిపోయి, లండన్‌కు ప్రవాహంగా వచ్చారు. హెచ్.జి. వెల్స్ నాయకత్వాన శరణార్థులైన యూదుల సహాయ కమిటీ తరఫున బెన్‌ఫిట్ షోలో పాల్ నటించాడు. అమెరికాలో తన పట్ల ఎంతో దయ చూపించిన తెల్లవారు యూదులేనన్న విషయం గుర్తు చేసుకొన్నాడు. జర్మనీలోని యూదుల దయనీయ స్థితికి బాధపడ్డాడు. మనుషులందరూ సమానమే అని నమ్మి, అందుకోసం తెగించాడు.

లండన్‌లో తన కచేరీలకు హాజరయ్యే విద్యార్థులతో పాల్ పరిచయం పెంచుకొన్నాడు. ఇంగ్లండులో చదువుకోవటానికి వచ్చిన ఆఫ్రికన్ విద్యార్థులు ఏర్పాటుచేసుకొన్న పశ్చిమ ఆఫ్రికా విద్యార్థుల యూనియన్‌లో పాల్ గౌరవ సభ్యత్వం స్వీకరించాడు.

అప్పుడు అతడు ఎందరో ఆఫ్రికన్‌లను గురించి తెల్సుకొన్నాడు. ఆఫ్రికన్లలో మరో వర్గ ప్రజల గురించీ తెలుసుకొన్నాడు. వారు లండన్‌లో, లివర్‌పూల్‌లో, కార్డిఫ్ ఓడరేవుల్లో నౌకా కార్మికులుగా పనిచేస్తున్నారు. వారి జీవితాల గురించీ, వివిధ రకాల ప్రజల గురించీ తెలుసుకొన్నాడు. నల్లజాతి, ప్రాచీన ఆఫ్రికన్ సంస్కృతిని గురించీ తెలుసుకొన్నాడు. "తమ జాతి వారసత్వ సంపదల గురించి, నీగ్రో జాతివారికి తెలియ చేయాలని" నిర్ణయించుకొన్నాడు.

హిట్లర్, ముసోలినీ సైనిక బలగాల సహాయంతో ఫాసిస్టు ఫ్రాంకో స్పానిష్ రిపబ్లిక్‌పై దాడి చేశాడు. అప్పుడు పాల్ ఫాసిజానికి వ్యతిరేక పోరాటానికి మొదటి ప్రాధాన్యత యివ్వాలనుకొన్నాడు. స్పెయిన్‌ను బలపరుస్తూ లండన్‌లో జరిగిన ప్రదర్శనను సంభోదిస్తూ "స్వేచ్ఛకోసమో, బానిసత్వం రద్దుకోసమో పోరాడటానికి కళాకారుడు సిద్ధపడాలి" అని పిలుపిచ్చాడు. 1938లో పాల్ స్పెయిన్ వెళ్ళాడు. స్పానిష్ రిపబ్లిక్కును సమర్థిస్తూ యుద్ధం చేయటానికి ఎందరో శ్రామికులు ఇతర దేశాల నుండి స్పెయిన్ వచ్చారు. ఈ అంతర్జాతీయ బ్రిగేడ్‌లో వీరోచితంగా పోరాడుతున్న వీరుల కోసం స్పెయిన్‌లో పాల్ రోబ్సన్ గొంతెత్తి పాడాడు. స్పానిష్ రిపబ్లిక్‌కు విరాళాలు సేకరిస్తూ, ఇంటర్నేషనల్ బ్రిగేడ్‌కు సైనికులను రిక్రూట్ చేస్తూ, పాడుతూ పాల్ రోబ్సన్ ఫ్రాన్సు, ఇంగ్లండు దేశాలలో పర్యటించాడు. స్పానిష్ రిపబ్లిక్‌కు సహాయంగా స్పెయిన్‌కు చెందిన వందలమంది అనాథ బాలికలను దత్తత తీసుకొన్నాడు. "ప్రపంచమంతా స్వేచ్ఛగా వుండాలనీ, అణచివేత, పీడనకు వ్యతిరేకంగా నిలబడతాననీ" నిర్ద్వంద్వంగా ప్రకటించాడు.

1934 డిశంబర్‌లో ఇంగ్లండు వదలి పాల్ సోవియట్ యూనియన్‌కు ప్రయాణమయ్యాడు. సోవియట్ యూనియన్‌లో జాతి, మత, రంగు భేదం లేకపోవటాన్ని చూశాడు. వివిధ జాతుల మధ్య సహనం, సోదరత్వం వుండటాన్ని చూశాడు. పాల్ రోబ్సన్, ఐన్‌స్టీన్‌తో "నేను పెరిగి పెద్దవాణ్ణయిన తర్వాత, ఇప్పుడు ఒక మానవుడిగా గుర్తింపబడుతున్నాను. ఇక్కడ నేను నీగ్రోను కాదు. ఒక మానవుణ్ణి!" అని చెప్పాడు. పాల్ సోవియట్ యూనియన్‌లో చూసినదంతా ఆచరణలో సమానత్వ భావన. సోవియట్ యూనియన్‌లో 1936లో ఒక నూతన రాజ్యాంగాన్ని ప్రకటిస్తూ అన్ని రకాల జాతి వివక్షతలనూ నిరసించటాన్ని పాల్ రోబ్సన్ గమనించి, గుర్తుపెట్టుకున్నాడు.

స్పానిష్ అంతర్యుద్ధం ముగిసేనాటికి (1939లో) పాల్ రోబ్సన్‌కు 40 ఏళ్ళు వచ్చాయి. స్పెయిన్ ఫాసిస్టు వ్యతిరేకపోరాటం, దాని నుండి నేర్చుకొన్న విషయాలు పాల్ రోబ్సన్‌కు తన స్వదేశం అమెరికాను గుర్తుకు తెచ్చాయి. "కళాకారునిగా, పౌరునిగా, నీగ్రోజాతివానిగా, కార్మికుల మిత్రునిగా నేను నా స్వదేశంలో ఎంతో చేయాల్సి వుంది" అని గుర్తించిన పాల్ రోబ్సన్ 1939లో అమెరికా తిరిగి వెళ్ళాడు.

పాల్ రోబ్సన్, పికెటింగ్ చేస్తున్న శ్రామిక జనావళితో కలిసి జీవించాడు. నౌకాశ్రయంలో కార్మికులు, ఆటోపనివాళ్ళు, వంటవాళ్ళు, సేవకులు, ఫర్‌నేతగాళ్ళు, గనికార్మికులు, ఉక్కు కర్మాగార కార్మికులు, విదేశీయులు, వివిధ దేశీయ తెగలు, యూదుజాతి ప్రజలు, మధ్యతరగతికి చెందిన అభ్యుదయవాదులు, విద్యార్థులు, విజ్ఞాన శాస్త్రాలకు చెందినవారూ వంటి శ్రమ చేసేవారితో సన్నిహితంగా మెలిగాడు. అంతర్జాతీయ శ్రామిక దృక్పథాన్ని అలవర్చుకొన్నాడు. అమెరికాలో అయితే మెదడుకంటే (జ్ఞానం కంటే) బ్యాంక్ అకౌంట్‌కే ఎక్కువ ప్రాధాన్యత వుంటుందని గుర్తించాడు.

అమెరికాలో వున్న కాలంలో, విదేశాలకు వెళ్ళటానికి అమెరికన్ ప్రభుత్వం అనుమతించని పరిస్థితిలో, కెనడా లోహ గని కార్మికులు సరిహద్దులలో ఏర్పాటుచేసిన కచేరీలలో పాడేడు. ఆ సరిహద్దు ప్రాంతంలో మూడేళ్ళపాటు కచేరీలు చేశాడు. తన ప్రయాణానికి సంబంధించి 30 ఏళ్ళక్రితం అంతర్జాతీయ కళాకారునిగా పాల్‌రోబ్సన్ తన వృత్తిని సాగించే హక్కు గురించీ, సాగించిన పోరాటానికి విదేశాల్లో ఎంతో మద్దతు లభించింది.

అమెరికన్ స్వాతంత్ర్య ప్రకటన వెలువడిన నాటినుండీ, నల్లజాతీయుల హక్కులపై కపటత్వం కొనసాగుతోందనీ, 14, 15వ రాజ్యాంగ సవరణలతో నల్లజాతీయుల పూర్తి పౌరసత్వ హక్కులు

గ్యారంటీ చేయబడినా, నల్లజాతీయులకు సంబంధించినంతవరకూ అవి వర్తింపజేయలేదనీ, తమను రెండవ స్థాయి పౌరులుగానే చూస్తున్నారనీ మిసిసిపి లాంటి ప్రాంతంలో తెల్లరంగు యజమానులు నల్లజాతీయుల పట్ల పాత పద్ధతులనే పాటిస్తున్నారనీ, యిందుకు వ్యతిరేకంగా పోరాడాలనీ పాల్ రోబ్సన్ నల్లవారికి పిలుపునిచ్చాడు.

అమెరికాలోని కార్మికుల సమరశీల పోరాటాలను పరిశీలిస్తూ వాటిలో పాల్ రోబ్సన్ పాల్గొన్నాడు. చికాగోలో వస్తువులను ప్యాకింగ్ చేసే పరిశ్రమలో కార్మికుల పోరాటాలు, డెట్రాయిట్‌లో ఆటోకార్మికుల పోరాటాలు, పశ్చిమ తీరంలో నావికులూ, నౌకల్లో సామాన్లు మోసే కార్మికుల పోరాటాలు, నార్త్ కరోలినాలోని పొగాకు కార్మికుల పోరాటాలు, పిట్స్‌బర్గ్, పశ్చిమ వర్జీనియాలోని గని కార్మికుల పోరాటాలు, ఇలినాయిస్, పెన్సిల్వేనియా, ఇండియానా, ఓహియాలలోని ఉక్కు పరిశ్రమల్లోని కార్మికుల పోరాటాలు, న్యూయార్కు ఫిలడెల్ఫియాల్లోని దుస్తుల కార్మికులు, గుమస్తాలు, ఫర్ వస్త్రాల కార్మికుల పోరాటాలను పాల్ రోబ్సన్ పరిశీలించాడు. వారు ఎదుర్కొనే సవాళ్ళను అర్థం చేసుకొన్నాడు.

అయితే తాము (నల్లజాతీయులు, శ్రామికులు) రకరకాలుగా, రాజకీయపరంగా, మతవిశ్వాసాల పరంగా, ఆర్థిక సామాజికవర్గాల పరంగానేకాక, ముఠావైరాలు, వివిధ నాయకుల వ్యక్తిగత అత్యాశలు, అసూయలపరంగా ఐక్యత లేకుండా విడిపోయి, సంకుచితమైన ఆలోచనలతో, ఆచరణపట్ల వారిలో అసహనం పెరగటాన్ని పాల్ రోబ్సన్ గుర్తించాడు. అందువలన ఆయన నల్లజాతీయులు అందరి దృక్పథంపై ఆధారపడిన ఆదర్శాన్నీ, ఐక్యతను ప్రతిపాదించి, ప్రభోదించాడు. "రాజకీయ పార్టీలకతీతమైన ఐక్యత, నీగ్రోలను విడదీసే శక్తులకు లొంగని ఐక్యత, ఎవర్నీ బయటకు పోనీయకుండా చేసే ఐక్యత, ఏదో ఒక ముఠా లేదా గ్రూపు తన ప్రత్యేక దృక్పథాన్ని యితరులపై రుద్దకుండా వుండే ఐక్యత"ను ఆయన కోరాడు. "ఎటువంటి మినహాయింపు లేకుండా, అందరి అభిప్రాయాల ప్రాతినిధ్యం ఆ ఐక్యతకు నాయకత్వంలో వుండాలని" ఆయన ప్రతిపాదించాడు. అది తక్షణ అవసరం అని ఆయన నొక్కి చెప్పాడు.

ఆయన నల్లజాతీయులకు "స్వేచ్ఛను సాధించటం, ఈ అమెరికన్ నేలపై యితర పౌరులతో సమానంగా, నిర్భయంగా, మన శ్రమ ఫలితాలు మనం ఆనందిస్తూ – జీవితంలోని అన్ని అవకాశాలనూ మన పిల్లలకు కల్పిస్తూ – ఇలా మన గుండెల్లో ఏనాటినుండో వున్న కల నిజం చేసుకోవటం మన చేతుల్లోనే వుందని" ఉద్బోధించాడు.

"దేవా! ధన్యవాదాలు, ఎట్టకేలకు మేం స్వేచ్ఛా జీవులయ్యాం! అని యిప్పటికీ పాడుకోలేని పరిస్థితుల్లో వున్నాం! కానీ మేమందరం కలిసి కదులుతున్నాం!" అంటూ అంతిమంగా తాము విజయం సాధిస్తామన్న విశ్వాసాన్ని పాల్ రోబ్సన్ ప్రకటించారు.

సంగ్రహంగా నేను నా జాతి కోసం నిలబడతా (నిలబడ్డాను!) అన్న పాల్ రోబ్సన్ ఆత్మకథ వివరాలు యివి. పుస్తకాన్ని చదివితే మరిన్ని వివరాలు, అనేక రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపట్ల పాల్ రోబ్సన్ యొక్క అవగాహనలు అనేక కోణాల్లో అర్థం చేసుకోగల్గుతాము.

ఈ గ్రంథానికి తెలుగుసేత చేసిన కొత్తపల్లి రవిబాబు పలు వివరణలను, ప్రసిద్ధ ప్రపంచ రచయితలు, కవులు హోవర్డుఫాస్టు, ప్లాబోనెరుడా, నాజిమ్‌హిక్మత్, పాల్ రోబ్సన్ యొక్క విశిష్టతను తెలుపుతూ వ్రాసిన కవితలను వ్యాసాలతోపాటు, పాల్ రోబ్సన్ జోహిల్ అనే అమెరికాలోని ప్రసిద్ధ కార్మిక గాయకుడు జోసెఫ్ హిల్‌స్ట్రాం గురించి వ్రాసిన పాటను అనుబంధంగా చేర్చి, పాఠకులకు మరింత వివరాల్ని అందజేశారు.

పాల్ రోబ్సన్ మరణించి నాలుగున్నర దశాబ్దాలు కావొస్తొన్నా, నేటికీ అమెరికా దేశంలోని నల్లజాతీయులకు నిజమైన, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు దక్కలేదు. ఆఫ్రో అమెరికన్‌లపై వివక్షత యథాతథంగానే కొనసాగుతోంది. వ్యవస్థీకృతమైన జాతి విద్వేషం నల్లజాతీయులకు ప్రాణాంతకంగా పరిణమించింది. అందువల్లనే, నిన్నటికి నిన్న బ్లాక్ లైవ్స్ మేటర్!" (నల్లవారి ప్రాణాలు విలువైనవి!!) అన్న ఉద్యమం తలెత్తి, ప్రపంచ ప్రజానీకపు మద్దతును పొందింది. ఇది అమెరికా దేశ పాలకుల "ప్రజాస్వామ్య" నాటకాన్ని బట్టబయలు చేస్తోంది.

ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా చాటుకొంటున్న మనదేశంలో హిందూమత విద్వేషం, కులవిద్వేషం పెచ్చరిల్లింది. దీనినే జాతీయతగా పాలకులు ప్రచారంచేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారు. పాక్–ఇండియా క్రికెట్ క్రీడాకారుల నడుమ పోటీ జరిగితే పాక్ బృందాన్ని ద్వేషించనివాడు దేశద్రోహి అన్నట్లుగా, ఉన్మాదమే దేశభక్తిగా భావించే వర్గాలూ, భారత పాలకులు నిర్భీతితో, నిస్సిగ్గుగా ప్రకటిస్తూ తమ ఫాసిస్టు లక్షణాలను బహిరంగంగా ప్రదర్శిస్తున్నారు.

ఇటువంటి తరుణంలో, జాతి వివక్షతకేకాక, కుల, మత, వివక్షతల నిర్మూలనను ప్రతి నిజమైన దేశభక్తుడూ నడుంకట్టాల్సిన అత్యవసర కర్తవ్యం ముందుకొచ్చింది. ప్రత్యేకించి రచయితలూ, కళాకారులూ యీ జాతి, కుల వివక్షతలకు వ్యతిరేకంగా గళం విప్పాల్సిన తప్పనిసరి పరిస్థితి యిది.

ఫాసిస్టు ధోరణులను, సిద్ధాంతాలను దుర్మార్గాలనూ – దురంతాలనూ వ్యతిరేకిస్తూ, నిజమైన స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలనూ, సమానత్వాన్నీ, ఏ రకమైన వివక్షతలు లేని సామాజిక వ్యవస్థను ఆకాంక్షించేవారందరూ, "నా జాతి ప్రజల కోసం నిలబడతా! (నిలబడ్డాను!)" అని ప్రకటించిన పాల్ రోబ్సన్ స్వీయకథను చదవటం వలన, వారి పోరాట చైతన్యం ఇనుమడించి వారి అవగాహనను మరింత విస్తృతం చేస్తుంది. వారిని ముమ్ముందుకు నడిపిస్తుందన్నది నిస్సందేహం!

**నా జాతి ప్రజల కోసం నిలబడతా! (HERE I STAND)**

ప్రచురణ : జనసాహితి. వెల : రూ. 150/–

ప్రతులకు : **మైత్రీబుక్‌హౌస్, అరండల్‌పేట, కార్ల్‌మార్క్స్‌రోడ్డు, విజయవాడ – 520002.**

## జాతీయ అక్షరయోధులు



# ఖుర్రతులైన్ హైదర్

**(1927 - 2007)**

**7**

**సింగంపల్లి అశోక్‌కుమార్**

# 4వ శతాబ్దం-20వ దశాబ్దం

## ప్రేమా, శాంతీ మార్గాల వైద్యం
## ఖుర్రతుల్-ఐన్ అగ్నిధార సేద్యం
## భారతదేశ సామాజిక సాంస్కృతిక
## ఉత్థానపతనాల చారిత్రక నేపథ్యం

**'భారత్, పాకిస్తాన్ నడుమ సరిహద్దులు ఏర్పడి అవి మారినప్పటికీ వాటి నాగరికత అవిభాజ్యమైనది' అని స్పష్టపరుస్తూ కవిత్వం రాజ్యమేలుతున్న, నవలాసాహిత్యం ఇంకా కాలూనని ఉర్దూ సాహిత్య ప్రపంచంలో గొప్ప నవలలను రాసి ఉర్దూ సాహిత్యానికి 'గ్రాండే దేమ్'గా, ప్రసిద్ధి పొందిన ఖుర్రతులైన్ హైదర్ ప్రగతిశీల భావజాల భారతీయ ఉర్దూ నవలా రచయిత్రి,లఘు కథారచయిత్రి, జర్నలిస్ట్.**

లక్నో యూనివర్సిటీ నుండి ఆంగ్లసాహిత్యంలో మాస్టర్ డిగ్రీ పొందారు. 1947 ఉపఖండ విభజన తరువాత తప్పని పరిస్థితుల్లో పాకిస్తాన్ వలస వెళ్లినప్పటికీ దేశవిభజన హేతువును తిరస్కరించారు. అక్కడ కొంతకాలం డాక్యుమెంటరీ చిత్రాలలో పనిచేశారు. ఆ తరువాత ఇంగ్లాండ్‌లో విలేఖరిగా, 'బి.బి.సి' ఉర్దూశాఖలోనూ పనిచేశారు. 1960లో ఇండియాకు తిరిగి వచ్చి 'ఇంప్రింట్'లోనూ 'ఇలస్ట్రేటెడ్ వీక్లీ'లోనూ సంపాదకవర్గ సహాయురాలిగా పనిచేశారు. ఢిల్లీ సమీపంలోని నోయిడా చేరేముందు 20 సంవత్సరాలు బొంబాయిలో నివసించారు. తను మరణించేంతవరకు నోయిడాలోనే ఉన్నారు. జీవితాంతం అవివాహితగానే ఉన్నారు.

ఖుర్రతులైన్ కాలిఫోర్నియా, చికాగో, విస్కాన్సిన్, అరియోనా విశ్వ విద్యాలయాల్లో అతిథి లెక్చరర్‌గా పనిచేశారు. చిన్నతనంలోనే సాహిత్యరంగంలో ప్రవేశించిన ఖుర్రతులైన్ ఉర్దూ కాల్పనిక రచనలలో ప్రత్యేక ఒరవడి రూపుదిద్దారు. వీరి రచనలు ఆంగ్లంతోపాటు అన్ని భారతీయ భాషలలోకి అనువాదం పొంది, అభినందనలందుకున్నాయి.

1959లో ఆమె చేసిన 'అగ్ కా దరియా' (రివర్ ఆఫ్ ఫైర్) (అగ్నిధార) అనే ఈ నవల ఉర్దూ సాహిత్య రంగానికి గొప్ప బహుమతి. బౌద్ధమతం బాగా ప్రచలితంగా వున్న సుమారు నాలుగవ శతాబ్దం నుండి స్వాతంత్ర్య యానంతర కాలం వరకు భారత ఉపఖండంలో వచ్చిన సామాజిక సాంస్కృతిక పరిణామాల నేపథ్యంతో ఈ నవలను రాశారు. ఈ నవల పలు ప్రశంసలు పొందింది. శాంతిస్నేహం కోసం ఉపఖండపు సాహిత్య సంచికగా వెలువడిన 'ప్రజాసాహితి' (2004 జూలై, ఆగస్టు) సంచికలో "కురుతుల్ - ఐన్ - హైదర్ 'అగ్నిధార' ఒక నిర్దేశ అవగాహన" అనే వ్యాసాన్ని డా॥ అద్దేపల్లి రామమోహనరావు రాశారు.

'మేరేభీ సనమ్‌ఖానే' 1948లో పరస్పరదాడులు,హత్యలు అత్యాచారాలు వలసల నడుమ పాకిస్తాన్‌లో అచ్చయింది. 'సఫీనా-ఎ-ఘమ్-ఎ-దిల్', 'పట్‌జార్‌కీ ఆవాజ్', 'అఖిర్ ఇ షబ్ కె హమ్సఫర్', 'ది స్ట్రీట్ సింగర్స్ ఆఫ్ లక్నో', 'రౌష్నికి రాఫ్తార్', 'చాయ్ కెబాగ్', 'అఖిర్-ఐ షాబ్ కే హమ్స ఫర్(1994)' ఇది నక్సలైట్ ఉద్యమం, బెంగాల్ అశాంతిపై నవల - వీరి ప్రసిద్ధ రచనలు.

1967లో ఉర్దూ సాహిత్యంలో సాహిత్య అకాడమీ అవార్డు,1989లో, జ్ఞానపీఠ్ అవార్డు, సోవియట్‌లాండ్ నెహ్రూ (1969),1994లో సాహిత్య అకాడమీ ఫెలోషిప్, 1984లో ప్రభుత్వ పద్మశ్రీ అవార్డు, 2005లో పద్మభూషణ్ అవార్డు, 1985లో గాలిబ్ అవార్డు అందుకున్నారు.

ఇరవయ్యో శతాబ్దపు ప్రముఖ భారతీయస్వరాలలో ఒకటిగా, పేరు పొందిన ఖుర్రతులైన్ హైదర్ ఉత్తర ప్రదేశ్‌లోని ఆలీఘర్‌లో 1927 జనవరి, 20న జన్మించారు. న్యూఢిల్లీ సమీపంలోని నోయిడా ఆసుపత్రిలో ఊపిరితిత్తుల కేన్సర్‌తో 2007 ఆగస్టు 21న మరణించారు.

వ్యాసం

# ఈ కొత్త పన్నులెందుకొచ్చే....

- గౌరిశంకర్

ఏ దేశ చరిత్ర చూచినా
ఏమున్నది గర్వకారణం?
నరజాతి చరిత్ర సమస్తం
పరపీడన పరాయణత్వం!

ఇలా బలవంతులు బలహీనులను 'పీడన'కు గురిచేయడానికి ఉపయోగించినదే 'పన్ను' (Tax). దీనికి సుంకం, శిస్తు, కప్పం, పుల్లరి అని పలు పేర్లున్నాయి. పన్నులచే ప్రజలు పీడింపబడని కాలం ఒకే ఒకటుంది, అదే ఆదిమ సమాజం! ఉత్పత్తి విధానం, వ్యక్తిగత ఆస్తి లేకపోవడంతో పీడనకు గానీ, దోపిడికి గానీ అవకాశం లేని సమాజం!

కుటుంబ వ్యవస్థ, వ్యక్తిగత ఆస్తి భావనలు, వ్యవసాయోత్పత్తి సమాజాలు ఏర్పడిన తర్వాత వర్గ విభజన లేకపోయినప్పటికీ తెగ నాయకులు చరిత్రలో మొదటిసారిగా కప్పం రూపంలో ధాన్యాన్ని తీసుకునేవారు. అయితే ఆ ధాన్యాన్ని పశువులకూ, సముదాయంలోని క్రింది శ్రేణి ప్రజలకు పునః పంపిణీ చేసేవారు. అదనపు ఉత్పత్తి వచ్చినపుడు ధాన్యాన్ని పెద్ద గిడ్డంగుల్లో భద్రపరిచేవారు. ఈ గిడ్డంగులను పర్యవేక్షించేందుకు కొందరు వ్యక్తులను నియమించేవారు. కాలక్రమంలో వీరు సమాజంలో ప్రముఖమైన వర్గంగా ఎదిగారు. ఈ ధాన్యాగారాలే తొలి ప్రార్థనా మందిరాలయ్యాయి. వాటి పర్యవేక్షకులు పూజారులయ్యారు. మిగులు నిల్వలపై దృష్టిపడిన వీరు సమాజాన్ని నియంత్రించే పాలకులుగా అవతారమెత్తారు. అదనపు ఉత్పత్తి కొరకు రైతాంగాన్ని విపరీతంగా శ్రమకు గురిచేసి కప్పం రూపంలో వారి ఉత్పత్తులను దోచుకొనేవారు.

క్రీ.పూ. 2500–1750 మధ్య కాలంలో విలసిల్లిన సింధూలోయ నాగరికత కాలంలో పట్టణ నిర్వహణ, ప్రజలకు ఆహారాన్ని అందించాల్సిన బాధ్యతలు ప్రభుత్వంపై ఉండేవి. ఆ కారణంగా గ్రామీణ ప్రజల నుండి ధాన్యాన్ని ఇతర వ్యవసాయ ఉత్పత్తులను పన్ను రూపంలో పాలకులు వసూలు చేసేవారు.

క్రీ.పూ. 1000 నుండి విస్తరించిన ఇనుప యుగంలో వ్యవసాయోత్పత్తి గణనీయంగా పెరిగింది. ఫలితంగా యుద్ధవీరులు, పురోహితులు రైతుల ఉత్పత్తిలో మూడవ వంతు లేదా సగభాగాన్ని పన్నుగా వసూలు చేసేవారు. క్రీ.పూ. 800–700 కాలంలో గ్రీకు నగర రాజ్యాలలో పంట విఫలమైనా రైతులు ధనికుల నుండి అప్పులు చేసి మరీ పన్నులు చెల్లించేవారు. చెల్లించలేని పక్షంలో వారి భూములను స్వాధీనం చేసుకొనేవారు.

"న్యాయమైన పన్నులు వృద్ధిని నిరోధించకుండా ప్రజాదరణను పెంచుతాయి. అల్లాడుతున్న ప్రాంతానికి రాజు పన్నుల నుండి మినహాయింపునివ్వాలి" – కౌటిల్యుడు క్రీ.పూ. 375–283

క్రీ.పూ. 206 తర్వాత చైనాలో హన్ వంశం ధనిక వ్యాపారులు, వాణిజ్యవేత్తలను అదుపు చేయదలచి వ్యాపార లాభాలపై పన్ను భారీగా పెంచారు. పన్ను ఎగవేసే ధనిక వ్యాపారుల సంపదను జప్తు చేసేవారు. దీనికి విరుద్ధంగా క్రీ.పూ. 47–క్రీ.శ.443 వరకూ కొనసాగిన రోమన్ సామ్రాజ్యంతో చట్టం ఎన్నడూ సంపద, అధికారం గల భూస్వాముల జోలికి వెళ్ళలేదు. ఉన్నతవర్గాల సంపదంతా ప్రధానంగా భూమి కౌలు నుండే వచ్చేది. పంట దిగుబడి తగ్గితే రైతులు ఆకలితో అలమటించేవారు. ఒక పక్క రాచరిక పన్ను వ్యవస్థ దోపిడీ స్వభావం, మరోపక్క భూస్వాముల పెత్తనం అనేక ప్రాంతాల్లో రైతాంగ తిరుగుబాట్లకు దారితీసాయి.

11వ శతాబ్దపు చైనా సామ్రాజ్యంలో ధనిక కుటుంబాల చేతిలోనే అధిక శాతం భూములుండేవి. వారి పొలాలను సాగుచేసే రైతులకు దిగుబడిలో సగం, మరో సగం భూస్వాములకు చెందేది. 1270 నుండి నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగిపోవడంతో రైతులు దారిద్ర్యంలో కూరుకుపోయారు. రైతాంగ దారిద్ర్యం తిరుగుబాట్లకు దారితీసింది.

14వ శతాబ్దంలో యూరప్‌లో వ్యాపించిన భయంకరమైన ప్లేగు వ్యాధి, ఫ్రాన్సుతో వంద సంవత్సరాల యుద్ధం చేస్తూ వుండిన ఇంగ్లండ్‌లో ఆర్థికవ్యవస్థను పూర్తిగా తల్లకిందులు చేసింది. యుద్ధానికి అవసరమైన నిధుల కొరకు ఇంగ్లండు ప్రభుత్వం ప్రజలపై విపరీతంగా పన్నుల భారాన్ని మోపింది. ముఖ్యంగా రైతులు, వ్యాపారుల నుండి వనరులను సేకరించి తమ అవసరాలను తీర్చుకోవాలని భావించారు. దానితో 1381 జూన్‌లో రైతులు తిరుగుబాట్లు లేవదీశారు.

ఆధునిక కాలానికి వస్తే ఇంగ్లండు రాజైన మొదటి ఛార్లెస్ (1600–1649) కాలంలో చర్చి రైతుల నుండి విపరీతంగా కౌళ్ళు, సుంకాలు వసూలు చేసేది. మరోపక్క రాజు పార్లమెంటు అనుమతి లేకుండానే ప్రజలపై పన్నులు విధించడానికి ప్రయత్నించాడు. రైతులు క్విట్ – రెంట్ చెల్లించడానికి నిరాకరించి తిరుగుబాటు చేశారు. ఇందులో వ్యాపారులు కూడా చేరారు. ఇది పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థ అభివృద్ధికి గల ఆటంకాలను ధ్వంసం చేసింది గనుక ఇదొక బూర్జువా విప్లవం. అదే మాదిరిగా అమెరికాను తమ వలసగా మార్చుకున్న ఇంగ్లండు అక్కడి వ్యాపారాలపై, చివరికి వార్తాపత్రికలపై కూడా పన్ను విధించింది. పార్లమెంటులో వలసల ప్రతినిధులు ఎవరూ లేరు గనుక "ప్రాతినిధ్యం లేనిదే పన్నులు కట్టేది లేదు" అంటూ 1765లో అమెరికా ప్రజలు తిరుగుబాటు లేవదీసారు. ఇక ఫ్రెంచి సమాజానికి వస్తే మొదటి ఎస్టేటులో మతాధికారులు, రెండవ ఎస్టేటులో ప్రభువులు,

మూడవ ఎస్టేటులో వ్యాపారులు, మధ్యతరగతివారు, రైతాంగం, చేతివృత్తులవారు ఉండేవారు. మూడవ అంతస్థులోనివారు మాత్రమే పన్నులను చెల్లిస్తూ రాజ్యభారం మోసేవారు. వీరు బూర్జువాల నాయకత్వంలో 1789లో విప్లవం లేవదీసారు.

ప్రస్తుతానికి మనం మనదేశ ఆర్థికవ్యవస్థలోనికి ప్రవేశిద్దాం. దీనిని 3 దశలుగా పరిశీలించవచ్చు. మొదటిది బ్రిటిష్ పూర్వ ఆర్థికవ్యవస్థ. దీనిని రాచరిక వ్యవస్థగా చెప్పుకోవచ్చు. ఇక్కడ భూమి అమ్మకపు సరుకు కాదు. మొత్తం భూమి రాజుకే చెందుతుంది. అదనపు ఉత్పత్తిని పన్ను రూపంలో లాగేసుకొనేవారు. ఆ ఆదాయాన్ని అంతఃపురాల నిర్వహణకు, కోటల నిర్మాణానికి, సైన్యం, ఉద్యోగుల పోషణకు, రాజుల వ్యక్తిగత ఆడంబరాలకు, విలాసాలకు ఖర్చు పెడుతుండేవారు. కొద్దిమంది రాజులు (కాకతీయులు, విజయనగర రాజులు, అక్బర్) మాత్రమే చెరువులు, కాలువలు తవ్వించి వ్యవసాయాన్ని ప్రోత్సహించారు. పన్నులు చెల్లించలేని కారణంగా 15వ శతాబ్దంలో రెడ్డిరాజుల ఆస్థానంలో గడిపిన కవి సార్వభౌముడు శ్రీనాథుడు కృష్ణాతీరాన వున్న బొడ్డుపల్లి గ్రామాన్ని దత్తత తీసుకొని శిస్తు కట్టని కారణంగా జీవిత చరమాంకంలో కఠినమైన శిక్షకు గురయ్యాడు. ఆయన రాసిన చాటు పద్యం ఇది :

కృష్ణవేణమ్మ గొనిపోయెనింత ఫలము
బిలబిలాక్షులు తినిపోయె తిలలు పెసలు
బొడ్డు పల్లెను గొడ్డేరి మోసబోతి
నెట్లు చెల్లింతు సుంకంబు నేడునూర్లు?

రాజుల దోపిడిని తట్టుకోలేక కొందరు రైతులు బందిపోట్లుగా మారిన సంఘటనలు చరిత్రలో నిక్షిప్తమయ్యాయి. మౌర్య సామ్రాజ్యం గురించి చెబుతూ మెగస్తనీస్ ఇలా అంటాడు : "సామ్రాజ్యంలోని వివిధ ప్రాంతాలలో చేతివృత్తులు, వాణిజ్యం, వ్యవసాయం, వ్యక్తులపై విధించే పన్నుల మధ్య ఎన్నో వ్యత్యాసాలు ఉన్నాయి". అంటే ఏకరూప పన్ను విధానం కాదన్నది గమనించవలసిన అంశం.

బ్రిటిష్ కాలపు ఆర్థికవ్యవస్థను పరిశీలిద్దాం. వారు చాలా తెలివిగా పన్నుల విధానాన్ని తమకు అనువుగా మలుచుకున్నారు. భారత్ నుండి బ్రిటన్‌కు ఎగుమతి చేసే బట్టలు, నూలుపై ఎగుమతి సుంకం పెంచి మన మార్కెట్‌ను అడ్డుకున్నారు. అదే సమయంలో అక్కడ యంత్రాలపై తయారుచేసిన బట్టలపై మనదేశంలో దిగుమతి సుంకం తగ్గించి వాళ్ళ లాభాలను పెంచుకున్నారు. జమీందారీ, రైత్వారీ, మహల్వారీ అంటూ రకరకాల పద్ధతులలో వీలైనంత అధిక మొత్తంలో పన్నులను వసూలు చేసారు. అడవులపై గుత్తాధిపత్యం తీసుకొని గిరిజనులకు అడవుల వినియోగంపై ఆంక్షలు విధించటంతోపాటు వారి నుండి కూడా పలురకాల పన్నులు వసూలు చేసారు. సంతాలులు, కోల్‌లు, కోందులు వంటి గిరిజన తెగలు తమపై బ్రిటిష్ దోపిడికి వ్యతిరేకంగా పోరాడి వేలాదిమంది ప్రాణాలు కోల్పోయారు. ఆంధ్ర రాష్ట్రంలో పల్నాడు సీమలో పశువులను అడవులలో మేపుకొనడానికి పశువు ఒక్కింటికి రూ॥2లు పుల్లరిగా చెల్లించాలని ఆదేశించారు. దీనికి వ్యతిరేకంగా పోరాటం చేసిన మొదటి వ్యక్తి మన తెలుగువాడైన కన్నెగంటి హనుమంతు. ఆ సందర్భంలో పులుపుల శివయ్య ఇలా రాసాడు :

కన్నెగంటి హనుమంతు కోరమీసము దువ్వి
పలనాటి ప్రజలచే పన్ను తెగగొట్టించె
బలి ఇచ్చె హనుమంతునూ
పలనాడు పర ప్రభుత్వము గుండ్లకు!

1890లో ట్రావెన్‌కోర్ సంస్థానాధిపతి దిగువ కులాలకు చెందిన స్త్రీలు తమ వక్షస్థలాన్ని కప్పుకోవాలంటే పన్ను చెల్లించాలని ఆదేశించాడు. దానిని వ్యతిరేకించిన నంగేలి అనే వీర వనిత తన ఆత్మగౌరవం కోసం ప్రాణాలనే బలిచేసుకున్న సంఘటన భారత ప్రజలందరినీ విపరీతమైన క్షోభకు గురిచేసింది. అదేవిధంగా దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారిచే నడుపబడిన చీరాల–పేరాల ఉద్యమం. ఈ ఉద్యమాన్ని ప్రస్తుతిస్తూ

ఒకపక్క బ్రిటిష్ ప్రభుత్వం
మరోపక్క రెండు గ్రామాల జనం
సర్కారు నిర్ణయంపై నిరసన గళం
స్వాతంత్ర్య సంగ్రామంలో మహోజ్వల ఘట్టం....

అంటూ కవులు నినదించారు.

ఇక రైతులు, సామాన్యులు పన్నులను చెల్లించలేక భూములను తెగనమ్ముకొని, అప్పులపాలై, సరైన ఆహారం కూడా సంపాదించుకోలేని దారిద్ర్యంలోకి నెట్టబడ్డారు. వీరి అవస్థలను వర్ణిస్తూ.....

భూమి దున్ని బ్రతకపోతే భరతమాతా
ఎంత పెద్ద పన్ను వేసినాడే భరతమాతా!

ఆడే సందరవంత తవ్వినట్టు భరతమాతా
ఉప్పుమీదా పన్నంట భరతమాతా!

యిల్లమ్మితే స్టాంపు ఖర్చు భరతమాతా
భూమి అమ్మితే స్టాంపు ఖర్చు భరతమాతా!

అప్పు దీసుకున్న స్టాంపు ఖర్చు భరతమాతా
అది యిదీ అననేల భరతమాతా
మాట్లాడితే స్టాంపు ఖర్చు భరతమాతా!

ఉన్న పన్నులే గట్టలేక భరతమాతా
మేము ఘోస పెట్టుసుంటేని భరతమాతా!

మా పాలి యమదూతలై భరతమాతా
యీ కొత్త పన్నులెక్కడొచ్చే భరతమాతా!

ఆలి మెళ్ళో పుస్తి పూస భరతమాతా
అన్నీ అమ్మజూపేసామె భరతమాతా!

అంటూ ఎన్నో పాటలనల్లి ప్రజలకు బుర్రకథలు, నాటికలు వంటి పలు కళారూపాల ద్వారా బ్రిటిష్ పీడనను కళ్ళకు కట్టించేవారు.

ఇక స్వాతంత్ర్యానంతరం అంబేద్కర్ నాయకత్వంలో మనం రూపొందించుకున్న రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్‌లోని 265వ ఆర్టికల్ పన్నుల విధానాన్ని వివరిస్తుంది. దాని ప్రకారం ప్రత్యక్ష పన్నులు, పరోక్ష పన్నులు, కస్టమ్స్ పన్నులు, సేవా పన్నులు విధించబడుతున్నాయి. కొన్ని రాష్ట్రాల పరిధిలోని పన్నులు (ఉదా : అమ్మకపు పన్ను), కొన్ని దేశమంతటికీ వర్తించే పన్ను (ఉదా : ఆదాయపు పన్ను). మన

నల్లదొరలు భూస్వామ్య విధానం దెబ్బతినకుండా తమ అవసరాల నిమిత్తం భూ సీలింగ్ చట్టాలు, కౌలుదారీ చట్టాలు చేసారు. వాటి అమలు గురించి మాత్రం అడగవద్దు!? సహకార సంఘాలను స్థాపించి వాటి ద్వారా బినామీ పేర్లతో ధనిక రైతులు, భూస్వాములకు అవసరమైన పెట్టుబడులు, మార్కెట్ సౌకర్యాలను కల్పించడమే గాకుండా వ్యవసాయంపై వీరికి పన్ను మినహాయించారు. కానీ చిన్న, సన్నకారు రైతులకు భూమి శిస్తు కట్టకుండా మినహాయింపునివ్వలేదు. 70–80 దశకాల్లో ఆర్థికమాంద్యం కారణంగా పన్నుల భారాన్ని పెంచారు.

1991లో సోవియట్ యూనియన్ పతనం తర్వాత మనదేశం తీవ్ర సంక్షోభానికి గురయ్యింది. దాని నుండి బయటపడటానికి ఐఎంఎఫ్‌ను ఆశ్రయించాం. అలీన విధానాన్ని పక్కనబెట్టి అమెరికా పంచన (పడగ కిందికి) చేరాం. దానితో పెట్టుబడి ద్వారా ఆర్థికవ్యవస్థ మరో నూతన దశలోకి ప్రవేశించింది. దీనికే ఆర్థిక సంస్కరణలు అని పేరు తగిలించారు. మన్మోహన్‌సింగ్ ఆర్థికమంత్రిగా ఐఎంఎఫ్ సూచనల (ఆదేశాల) మేరకు దిగుమతులపై సుంకాలు తగ్గించడం, పన్నుల విధానంలో సంస్కరణల పేరుతో ధనికులపై పన్నుల భారం తగ్గించడం చేసారు. ప్రపంచీకరణను అమలుచేయడంతో విదేశాల నుండి దిగుమతి చేసుకొనే విలాస వస్తువుల (టి.వి.లు, కార్లు మొ॥) పై దిగుమతి సుంకాలను, అమ్మకపు పన్నులను తగ్గించారు. ఈ విధానం వలన దేశంలోని ధనికులు, విదేశీ బహుళజాతి కంపెనీలు ఇతోధికంగా లబ్ధి పొందాయి.

1991 నుండి ఇప్పటివరకూ వచ్చిన అన్ని బడ్జెట్‌లూ నూతన ఆర్థిక విధానాలకు అనుగుణంగానే ప్రపంచబ్యాంకు కనుసన్నల్లో రూపొందాయి. ఈ సంస్థ నిర్దేశించిన మేరకు ఖర్చులను తగ్గించి ఆదాయాన్ని పెంచాలి. అందుకు పన్నుల రేటును తగ్గంచి వసూళ్ళను పెంచారు. పన్నుల స్థానే ప్రధాన ఆదాయ వనరుగా ధరలను పెంచే విధానాన్ని అనుసరిస్తూ వస్తున్నారు. సంపద పన్ను తగ్గించారు, కార్పొరేటు ఆదాయంపై పన్ను తగ్గించారు. మరోవైపు కార్పొరేటు కంపెనీలు చెల్లించే కార్పొరేటు పన్నును 30 శాతం నుండి 20 శాతానికి తగ్గించారు. ఫలితంగా దేశానికి ఏటా లక్షన్నర కోట్ల ఆదాయం తగ్గింది. గత ఎనిమిదేళ్ళ మోడీ పాలనలో రూ. 10,72,000 కోట్ల కార్పొరేటు రుణాలు రద్దుచేసారు. వారు బ్యాంకుల నుండి తీసుకున్న రూ. 4 లక్షల 50 వేల కోట్ల రుణాలను లక్షా 61 వేల కోట్లకు తగ్గించేసి సెటిల్ చేసేసారు. ఇలా కార్పొరేట్లకు దేశ సంపదను దోచిపెడుతూ ఆ భారాన్నంతటినీ మధ్య, దిగువ మధ్యతరగతులపై మోపుతున్నారు. ఒక నివేదిక ప్రకారం ప్రజల నుండి వసూలు చేస్తున్న పన్ను ఆదాయంలో 68.5 శాతం పారిశ్రామికవేత్తలకు రాయితీల రూపంలో పోతుంది. ఆదాయ అసమాన పంపిణీకి ఇంతకన్నా ఉదాహరణ అవసరంలేదు.

2011 నాటికి పట్టణ జనాభా 31 శాతంగా వుంది. రియల్‌ఎస్టేట్ వ్యాపారానికి పట్టణాలే కీలకంగా మారాయి. అందువలన అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడి దృష్టి పట్టణాలపై పడింది. ఫలితంగా భూ సీలింగ్, రిజిస్ట్రేషన్ చట్టాల సవరణ, ఆస్థిపన్ను పెంచడం, యూజర్ ఛార్జీలు వసూలు చేయడం వగైరా మార్పుల్ని ప్రవేశపెట్టారు. ఫలితంగా మధ్యతరగతి, పేదలపై అదనపు భారాలు పడ్డాయి. చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా 1996లో "ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సంస్కరణలు – ఎజెండా" పేరుతో ప్రపంచబ్యాంకు ఆదేశాల మేరకు వ్యవసాయ విద్యుత్తు రేటు హార్స్‌పవర్‌కు రూ. 50 నుండి రూ. 200కి పెంచాడు. పన్నుల పెంపకం ద్వారా, విద్యుత్తు ఛార్జీల పెంపకం ద్వారా ప్రజలపై రెండువేల కోట్ల రూపాయల అదనపు భారాన్ని మోపాడు. ఇదే పెద్దమనిషి మరలా పెంచిన విద్యుత్తు సుంకాలను తగ్గించమని అడిగితే 2000వ సం॥లో ప్రజలపై కాల్పులు జరిపి ముగ్గురి ప్రాణాలను బలిగొన్న సంఘటన ఇంకా మన కళ్ళముందు మెదులుతూనే వుంది. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరింత జోరుగా రవాణా సుంకాలను, విద్యుత్తు సుంకాలను పెంచుతూ మేమేం తక్కువ తినలేదు అన్నట్టు చెత్తపై కూడా పన్ను వేసిన ఘనతను దక్కించుకుంది.

ఇక మోడీ సర్కారు విషయానికి వస్తే శిశువులు కళ్ళు తెరిచే ఆసుపత్రి బెడ్ నుండి.... ఆకలికి గుక్కపట్టి ఏడ్చే చిన్నారులు తాగే పాల చుక్కల వరకు.... మనిషి చిట్టచివరి మజిలీ స్మశానవాటిక వరకూ కాదేదీ పన్నుకు అనర్హం అంటూ ఎడాపెడా పన్నులతో బాదుతోంది. ఒకపక్క ఆహార ద్రవ్యోల్బణంతో కడుపు నింపుకోవడమే కష్టంగా మారిన పేదలపై జిఎస్‌టి పేరుతో దేశాన్ని నిత్యక్షామంగా మారుస్తోంది. ఇపుడు నిత్యావసర వస్తువులపై కూడా జిఎస్‌టి భారాలు మోపి మా ప్రభుత్వం పనిచేసేది పేదలు, సామాన్యుల కోసం కాదని చెప్పకనే చెప్పింది.

బియ్యం, మొక్కజొన్న, అప్పడాలు, చేపలు, మాంసం పేకింగ్ చేసినవైతే 5 శాతం; గోధుమపిండి పేకెట్లపై 8 శాతం జిఎస్‌టి విధించింది. విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తామంటూనే ప్రింటింగ్, రైటింగ్, డ్రాయింగ్ ఇంక్‌లు, చివరికి చిన్నపిల్లలు పెన్సిళ్ళు చెక్కుకునే షార్పెనర్లపై కూడా 18 శాతం వడ్డించి పేదలకు చదువును మరింత భారంగా మార్చింది. రెండవ చేతితో సంపన్నులు కొనుగోలు చేసే డైమండ్స్‌పై కేవలం 1.5 శాతం, బంగారంపై 3 శాతం మాత్రం పన్ను విధించి తమ దేశభక్తిని చాటుకున్నారు.

గత కొద్ది సం॥లలోనే ఒక్కో గ్యాస్ సిలండర్‌పై రూ. 561 పెంచింది. 2014లో అంతర్జాతీయ మార్కెట్‌లో రికార్డు స్థాయిలో క్రూడ్ ఆయిల్ ధరలు ఉండడంతో లీటరు పెట్రోలు రూ. 74.71కు చేరింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు తగ్గుముఖం పట్టినప్పటికీ మన రాష్ట్రంలో పెట్రోలు లీటరు ధర రూ. 111కు చేరింది. చాలా తెలివిగా పెట్రోలు, డీజిల్, గ్యాస్‌లను జిఎస్‌టి పరిధిలోకి తీసుకు రాకుండా వారానికోసారి, పదిరోజులకొకసారి వాటి ధరలను కొద్ది మొత్తాల్లో పెంచుతూ చివరికి గ్యాస్‌బండ ధరను ఏకంగా రూ. 1100కు చేర్చారు. ఈ అపర దేశభక్తులు యువతను పక్కదారి పట్టిస్తున్న ఆన్‌లైన్ గేమ్‌లు, గుర్రపు పందాలు, క్యాసినోలు, లాటరీలపై 28 శాతం పన్నులు వేయాలనే ప్రతిపాదనను కనీసం పరిశీలించనైనాలేదు.

పెరుగు, లస్సీ, మజ్జిగ వంటి ప్యాక్డ్ పాల ఉత్పత్తులపై కొత్తగా 5 శాతం జిఎస్‌టి విధించారు. ఈ ఉత్పత్తుల తయారీలో వినియోగించే యంత్రాలపై జిఎస్‌టిని 12 నుండి 18 శాతానికి పెంచారు. తొమ్మిది కోట్ల గ్రామీణ కుటుంబాలు ఈ రంగంపై ప్రత్యక్షంగా ఆధారపడ్డాయి. 75శాతం పాల ఉత్పత్తిదారులు 2 నుండి 4 పాలిచ్చే పశువులను

కలిగినవారే. వీరందరినీ ఈ రంగం నుండి దూరం చేసి, కార్పొరేట్ రంగం గుప్పెట్లో డెయిరీ రంగాన్ని పెట్టేందుకే ఈ పన్నుల మోత మోగించారని, పిల్లలకు పౌష్టికాహారమైన పాలు కూడా అందకుండా చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తాయి. ఈ ధరల పెరుగుదల సామాన్యులతోపాటు రోడ్డుపక్కన చిరుతిళ్ళు అమ్ముకునే చిరు వ్యాపారులపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది.

ఇవన్నీ చాలవన్నట్లు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వరుసగా 3 సం॥లలో మూడుసార్లు ఆర్‌టిసి ఛార్జీలు పెంచేసింది. దీంతో ప్రయాణికులపై రూ. రెండు వేల కోట్ల భారం పడుతోంది. ఈ మధ్యనే రూ. 1400 కోట్ల మేరకు విద్యుత్ ఛార్జీల భారం మోపి దానికి అదనంగా ట్రూఅప్ పేరుతో మరో రూ. 2,900 కోట్లు వసూలు చేయడానికి సిద్ధంగా ఉంది.

ధరలు, పన్నులు పెంచినప్పుడల్లా ప్రతిపక్షాలు రెండు, మూడు రోజులు హడావిడి సృష్టించి మా పనైపోయిందని అనుకుంటున్నాయి. మరోపక్క పాలకులు ప్రజాఉద్యమాలపై పాశవికంగా దాడులను కొనసాగిస్తూ తీవ్ర అణచివేతకు పాల్పడుతున్నాయి. పేదల సంఖ్య ఎంత వేగంగా పెరుగుతుందో దేశంలో బిలియనీర్ల సంపద అంతకంటే వేగంగా పెరుగుతూ ఆర్థిక అసమానతలు మున్నెన్నడూ లేనంతగా తీవ్రతరమవుతున్నాయి. కన్నెగంటి హనుమంతు జరిపిన పుల్లరి ఉద్యమం, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య జరిపిన చీరాల–పేరాల ఉద్యమాల స్ఫూర్తి నేడు తగ్గుతున్నదా? ప్రపంచ చరిత్రలో పలు ఉద్యమాలను విజయవంతంగా నడిపిన విద్యార్థి సంఘాలు, మధ్యతరగతి మేధావి వర్గాలు నీరుగారిపోతున్నాయా? పీడన, దోపిడులు ఎక్కువయ్యే కొద్దీ ప్రజల్లో పోరాట పటిమ మరింత చేవదేరాలి.

అమెరికా, బ్రిటన్‌లతో సహా పలు అభివృద్ధి చెందిన దేశాలలో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం పెరిగిపోతూ మరొక ఆర్థికమాంద్యం దిశగా ప్రయాణిస్తున్నాయి. 5వ అతిపెద్ద ఆర్థికశక్తిగా భారత్ ఎదిగిందని తొత్తు మీడియాల ద్వారా ప్రచారం చేయించుకుంటున్నారు. మరోపక్క మానవాభివృద్ధి సూచికలో అట్టడుగు స్థాయిలో వుందని అధికార గణాంకాలు చెబుతున్నాయి. దేశాభివృద్ధి నేతిబీరకాయలోని నేతి చందంగా వుంది. ఆదాయానికీ, సంపదకూ తగిన పన్నులు విధిస్తే పేదల కడుపులు నిండుతాయి. అదే అసలైన ప్రజాస్వామ్యం!

ఈ భూమి మా భూమిరో
ఇది బంగారు మాగాణిరో
పన్నులెన్నో వేసి పంట నీరులను దోచి
మా తల్లి నేలకే దూరమ్ము చేసేటి
దుష్ట పరిపాలనకు స్వస్తి యీనాడే
పన్నుల నిరాకరణ ప్రారంభమాయె
పదండి ముందుకు నడండి తోసుకు
కదం తొక్కుతూ కదలండి!!

కవిత

# కుల దాహం

– సునీత గంగవరపు

ఇప్పుడు ఏ నీళ్లను చూసినా
భయంతో గొంతు
పిడచగట్టుకు పోతుంది
ఏ నీటి బొట్టు పైన
ఎవడి కులం పేరు రాసుకున్నాడో అని

దాహార్తిని తీర్చే నీరు
ప్రాణాంతకంగా పరిణమించిన వైనం
బడిలో పాఠాలు దిద్దుకునే చిన్నారులకు
అర్థం కాని ప్రశ్నగా మారి
మెదళ్లను అనుమానాలతో గుచ్చుతుంది

అమ్మ నాన్నలకే కదా పుట్టాము?
ప్రాణాలు తీసే ఈ కులం
ఎవడి మెదడు తుట్టె లోంచి
పుట్టుకొచ్చింది?

చెమటచుక్కల ఒడిలోంచి జారిన
మట్టి బిడ్డకు..
నీ కులం కంపు ఎట్లా తెలుస్తుంది?

కులం గోచీ పెట్టుకొని
ఊరేగుతున్న నీఛోపాధ్యాయా..!
మానవత్వపు విలువలు
ఎక్కడ వదిలేశావు?
వాడి కష్టంతో చదునుచేసిన పంటనే కదా
నువ్వూ తింటున్నావు?
భుక్తి కోసం.. గుక్కెడు నీటి కోసం
తరతరాల దాస్యం చేసే జాతి బిడ్డకు
నీ సవర్ణ రహస్యార్థాలు
ఏ తరగతి గదులు బోధిస్తాయి?

దేశమంటే మనుషులంటూ
పిల్లలకు బోధించి
మెదడును బురదలో కుళ్లబెట్టిన కళంకీ..
నీపై కులం మత్తు జల్లి
నిన్నావాహన చేసుకున్నోడి
మూతి పగులగొట్టు

ఆనక జ్ఞాన స్నానం చేసి
మురికిపట్టిన నీ మనోదేహాలకు
తెల్లటి మనిషితనాన్ని తొడుగు
సంస్కారం నేర్పని నీ చదువును
మడిచి.. స్మశానం లో పూడ్చుకో
కూటికీ..నీటికీ.. కన్నీటికి
కులమతాలుండవని
నువ్ చావకముందే తెలుసుకో

(రాజస్థాన్‌లోని ఓ పాఠశాలలో తొమ్మిదేళ్ల దళిత బాలుడు ఇంద్ర కుమార్ మృతికి కారణమైన కులోన్మాదానికి నిరసనగా..)

వ్యాసం

# ముప్పాతికేళ్ల విషాదభారతం - పాయసంలో గరిట వంటి విద్యావిధానాలు

- పి.ఎస్. నాగరాజు

**ఒక్క** రక్తం బొట్టు కూడా చిందకుండా
అహింసామంత్రజపం వల్లనే
అమాంతం జాతికి స్వాతంత్ర్యం రాగా
తెల్ల దొరల సీట్లో
నల్లదొర బేషుగా ఆసీనుడయ్యాడు!!
పరమోత్కృష్ట ప్రజాతంత్ర రాజ్యాంగచట్టం
ప్రసాదించింది ఆడా మగా తేడా లేకుండా
అందరికీ రైట్ టు వోట్!!! **(సివి "విషాదభారతం")**

ప్రజలుగా గాక, పౌరులుగా గాక, ఓటర్లుగా మాత్రమే భారతీయులు గుర్తించబడుతున్నారు. అయితే ఈనాటికి మన రాజ్యాంగం ప్రకారమే ప్రజలు కనీసం ఓటర్లుగా కూడా మిగిలే పరిస్థితి కనబడటం లేదు. కేవలం చిత్ర విచిత్ర పన్నులు పితుక్కోబడే పశువులుగా మిగిలారు.

విధ్వంసకర పరిస్థితుల్లో వున్న ఈ విషాదభారతంలో విద్యావ్యవస్థ గురించి మాట్లాడాలంటే దుఃఖం కూడా గడ్డకట్టేస్తుంది.

సామాజిక విలువల్ని విస్మరించిన మనిషి తనపట్ల గాని, సంఘం పట్ల గాని కనీస బాధ్యతను కూడా నిర్వర్తించలేడు. అలా లోలోపల కుళ్ళిన మనిషి సాంఘిక విచ్ఛిన్నానికే సిద్ధపడతాడు. వ్యక్తుల్లో అవినీతిని ప్రోత్సహించే విధానాలను విచ్చలవిడిగా అమలు చేస్తున్న వ్యవస్థలో వ్యక్తి సొంత వ్యక్తిత్వం నిలువునా విచ్ఛిన్నమైపోతుంది. ముప్పాతికేళ్ల అతిపెద్ద భారత ప్రజాస్వామిక స్వాతంత్ర్య పాలన నేటికి మిగిల్చిన విద్యాసంస్కృతి ఏంటంటే -

"ఎడ్యుకేషన్ మేక్స్ వన్ రోగ్ క్లవరర్ దేన్ అనదర్"

**(ఆస్కార్ వైల్డ్)**

ఈ పరాధీన ఆర్థిక రాజకీయ విధానాల మధ్య ఈ పతన వ్యవస్థకు కావలసిన అవినీతిపరులను, రౌడీల, గూండాల, హంతకుల పాలకుల్ని, ప్రజావ్యతిరేక అధికార గణాన్ని, మేక తోలు కప్పుకున్న పులుల్లాంటి న్యాయ కోవిదుల్ని, డబ్బు రక్తం మరిగిన మీడియాని, తప్పుల గోతుల్ని వెతికే తోడేళ్ల గుంటనక్క లాంటి పోలీసు వ్యవస్థని, వారి చెప్పుచేతల్లో నడిచే విద్యావేత్తల్ని, కవుల్ని, కళాకారుల్నీ ఈనాటి విద్యావిధానం ఉత్పత్తి చేస్తోంది. కులం, మతం, ప్రాంతం, జండర్ మొదలైన అనేక వివక్షలు, ఆర్థిక అసమానతలు, మూఢాత్వం, బాధ్యతా రాహిత్యం, స్వసుఖవాదం, కాలం చెల్లిన నిచ్చెన మెట్ల దొంతరల ఆధిపత్యం, పక్కనే అధీన భావజాలం, కెరీరిజం, వ్యక్తి కేంద్రక అభివృద్ధి, డబ్బు సంస్కృతి - ఇన్ని రకాల జాడ్యాలను పెంచి పోషిస్తున్న విధ్వంసక సాంస్కృతిక విధానాలతో మన విద్యారంగాన్ని కోలుకోలేనంతగా సంక్షోభంలోకి నెట్టడంలో ఈ ముప్పాతికేళ్ల దళారీ బూర్జువా పాలక విధానాలు విజయవంతమై ఈ వ్యవస్థను సర్వతోముఖ పతనం వైపు మనోవేగంతో తీసుకుపోతున్నాయి.

ఈ వర్తమాన కూడలిలో నిలబడి విహంగ వీక్షణంగా మన విద్యారంగంలో ఉద్భవించిన గరళమెంతో, అమృతమెంతో, ఏది ఎవరికెంతెంత, లెక్కలు తేల్చుకునే కూడలిలో ఉన్నాం.

తరగతి గదిలో దాహానికి అందుబాటులో ఉన్న కుండెడు నీళ్లు నిలువునా ఒక పసిప్రాణాన్ని తీసాయి. వర్ణాధిక్యతతో ఒక దళిత పసిప్రాణాన్ని అమాంతం దిగమింగే అతి పెద్ద దాహాల ఆధిపత్యాలు ఇంకా అంతరించని వర్తమానంలో మనం ఉన్నాం. అంతరిక్షాలను ఆవిష్కరించుకునే అధి'రోహితు'లను ఇంకా పురోహితవర్గం బలి తీసుకునే విశ్వవిద్యాలయాల లోగిలిలోనే ఉన్నాం. బ్రిటిష్ వలస పాలనకు పూర్వం ఉన్న అమానుష క్రూర జంతు ప్రవృత్తితో నడుస్తున్న గురుకుల విద్యా సమాజమే నేటికీ నయావలస విధానాలను పుణికి పుచ్చుకొని కొనసాగుతోంది.

1835 నాటి మెకాలే మినిట్స్ - ఆనాటి ప్రత్యక్ష వలస పాలనకు అనుకూలంగా మాత్రమే కాక, నేటి పరోక్ష వలస పాలనకు కూడా పూలబాట పరుస్తూ, మన స్వాహాతంత్ర్య భారత పాలనకు అండదండలను అందిస్తోంది. ఆంగ్ల విద్య ద్వారా నాటికి, నేటికి ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ పరిపాలించే సామ్రాజ్యవాదశక్తులు కోట్లాది ప్రజలకు, తమకు అనుసంధానకర్తలుగా వ్యవహరించగలిగే ఒక ప్రజా సమూహాన్ని తయారు చేసుకోవడంలో సఫలీకృతం అయ్యారు. అప్పటికి ఇప్పటికీ కూడా సామాజిక ఉపరితలంలో ఉన్న పై అంతస్తు కులాలు ఆ అవకాశాలను పొడవు చేతులవాళ్లుగా అందుకుంటూనే ఉన్నారు. నిమ్న కులాలవాళ్ళు, జాతులవాళ్ళు ఆ అవకాశాలు అందుకుంటున్నా, దోపిడి వర్గాల చట్రంలో ఇమిడిపోతున్నారు గాని, ఈ దోపిడీ చట్రాన్ని బద్దలు కొట్టే చైతన్యాన్ని మాత్రం ఇంకా పూర్తిగా అందుకోలేకపోతున్నారు.

1835లో మెకాలే ఆలోచన చేసిన ఆంగ్లీకరణ విద్య ద్వారా బ్రిటిష్ సర్కారీలో ఉద్యోగ వర్గం ఏర్పడి ఒక కొత్త మధ్యతరగతి వర్గం ఆవిర్భవించింది. వీళ్లు ప్రజలకి పాలకులు కి మధ్య మధ్యవర్తులుగా ఉండి వలస పాలకులకు ప్రయోజనాలు చేకూర్చి పెడతారు. ఆ ఆంగ్ల విద్యే నేటికీ కొనసాగుతూ విద్యావంతులుగా చెప్పుకోబడుతున్న ఈ మధ్య తరగతి వర్గం ప్రజల్ని పాలకుల విధానాలకు ఒప్పించి బలిచేసే దళారీ వర్గంగా ఒక చట్రంలో ఇమిడిపోయారు.

ఈ రకమైన ఆలోచన... ఈ రకమైన ఒక మధ్యతరగతి వర్గాన్ని తయారుచేసుకోవాలనే గుణపాఠాన్ని 1857 ప్రథమ స్వాతంత్ర సంగ్రామం వలస పాలకులకు నేర్పింది. పోరాటం చేసేవాళ్ళ కన్నా తొందరగా, ఎక్కువగా తెములుకుని, వలస పాలకులు సరైన సమయంలో ఆ గుణపాఠంతో ఒక విభజించు పాలించు అనే ఎత్తుగడతో ప్రజల్లో ఒక వర్గానికి ఉద్యోగాలను ఎరవేసి మధ్యతరగతి వర్గంగా సృష్టించారు. అదే సమయంలో ఆ 1857లోనే వలస పాలకులు ఈ మధ్యవర్తులను ఉత్పత్తి చేసే కార్ఖానాగా మూడు విశ్వవిద్యాలయాలను మద్రాసు – కలకత్తా – బొంబాయిలలో స్థాపించారు.

'ఆనాడు ప్రబలంగా వేళ్ళూనుకున్న ఆంగ్ల వ్యామోహాన్ని గురజాడ 'కన్యాశుల్కం'లో బీభత్సమైన హాస్యంతో ఎద్దేవా చేస్తాడు. ఆనాటి నుండి ఈనాటి వరకు ఆ 'కన్యాశుల్కం'లోని గిరీశం లాంటి గురువులను, వెంకటేశం లాంటి శిష్యులను మన విద్యావృక్షం కుక్క మూతి పిందెలుగా కాస్తూనే ఉంది. అంటే ఈ పరాధీన విద్యావిధానం వల్ల నిజమైన సామాజిక చైతన్యాన్ని మన విద్యారంగం ప్రజలకు అందించటం లేదన్న మాట.

కానీ, పూలే దంపతులు ఖచ్చితమైన సామాజిక చైతన్యంతో విద్యా ప్రయోజనాలను ఆచరణీయం చేశారు. సత్యశోధన సమాజం స్థాపించి వారు భారతీయ విద్యా విజ్ఞాన ప్రపంచాన్ని ఒక కీలకమైన మలుపు తిప్పారు.

సమాజంలో ఆడపిల్లలకు చదువు నేర్పితే, కుటుంబమే కాదు ప్రపంచమంతా అమ్మ లాలనలో మానవీయ ఆకాంక్షలతో శాంతి సంతోషాల చంద్రశాలగా విలసిల్లుతుందని ఆశపడి, ఆశయాలను ఊపిరిగా చేసుకుని జీవితాన్ని అంకితం చేసిన సామాజిక ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే. ఆమె కృషి ఫలితమే ఈనాటి ఆడ పిల్లల చదువులు.

**హితకారిణీ సమాజం** – ఒక కార్యశూరుని దీక్ష నుండి ఆవిర్భవించి, ఆడపిల్లల చదువుకోసం తెలుగునాట తొలి బీజాలు నాటిన సంస్కరణోద్యమ కృషి ఫలితం అది. మూఢనమ్మకాల మీద, మహిళలపై దురాచారాల మీద, దురాగతాల మీద విస్ఫులింగంలా విరుచుకుపడ్డాడు. వీరేశలింగం ఆడ పిల్లల చదువుల కోసం, వాళ్ల ఆర్థిక ప్రతిపత్తి కోసం, వాళ్ల సాంస్కృతిక వికాసం కోసం జీవనరంగాన్ని యుద్ధరంగంగా మార్చుకున్న కలం పట్టి పోరాడిన ఆచరణ యోధుడు.

ఫలితంగా ఈరోజు మగపిల్లలకంటే ఆడపిల్లలే మారుమూల గ్రామాల నుండి మహానగరాల వరకు పట్టుదలగా, ఏక దీక్షగా, చదువుకుంటూ అన్ని రంగాలలో తిరుగులేని శక్తి సామర్థ్యాలను చాటుకుంటూ దూసుకుపోతున్నారు.

నిజానికి అందమైన అబద్ధాల్లో కల్లోల అభివృద్ధి ఉన్నా, నిష్ఠురమైన నిజాలలోనే అసలైన జీవన వికాసానికి అవకాశం ఉంది.

వంటిళ్ళు వదిలి, వెట్టిచాకిరి సంకెళ్ళను విదిలించుకొని, సామాజిక ఉత్పత్తి రంగాల్లో, విద్యా వైజ్ఞానిక రంగాల్లో, పరిపాలన రంగాల్లో, కర్మాగారాల నుండి అంతరిక్షం వరకు విస్తృతంగా వ్యాపిస్తున్న ఆడపిల్లలు ఈరోజు తమని తాము నిరూపించుకుంటున్నారని సంబరపడదామా? గడప దాటి బయటికి వెళ్ళిన ఆడబిడ్డ ఏ మృగాళ్లకు ఆహారం అవుతుందో అని తల్లితండ్రులు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని బిక్కుబిక్కుమని ఇంటిదగ్గర ఎదురుచూసే భయంకర పరిస్థితులకు కుమిలి పోదామా??

నిజానికి ఈ భారత దళారీ బూర్జువా వ్యవస్థ నిజమైన అర్థంలో జాతీయ పెట్టుబడిదారీ వ్యవస్థను ఎదగకుండా చేస్తోంది. ఈ వ్యవస్థలో సమస్యల మీద సమస్యలు వచ్చి పోగుపడటమే తప్ప, సమస్యల పరిష్కారం అంటూ ఉండదు. ప్రజల సమస్యలు ఎన్నికల్లో హామీలు అవుతాయి. ఎన్నికల హామీలు గద్దెను తెచ్చి పెడతాయి. గద్దె ఎక్కిన తర్వాత హామీలు గాలికి ఎగిరిపోతాయి. గాలికి పోయిన హామీలు మరికొన్ని సమస్యలను తెచ్చిపెట్టి ప్రజలను నిరంతరం పాతాళానికి దిగలాగుతూ ఉంటాయి. మళ్లీ ఈ సమస్యలు ఎన్నికల హామీలు అవుతాయి. ఇది ఒక విషవలయం.

ఆ విషయం ఆలయాల్లో పుట్టిన మరో సుడిగుండం బాలకార్మిక వ్యవస్థ. బాలకార్మిక వ్యవస్థను రద్దు చేయాలని ప్రభుత్వం పాలకులు ఎన్నో పథకాలు పన్నుతూ ఉంటారు. వారోత్సవాలు, మాసఉత్సవాలు చేస్తూ ఉంటారు. ప్రణాళికల మీద ప్రణాళికలు వేస్తూనే ఉంటారు. కానీ "పెట్టుబడికి" పుట్టిన అనాథ బిడ్డ బాల కార్మికుడు. చవకబారు కూలీల వ్యవస్థకు వీడు పట్టుగొమ్మ. పాలకవర్గాల అంచనాల్లో ఈ వ్యవస్థ కొనసాగుతూనే ఉండాలి. వీళ్ళను ఉద్ధరించడానికి అంటూ కొన్ని పాఠశాలలు పుడుతూ ఉంటాయి. మఘలో పుట్టి పుబ్బలో నాశనం అవుతాయి. పాఠశాలల రూపం మిగులుతుంది సారం గాలికి ఎగిరిపోతుంది. అలా పుట్టిన అనేక మేనేజ్మెంట్ల పాఠశాలలతో ఉపాధ్యాయ వర్గం యొక్క ఐకమత్యాన్ని, సంఘటితత్వాన్ని గండి కొట్టి పాలకవర్గాలు పబ్బం గడుపుకుంటున్నాయి.

కాసేపు ఈ విషయాన్ని పక్కన పెట్టి, వయోజన విద్య దగ్గరికి వస్తే, సంతకం చేయడం నేర్పడమే అక్షరాస్యతగా చలామణి అయిపోతుంది. కాగితాల మీద లెక్కలు అక్షరాస్యత శాతాన్ని చుక్కలలో చూపిస్తోంది. అసలు వార్తాపత్రిక చదవడమే కీలకమైనటువంటి అక్షరాస్యత. అది పక్కదారి పడుతుంది. దగాకోరు పథకాలతో ఉదారవాద సంస్కరణలతో ఆంగ్లేయ వలస విద్యావిధానపు లక్ష్యం అంతర్వాహినిగా సాగిపోతూనే ఉంటుంది. సామ్రాజ్యవాద ప్రత్యక్ష పరోక్ష పాలకులకు గాని, వారి దళారీలకు గాని భారతదేశం సహజ వనరులతో, చవక కూలీలతో నోరూరిస్తున్న అందమైన, విశాలమైన మార్కెట్. నిజానికి ఈ భారతదేశాన్ని వ్యవసాయ ఉత్పత్తులతో, వాటి అనుబంధ పరిశ్రమలతో; నిజంగా అభివృద్ధి చెందిన దేశంగా; మార్చే ఉద్దేశం అస్సలు లేదు. దానికి తగ్గట్టే ఇక్కడ మరుగుజ్జు విద్యా విధానం నత్తనడక నడుస్తూ ఉంటుంది.

ప్రజల్ని విజ్ఞానవంతులుగా చేస్తున్నట్లుగా పెద్ద పెద్ద ఆర్భాటాలు చేస్తుంది. నిజానికి ప్రజలు నిజంగా విజ్ఞానవంతులైతే, చైతన్యవంతులైతే ఈ పరాధీన ప్రభుత్వాల పునాదులు కదిలిపోతాయన్న సంగతి ప్రజలకు అర్థం కాకుండా చేసి, ఒక పెద్ద అయోమయాన్ని సృష్టించి, దళారీ బూర్జువా పాలకవర్గాలు రకరకాల మీడియాల ద్వారా, రకరకాల ప్రజల మెదడులను తమ అదుపులో ఉంచుకోవడానికి నిరంతరం లక్షల కోట్లు ఖర్చు పెడుతూనే ఉంటుంది. అవన్నీ విజ్ఞానాలుగా, వినోదాలుగా చలామణి అయిపోతూ ఉంటాయి.

ఒక్కసారి మూలాల్లోకి వెళితే, ఒకనాటి జాతీయ ఉద్యమంలో, రాజకీయరంగంలో "హోమ్ రూల్" నుండి "డొమినియన్ స్టేటస్" తరువాత సంపూర్ణ స్వాతంత్ర్యానికి చైతన్యం పెరిగిన క్రమంలో "జాతీయ విద్యా విధానం" అనే నినాదం ముందుకు వచ్చింది. బెంగాల్ విభజన తరువాత, 1906లో కలకత్తా కాంగ్రెస్ జాతీయ విద్యా విధానం గురించి తీర్మానం చేసింది. ఈ జాతీయ విద్యా విధానం లక్ష్యం –

గత వైభవాన్ని తెలుసుకోవడం, భారతీయ సాహిత్యాన్ని అధ్యయనం చేయడం, భారతీయ చరిత్రను తెలుసుకోవడం, శాస్త్ర విజ్ఞానాన్ని అవగాహన చేసుకోవడం, కళలను నేర్చుకోవడం, యుద్ధ విద్యలు నేర్చుకోవడం, ఆంగ్ల భాషా పెత్తనాన్ని రద్దు చేయడం, ఆధునిక భారతీయ భాషల్లో విద్య నేర్పడం, వృత్తి విద్య, సాంకేతిక విద్యలకు ప్రాముఖ్యత ఇవ్వడం. నిర్బంధ విద్యాభ్యాసాన్ని గోఖలే ప్రతిపాదన చేశాడు.

ఇన్ని చేసి, చివరిగా విడిచిన నిట్టూర్పు ఏంటంటే... రాజకీయ స్వాతంత్ర్యం రాకుండా, జాతీయ విద్యావిధానాన్ని అమలులోకి తీసుకు రావడం సాధ్యం కాదని జాతీయ ఉద్యమ నాయకత్వం భావించింది.

ఆ తర్వాత స్వాతంత్ర్యం రాకముందు స్వాతంత్ర్యం వచ్చాక ఎన్నో విద్యా కమిషన్లు – రాధాకృష్ణన్ కమిషన్(1948–49), 1944లో సార్జెంట్ పథకం, డాక్టర్ ఎం.ఎం. సాహూ కమిటీ, మొదలియార్ కమిషన్ (1952), ఆ తర్వాత 1964–66లో కొఠారి కమిషన్ వచ్చింది. ఎన్నో ప్రగతిశీలమైన సిఫార్సులు చేసిన ఈ కొఠారి కమిషన్‌ని నోటితో పొగిడి నొసలతో వెక్కిరించారు. ఎందుకంటే, అప్పటివరకు కొనసాగుతున్న ఆంగ్ల విద్యను, అది నేర్పే సంస్కృతిని, కాదని, ఉన్నవాళ్లకో బడి, లేనివాళ్లకో బడి అనే విధానాన్ని త్రోసిపుచ్చి, దళితులకు ప్రవేశం లేని పాఠశాలలను ఖండించి, కొఠారి కమిషన్ "ది కామన్ స్కూల్ విద్యా విధానాన్ని", 'మాతృభాషలో విద్య'ని ప్రధానంగా డిమాండ్ చేసింది. అందరికీ సమానమైన అవకాశాలు కావాలంది. శ్రమకు తగిన ఫలితాన్ని ఇచ్చే విద్యను నేర్పాలి అంది. లింగ వివక్ష ఉండని సమాజాన్ని విద్య అందివ్వాలంది. అందుకే ఈ కొఠారి కమిషన్ నివేదికను దళారీ భారత బూర్జువాపాలకవర్గం పక్కన పెట్టింది.

ఎందుకంటే, భారత పాలకవర్గాలు ధనికవర్గానికి, సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థలకి అమ్ముడుపోయిన వర్గాలవి. అందుకే 1986లో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం నూతన విద్యావిధానాన్ని ప్రవేశపెట్టి సరళీకరణ, ప్రైవేటీకరణ, వ్యాపారీకరణ పేరుతో విద్యను సరళీకరిస్తున్నాం అన్నటువంటి భ్రమను కల్పించి, ప్రభుత్వ బాధ్యతగా ఉండవలసిన విద్యారంగాన్ని వ్యాపార కేంద్రాలుగా మలిచింది. ఆ తర్వాత 1990లో పీవీ నరసింహారావు చేపట్టిన నూతన ఆర్థిక విధానాలలో భాగంగా, విద్య కార్పొరేటీకరణవైపు పరుగులు తీసింది.

ఈ క్రమంలోనే భారతీయ మాతృభాషలకు, ఆంగ్లభాష విద్యా విధానానికి అసంబద్ధమైన పోటీ ఏర్పడింది. విద్యావేత్తలు, తత్త్వవేత్తలు విద్యారంగ కమిషన్లకి నాయకులుగా ఉండాల్సింది పోయి 2000లో అంబానీ – కుమార మంగళం – బిర్లా – కమిషన్ ఏర్పడటంతో పారిశ్రామికవేత్తల చొరబాటు విద్యారంగంలో ప్రారంభమైంది. ఎందుకంటే దానికి తాజా ఉదాహరణగా... నేటి ప్రధానమంత్రి మోడీ సరిహద్దుల్లో ప్రాణాలొడ్డి పోరాడుతున్న సైనికులు కన్నా, పెట్టుబడిదారులు ఎంతో సాహసవంతులని చెప్పిన ఉటంకాన్ని ఇక్కడ గుర్తు చేసుకోవచ్చు. అంతటితో ఆగక మోడీ ప్రభుత్వం వచ్చాక మత వైషమ్యాలు, అగంతక హత్యలు, విద్య కాషాయీకరణ, దళితుల ఊచకోత, విశ్వవిద్యాలయాల్లో కులమత విద్వేషాలు మితిమీరిపోయాయి.

ఈ నేపథ్యంలో, నూతన విద్యావిధానాన్ని జులై 29, 2020న కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. 34 సంవత్సరాల తర్వాత రూపొందిన ఈ జాతీయ విద్యావిధానంలో భిన్న మతాలు, భిన్న కులాలు, భిన్న ప్రాంతాలు, భిన్న సంస్కృతులుగా ఉన్న భారతీయ ప్రజానీకానికి అవసరమైన "భారత జాతీయత" మృగ్యమైన "నూతన విద్యా విధానం ఇది. 71 పేజీల తాజా విద్యావిధాన పత్రం ఇది. రాజ్యాంగంలో రాసుకున్న దగ్గరనుంచి, 2010 విద్యాహక్కు చట్టంలో చెప్పబడిన నిర్బంధ విద్య సందేహాస్పదమవుతోంది. 2025 నాటికి అందరికీ అక్షరాస్యత అనే మరో కొత్త మైలురాయిని నాటింది. మొత్తానికి ఈ కొత్త చట్టాల ద్వారా విధానాల ద్వారా ప్రభుత్వం ప్రజల విద్యకు బాధ్యత వహించే సూచనలు భూతద్దం పెట్టి వెతికినా కనిపించవు. నిధుల కేటాయింపు గురించి పల్లెత్తు మాట లేదు. అందరికీ నియత విద్యను అందించే బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పుకుంటోంది. అనియత విద్య, దూరవిద్య పథకాలకు ప్రాధాన్యత ఇస్తోంది. స్థానిక స్వచ్ఛంద సేవకులకు, మానవ ప్రేమికులకు, విద్యాభిమానులకు, ఇంకా ఇతరులకు పాఠశాల విద్యానిర్వహణ బాధ్యతలను అప్పజెప్తారట. ఉపాధ్యాయుల నియామకం నుండి పూర్తిగా తప్పుకుంటారట. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు వ్యక్తుల ప్రవేశాన్ని ఆధిపత్యాన్ని అనుమతిస్తారట. ఆనాటి రాజాజీ ఒంటిపూట బడులను తిప్పి కొట్టిన ఏపీటీఎఫ్ అలుపెరుగని పోరాటాన్ని మళ్ళీ ఇవాళ పాఠశాలల పునర్విభజన, ఇంకా ఇతర వృత్తివిద్య ఎంపికలు మళ్లీమళ్లీ రావాల్సిన పరిస్థితుల్ని కల్పిస్తున్నాయి. వృత్తి విద్యలు, చేతి పనులు, వడ్రంగం, విద్యుదీకరణ, కమ్మరం, కుండలు చేయడం, తోట పని మొదలైన వాటిని పాఠశాల విద్యలుగా ప్రవేశపెట్టి, వాటిని నేర్చుకునే విషయంలో స్థానిక వృత్తికారుల సహకారం విద్యార్థులు తీసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వర్తమాన రాష్ట్ర విద్యారంగం అతలాకుతలం అయిపోతున్నది. విద్యార్థులకు నిలకడ లేని పరిస్థితులను కల్పిస్తున్నారు. పసిపిల్లలను దూర ప్రాంతాల బడులకు తరలిస్తున్నారు. ఉపాధ్యాయులను నిర్బంధాలకు గురిచేస్తున్నారు. ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాలకు గండి కొడుతున్నారు. తరగతి గదిలో ఉపాధ్యాయుని ఒక ఫెసిలిటేటర్‌గా కుదించాలనే ప్రయత్నాలు ముమ్మరం అవుతున్నాయి. బైజూస్ లాంటి విద్యా వ్యాపార సంస్థలకు పాఠశాలలను తాకట్టు పెడుతున్నారు. పాఠశాలల మెరుగుదలకు నడుము కట్టినట్టు చెబుతున్న నాడు – నేడు పనులతో పాఠశాలలను వాటి కోట్ల విలువైన స్థలాలను.. అన్యాక్రాంతం చేయడానికి పావులు కదుపుతున్నారు. మొత్తానికి మన వేలితోనే మన కన్ను పొడిచే నయవంచక విధానాలలో పాలకులు ఆరితేరుతున్నారు. అంతేకాదు, విద్యారంగ విలువల్ని పునరుద్ధరణ వాదం పేరిట మధ్యయుగాల చీకటి కాలానికీ, ఉపాధ్యాయుల స్థితిగతుల్ని 75 ఏళ్ల వెనక్కి తీసుకెళ్లడానికి మన బూర్జువా పాలకవర్గాలు తెగ ఉబలాట పడిపోతున్నాయి.

మరోపక్క చదువుకొని వచ్చిన వారికి ఉపాధి చూపించలేక పోతున్నారు. ఎప్పుడూ లేనంతగా భారతదేశంలో నిరుద్యోగం చెలియలికట్ట దాటింది. పైగా మా దేశంలో యువతరం అధిక సంఖ్యలో ఉందనీ, ఇది యువ భారతదేశం అని గప్పాలు కొట్టుకుంటున్నారు. ఈ మేడిపండు చదువులు, ఈ గిరీశం చదువులు ఎటువంటి నైపుణ్యాలు ఇవ్వక, మరుగుజ్జు వెంకటేశాలను తయారు చేస్తున్నాయి.

ప్రపంచ స్థాయిలో ఉన్నత స్థాయి ప్రమాణాలు గల తొలి 500 విశ్వవిద్యాలయాల్లో భారతదేశానికి చెందినవి కేవలం ఎనిమిది మాత్రమే. గత ఎనిమిదేళ్లుగా మన బడ్జెట్లో ఉన్నత విద్యకు నిధుల కేటాయింపు 1.5% కంటే ఏమాత్రం పెరగలేదు

ఇటీవల "అగ్నిపథ్" అనే కేంద్ర ప్రభుత్వ పథకం సైన్యంలో ప్రవేశపెట్టడం వల్ల ఉద్యోగులకు ప్రయోజనం లేకపోగా దేశానికి సరైన రక్షణ వ్యవస్థ ఉండదు. బాధ్యత పడే యువతరాన్ని దేశానికి కళ్ళు, కాళ్ళుగా పదును పెట్టాల్సింది పోయి, ఈ ఉప్పొంగే యువతరాన్ని పెడదారులంట దారి మళ్లించి, నాశనం చేసే దిశగా ఉద్యోగ ఉపాధి విధానాలను అటు కేంద్ర ప్రభుత్వం ఇటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నాయి. కెరీరిజం తప్ప మరో స్పృహ లేని వ్యక్తివాదపు విద్యార్థి యువతరాన్ని మన పాలకవర్గాలు పనిగట్టుకుని తయారు చేస్తున్నాయి. అంతేకాకుండా, సైన్యంలోకి 'అగ్నివీరులు' వెళ్లినవాళ్లను ఆ కనీస కాలపరిమితి దాటిన తర్వాత వాళ్లవాళ్ల రాజకీయ పార్టీల సింహద్వారాల దగ్గర సెంట్రీలుగా నియమించుకుంటారట. ఇలాంటి ఉదారవాద విధానాలు దేశ సమగ్రతకు గొడ్డలి పెట్టు. మరోపక్క ఉపాధి అవకాశాల కోసం చదువుకున్న, అరకొర చదువుకున్న, అసలు చదువుకోని యువత గ్రామాల నుంచి వలస వెళ్ళి పట్టణాలలో కిక్కిరిసిపోతున్నారు. గ్రామాల్లో వ్యవసాయం పాడెక్కింది. గ్రామాల్లో, అటు సాగుబడి, ఇటు చదువుల బడి చతికిలపడ్డాయి. మూడు పాతికేళ్ల అధికార మార్పిడి ప్రజాజీవన సంస్కృతికి కర్కోటక గరళాన్ని మిగిల్చింది. మరోపక్క జాతీయ సంపదను ధనిక వర్గానికి అమృతోపమానంగా ధారపోస్తోంది. దేశమంతా గొప్ప సంపద అలరారుతోంది. అయితే వీసమంతకూడా కష్టజీవులకు అందకుండా చేస్తున్నారు. అది చాలక రకరకాల కనివిని ఎరుగని పన్నుల ద్వారా సామాన్య ప్రజల గోళ్లు ఊడగొడుతున్నారు.

శ్రామిక ప్రజల కష్టంతో పోగుపడిన దేశ సంపదను, ఈ పది శాతం ధనికస్వామ్యంకు ధారపోస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఆర్థికశాఖ నివేదిక ప్రకారమే, భారతదేశం స్వదేశీ విదేశీ అప్పు మొత్తం 2022 జూన్ 30 నాటికి 1 లక్షా 50 వేల కోట్లకు చేరింది. ఈ రుణం ప్రతి త్రైమాసికానికి సగటున 15.42% చొప్పున పెరుగుతున్నట్లు ఈ నివేదికే చెబుతోంది. మరి ఇటువంటి ప్రభుత్వాలు నడిపే విద్య ప్రజల ప్రయోజనాలకు ఉపయోగపడుతుందా? ధనిక స్వామ్యానికి, గుత్త పెట్టుబడిదారులకు, సామ్రాజ్యవాద బహుళ జాతి శక్తులకు ఉపయోగపడుతుందా?

ఈ పాతిక ముప్పై ఏళ్ల ప్రపంచీకరణ ప్రజాఉద్యమాలకు, విద్యార్థి యువతరానికి మధ్య పెద్ద ఉక్కు గోడే కట్టగలిగింది. ఇప్పుడిప్పుడే ఆ ఉక్కు గోడ ప్రజల ఉక్కు సంకల్పం ముందు కూలిపోయే రోజులు దగ్గరపడ్డాయి. అందుకు విద్యార్థి యువతరం సామాజిక వికాసం ద్వారా వ్యక్తి వికాసం అనే ప్రజాతంత్ర విలువను అందుకునే రోజులు దగ్గరపడ్డాయి. అందుకు తరగతి గదిలో ఉపాధ్యాయులు ప్రజా సాంస్కృతిక సైనికులుగా కాకలు తీరాలి. యథాస్థితిని కొనసాగించే విద్యా విధానాన్ని బద్దలు కొట్టే విద్యార్థి యువతరాన్ని తయారు చేయాలి. అందుకు యాంత్రిక బోధనాపద్ధతులను అటకెక్కించాలి. జ్ఞాపకశక్తికి కొలమానంగా మారుతున్న పరీక్షలను మలుపు తిప్పాలి. ప్రత్యక్ష అనుభవాలతో పాఠ్యాంశాలలో ఉన్న పరోక్ష అనుభవాలను సమన్వయం చేయాలి. జ్ఞానం అనేది శ్రమజనితం అనే అవగాహనతో ముందు ఉపాధ్యాయుడు పదునెక్కాలి. పిల్లల తల్లితండ్రుల శ్రమ విధానం పట్ల గౌరవాన్ని పెంచుకోవాలి. వంటరి లంకలా కాకుండా ఉపాధ్యాయుడు ప్రజా సముద్రంతో సంలీనం కావాలి. ప్రజాసమస్యలతో భుజం భుజం కలిపి అడుగు ముందుకు వేయాలి. మనకు కావాల్సింది ఉత్తమ ఉపాధ్యాయులు కాదు. ఈ సమాజాన్ని మార్చే సామాజిక పోరాట చైతన్యం గల సాంస్కృతిక ఉపాధ్యాయులు కావాలి. ఏనాడో కొఠారి కమిషన్ చెప్పినట్లు, ఈ సంక్షోభకర విషమ పరిస్థితుల్లో, ఈ సాంస్కృతిక విద్యా విధ్వంసాన్ని ప్రతిఘటించే విధంగా ఇవాళ తరగతి గదిలో తాత్విక ఆలోచనలు కలిగిన ఉపాధ్యాయుడు కావాలి. భవిష్యత్తును పునర్నిర్మించే సృజనాత్మక శాస్త్రవేత్త కావాలి ఉపాధ్యాయుడు. ప్రపంచ బ్యాంకు అవసరాలకు తడిపి మోపిడిగా పాఠశాలల్లో తైతక్కలాడుతున్న యాపులను నిర్వహించే సాంకేతిక నిపుణులు కాదు కావాల్సింది. అసలైన అర్థంలో, పిల్లల భవిష్యత్తును గుణాత్మకంగా నడిపించే సాంకేతిక నిపుణులు కావాలి. అందుకు ఉపాధ్యాయుడు సృజన శీలి కావాలి. పిల్లల మధ్య, బడి ఉన్న ఊరి మధ్య ఉన్న వైషమ్యాలను రూపుమాపే స్నేహ వారధి కావాలి మన ఉపాధ్యాయుడు. ఇటువంటి బహుముఖీన పాత్రను ఈరోజు ఉపాధ్యాయుడు నిర్వహించకుండా ధనిక స్వామికి ఊడిగం చేసే పాలకవర్గాలు వేధిస్తున్నారు. నిర్బంధాలు విధిస్తున్నారు.

మన చదువుల్ని ఎరుకమాలు చదువులు అని 17వ శతాబ్దంలో మన వేమన తీర్మానించిన సత్యం ఇప్పటికీ చెల్లుబాటు అవుతోంది. అసలు నేర్చుకోవడం జీవితం నుంచి వేరు పడి పోయిన తర్వాత నుండే, చదువు ప్రారంభమై ఉంటుందని ఒక మహనీయుడు అంటాడు. ప్రాచీన గురుకులాల నుండి వదిలించుకోవలసిన వల్లెవేత బట్టీయం చదువుల్ని మిగుల్చుకుని, రుక్కుపెట్టి, ముక్కున పట్టి, హీన, డాంబికాల, మోసకారి పరీక్షల్లో జిర్రున చీదేసి, బుర్ర డబ్బాలో దట్టించినదంతా బరువు దించుకోవడమే చదువుల అంతిమలక్ష్యంగా ఈ రోజు మిగిలింది.

ఆ తరువాత ఇటీవల కొన్ని సంవత్సరాలుగా ఈ నీచ భౌతిక పరీక్షల్ని కూడా సామూహిక అవినీతికి గురిచేసి, అనివార్యంగా పిల్లల తల్లితండ్రులు చేత కూడా తమ పిల్లలకు మార్కులు ఎలా వచ్చాయి అన్నది ప్రశ్న కాకుండా, ఎన్ని వచ్చాయి అన్నదే ప్రధానంగా చూచే ఒక దిగజారుడు విద్యాసంస్కృతి చలామణి అవుతోంది. నిరంతర సమగ్ర హింసా మూల్యాంకనం పేరు మీద అటు ఉపాధ్యాయులు, ఇటు పిల్లలూ వాళ్ల మధ్య ఉన్న విలువైన సాంస్కృతిక అనుబంధం కూకటివేళ్లతో సహా చీదపట్టి, చదువుల చెట్టు నిలువునా ఎండిపోతోంది.

ఏడాది పొడుగునా పరీక్షలు, అల్లి బిల్లి మార్కులు, మిథ్యాహ్న భోజనమే కాదు, పాఠశాల నిర్వహణే ఒక నిరంతర సమగ్ర మానసిక, శారీరక, భౌతిక హింసే ప్రహసనంగా ఈరోజు మారిపోయింది. తమ మార్కులతో పిల్లలకు ఎటువంటి సంబంధమూ లేదు. అదంతా ఉపాధ్యాయుల ఉద్యోగాలను కాపాడుకోవడానికి పడే పాట్లుగా, వేసే పిల్లిమొగ్గలుగా, రాసే నీతిలేని రాతలుగా దాపురించాయి.

ఆఖరికి మూల్యాంకన పత్రాలు అవి సంగ్రహణాత్మకం కావచ్చు, నిర్మాణాత్మకం కావచ్చు, నిర్మూలనాత్మకమూ కావచ్చు. ఏది ఏమైనా ఆ ప్రశ్నపత్రాలన్నీ పోలీస్ స్టేషన్లలో భద్రంగా నర, వానర, యక్ష, కిన్నెర, కింపురుషాదులెవరూ కన్నెత్తి చూడలేని పకడ్బంది రక్షణ కవచాల మధ్య బహుపదిలంగా దాస్తారు. పసిపిల్లల పరీక్షహాలులో సీసీ కెమెరాలు భయంకరంగా పై నుంచి కింద వరకు కట్టుదిట్టంగా నిఘా వేసి చూస్తూ ఉంటాయి. వాటికి తోడు పోలీసుల్లాంటి పర్యవేక్షకులు. అంతా యుద్ధ వాతావరణం, పదో తరగతి విద్యార్థి శత్రు సైనిక శిబిరంలో చిక్కిన యుద్ధ ఖైదీలా విజయవంతంగా తిరిగి రావాలి. కానీ ఆ ప్రశ్నాపత్రాలు కార్పొరేట్ విద్యాలయాలకు ముందే అంది జవాబులు పరీక్ష హాల్లోకి ప్రవేశిస్తాయి.

ఈ వ్యవస్థకు చవకబారు కూలీలు, వాహనాలు నడిపే డ్రైవర్లు, బుల్‌డోజర్లు, పొక్లైన్లు మొదలైన సాంకేతిక యంత్రాలను నడిపే కార్మికులు ఈ సర్కారీ బడులు నుంచే రావాలి. వాళ్లు ఉన్నత చదువులు చదివి, సమాజాన్ని తీర్చిదిద్దడానికి కావాల్సిన మేథావులు కానక్కర్లేదు. ఉన్నతవర్గాల పిల్లలు అందుకు కేటాయించబడతారు. లేకపోతే ఈ ధనస్వామ్య పల్లకిని మోసే బోయీలెవ్వరు??

విద్యారంగం ఉద్దేశపూర్వకంగా గాలికి వదిలేసిన కీలక ప్రశ్న ఒక్కటే – ఎందుకు చదవాలి. పిల్లలు... ముఖ్యంగా... ఆడపిల్లలు. చదువుకోవాలనే గాఢమైన ఆకాంక్షతో చుట్టుపక్కల ఉన్న గ్రామాల నుండి అనేక కష్టనష్టాలకు ఓర్చి పాఠశాలలో చదువుకుంటున్నారు. బాగా చదువుకుంటే మంచి ఉద్యోగం వస్తుందని, బాగా సంపాదించ వచ్చని, బతుకు బాగు పడుతుందని, ఎవరికి వారు బాగుపడిపోతే, సమాజం అంతా బాగుపడిపోతుందనే వైయక్తిక పరిష్కారం అందరూ చెప్తూ ఉంటారు.

ఒక కవి అంటాడు. నీ చుట్టూ వున్న సమాజం అనేక అన్యాయాలతో, అనేక అక్రమాలతో, అనేక రకాలైన మురికి భావాలతో, చెప్పుకోవడానికి వీలులేని చిత్రహింసల కొలిమిలా రోజురోజుకి ప్రమాదకరంగా తయారవుతుంటే, ఆరోగ్యకరమైన సామాజిక పరిస్థితులు రకరకాలుగా రోగగ్రస్తమైన దాడి చేస్తూ ఉంటే, వీటన్నిటి మధ్య బాగా చదువుకుని, మౌనంగా ఎదిగిపోయి, అందమైన ఒంటి స్తంభం మేడ కట్టుకుని, తలుపులు బిగించుకుని ఎంత భద్ర జీవితాన్ని నువ్వు కోరుకుంటే మాత్రం ఏం ప్రయోజనం?

ఆడపిల్లని ఒక తినే పదార్థం కన్నా, ఎక్కువగా ఏమాత్రం ఈనాటి వ్యవస్థ భావించడం లేదు అంటే ఆ లోపం, ఆ పాపం దళారీ బూర్జువా విద్య మురికివాడలదే.

ఆడపిల్లలు ఆత్మరక్షణ కోసం బడిలో టైక్వాండో పోరాట విద్య నేర్చుకోవడానికి అవకాశం కల్పించారు. తప్పు లేదు. "ముదితల్ నేర్వగరాని విద్యగలదే ముద్దార నేర్పించినన్" అని మన తెలుగుకవి ఏనాడో చెప్పాడు. కానీ ఎందుకు నేర్చుకోవాలి? ఈ మృగ సమాజం నీ మీద దాడి చేయడానికే ఉంది. ఇది మారదు. మార్చడానికి ప్రయత్నం చేయకండి. వాడు దాడి చేయడం వాడి హక్కు. ఆడపిల్లగా పుట్టడం మీ తప్పు. కాపాడుకోవాలంటే, కరాటే నేర్చుకోండి. అది మీ బాధ్యత. అంతేగాని ఈ సామాజిక సాంస్కృతిక ఉన్నత విలువల కోసం మీరేమైనా ఆలోచిస్తే మీరు దేశద్రోహులు అవుతారు. చట్టం తన పని తాను చేసుకుపోతుంది అంటూనే, దానిలోని లొసుగులు ఉపయోగించుకునే సంస్కృతి కొనసాగుతోంది. చట్టం, న్యాయం చేయాల్సిన పని మానవ సంస్కృతి చేయాలని మీరు మాట్లాడితే అది చట్ట వ్యతిరేకం. న్యాయస్థానాలు, పోలీస్ స్టేషన్లు వీటి సంఖ్యను పెంచుకుంటూ పోవడమే నేటి పాలకుల దృష్టిలో అభివృద్ధి. నేటి వ్యవస్థ తన ఉనికిని కాపాడుకోవాలంటే, నేరాలు జరుగుతూ ఉండాలి. వాటిని అదుపుచేయడంలో ఆ వ్యవస్థ పనిచేస్తూ ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతున్నట్లుగా వారు చిత్రిస్తున్నారు.

నిజాలు చేదుగానే ఉంటాయి. తినగ తినగ వేము తియ్యనుండు. నిజానికి నేర్చుకోవాల్సింది ఏంటంటే, మంచికి చెడు జరగకూడదు. చెడుకు మంచి జరగకూడదు. పుస్తకాలు చదవడం పరోక్ష అనుభవం. అది జ్ఞానం. జీవితాన్ని చదవడం ప్రత్యక్ష అనుభవం. ఈ ప్రత్యక్ష అనుభవమే, పుస్తక జ్ఞానాన్ని చైతన్యంగా మారుస్తుంది. అందుకోసం చదువుకున్న జ్ఞానాన్ని జీవితంతో సమన్వయం చేసుకోవాలి. ఎందుకు చదవాలో స్పష్టంగా అవగాహన చేసుకోవాలి. జీవితాన్ని ప్రేమించాలి. బానిసత్వాన్ని ద్వేషించాలి. ఒకళ్ళకి లొంగి ఉండాలనే బానిస భావాలకు ఎవరు బలం ఇచ్చినా, వాళ్లని నమ్మకూడదు. ద్వేషించాల్సిన దాన్ని ద్వేషించాల్సిన అంతగా ద్వేషించకపోతే, ప్రేమించాల్సిన దాన్ని ప్రేమించాల్సిన అంతగా ప్రేమించలేం. చదువు జీవితంలో ఒక భాగం. చదువే జీవితం కాదు. జీవితాన్ని విచక్షణతో మెరుగుపరుచుకోవడానికి ఉపయోగపడే చదువును వెతికి పట్టుకోవాలి. ముక్కల ముక్కల చదువు మనకొద్దు. రావిశాస్త్రి పిపీలికం లాగా మనల్ని మనం తెలుసుకోవాలి. తెలుసుకొని, సమాజాన్ని అర్థం చేసుకునే ఆచరణాత్మక క్రియాశీల విద్య ఒక్కటే సరైనది. అర్థం కాకుండా దేన్నీ ప్రేమించలేం. దేన్నీ ద్వేషించలేం. అటువంటి వివేకాన్ని ఇవ్వని చదువు మనకెందుకు?

"వివేకమివలేని – విజ్ఞానమెందుకని?
వికాసమివలేని – వినోదమెందుకని?
అడుగుతోంది భవిత!
జవాబు దొరకని జడత!!
సమాజ చోదక యువత!!
భ్రమలో పడితే కలత!!
భగభగ మండే జనత!
అది – తిరగరాస్తుంది చరిత.

# సంతాపాలు

## పేదల పక్షాన పోరాడిన రచయిత్రి బార్బరా ఎహ్రెన్ రీక్ మరణం



**అమెరికన్** రచయిత్రి, సోషలిస్ట్ ఫెమినిస్టు బార్బరా ఎహ్రెన్ రీక్ అమెరికాలోని మోంటానాలో 1941 అగస్టు 26న జన్మించారు. ఆమె 2022 సెప్టెంబర్ 1న తన 81వ యేట అమెరికాలోని వర్జీనియాలో మరణించారు.

ఫిజిక్స్, కెమిస్ట్రీలతో విద్యాభ్యాసం చేసి, వాటిలో డాక్టరేట్ సంపాదించిన బార్బరా వివిధ సామాజిక సంస్థలలో నాయకత్వ పాత్ర వహించి, రాజకీయ కార్యకర్తగా, రచయిత్రిగా కృషిచేశారు. సమాజంలో కొనసాగుతున్న అన్యాయాలనీ, కపటత్వాన్ని బట్టబయలు చేస్తూ 21 పుస్తకాలు రాశారు. అట్టడుగువర్గాల ప్రజలు సంపాదిస్తున్న కూలీడబ్బులు వారి కూటికి, గుడ్డకీ, గూడుకీ సరిపోతున్నాయో లేదో ప్రత్యక్షంగా తెలుసుకోడానికి ఆమె కొన్నాళ్ళు షాపుల్లో సరుకులు అమ్మే అమ్మాయి (Sales Girl)గానూ, ఇల్లు వూడ్చే పనిమనిషిగానూ, ఇంటిపనులు చేసే సేవకురాలుగానూ, హోటల్లో వైట్రస్‌గానూ పనిచేసి, అప్పుడు సంపాదించిన ప్రత్యక్ష అనుభవాల ద్వారా ఆ పనులు చేస్తున్నవారికి పనికి తగ్గ ఫలితం రావడంలేదన్న వాస్తవాల్ని పుస్తకరూపంలో ప్రచురించారు. ఒక మనిషి రోజులో రెండు రకాల ఉద్యోగాలు చేస్తేనే కనీస ఆదాయం లభిస్తుందని సూత్రీకరణ చేశారు. అలా రెండుచోట్ల పనిచేసి అలసిపోయ అనారోగ్యానికి గురౌతున్నారని కూడా తెలియచేశారు. ఇలా పనులు చేసి బతుకుతున్న వారిని అగౌరవంగా చూసే పెట్టుబడిదారీ క్రూరత్వాన్ని బట్టబయలు చేశారు. వియత్నాంపై అమెరికా యుద్ధాన్ని నిరసించిన విద్యార్థుల ఉద్యమాన్ని సమర్థిస్తూ రాశారు. ఆమె తన కుటుంబంలో నాలుగోతరం నాస్తికురాలు.

## సాహితీప్రియుడు నిజాం వెంకటేశం ఆకస్మిక మరణం



**కవి,** అనువాదకుడు, ప్రచురణకర్త నిజాం వెంకటేశం తన 74వ యేట హైదరాబాదులో గుండెపోటుతో 18-9-2022న మరణించారు. ఆయన సిరిసిల్లలో 14-11-1948న ఒక మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. వారి కుటుంబానికి సిరిసిల్లలో ఒక జనరల్, కిరాణా షాపు వుండేది.


వెంకటేశం పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ కోర్సు చేసి, చెన్నైలో ఎఎమ్ఐఇ చదివారు. 1968లో తాత్కాలిక ఉద్యోగిగా 29 ఏళ్ళు పనిచేసి 1997లో స్వచ్ఛందంగా పదవీ విరమణ పొంది హైదరాబాదులో స్థిరపడ్డారు. రిటైరైన తర్వాత తమిళనాడు, ఉత్తర ప్రదేశ్‌లలో ఎలక్ట్రికల్ కంపెనీలలో గణనీయమైన సేవలందించారు.

ఆయన వర్ధమాన రచయితలను ప్రోత్సహించి వారి గ్రంథాలను కరీంనగర్ బుక్‌ట్రస్టు పేరుతో ప్రచురించేవారు. అల్లం రాజయ్య, అలిశెట్టి ప్రభాకర్, బి.ఎస్.రాములు పుస్తకాలను ప్రచురించారు. 80వ దశకంలో 'దిక్సూచి' అనే కవితాపత్రిక ద్వారా యువ రచయితలకు దోహదం చేశారు. గూడూరి సీతారాం కథలను వెలువరించడానికి సహాయపడ్డారు. లాయర్ ఎస్. విద్యాసాగరరెడ్డి ఇంగ్లీషులో రాసిన ఆర్థికశాస్త్ర గ్రంథాలను మూడింటిని తెలుగులోకి అనువదించారు. సుభాష్ పాలేకర్ వ్యవసాయంపై రాసిన పుస్తకాన్ని అనువదించారు. అల్లం రాజయ్య కథలను ఇంగ్లీషులోకి తర్జుమా చేశారు. జూకంటి జగన్నాథం, నలిమెల భాస్కర్‌ల సాహిత్య సంపుటాలను ప్రచురించారు.

తాను పుస్తక ప్రియుడవటమేగాక, తన వద్ద వున్న పుస్తకాలను ఇతరులకు ఇచ్చి చదివించేవారు. తార్నాకలో 3.50 లక్షలు ఖర్చుపెట్టి ఉచిత గ్రంథాలయాన్ని నడిపారు.

వారి అకాల మరణానికి 'ప్రజాసాహితి' సంతాపాన్ని తెలియచేస్తోంది.

## ప్రజాగాయకుడు పారెళ్ళ రత్తయ్య మృతికి సంతాపం



ప్రజానాట్యమండలి సీనియర్ కళాకారుడు, గాయకుడు, పారెళ్ళ రత్తయ్య తన 75వ యేట మంగళగిరిలో 6-9-2022న మరణించారు.

అతి పేద కుటుంబానికి చెందిన రత్తయ్య సిపిఐ కార్యకర్తగా వుంటూ ప్రజానాట్యమండలిలో గాయకునిగా ప్రసిద్ధి చెందారు. ఒక కాలు అవిటిగా వున్న దివ్యాంగుడు రత్తయ్య. కళ్ళూ, కాళ్ళూ పనిచేయకపోయినా చివరివరకూ ఆయన కొన్ని వందల నాటకాలకు నేపథ్య గాయకునిగా తన గళం విన్పించారు. 'భూమి భాగోతం', 'రాజకీయ భాగోతం'కు నేపథ్య గాయకునిగా ఆ రూపకాలను రక్తి కట్టించారు. పాటలకు తానే బాణీలు కట్టుకునేవారు. చివరి సంవత్సరాలలో 'అశోకుని'పై రాసిన గీతానికి బాణీ కట్టి, గానం చేసి దానికి జీవం పోశారు.

ప్రజాసాహిత్య సాంస్కృతికోద్యమానికి అండదండలందించిన ఉత్తమ కార్యకర్త రత్తయ్య మరణానికి 'ప్రజాసాహితి' సంతాపం ప్రకటిస్తోంది.

వ్యాసం

# ఆత్మగౌరవ పతాక

- ఎస్. జతిన్ కుమార్

**ఆంధ్ర** కమ్యునిస్ట్‌పార్టీతో సంబంధం వున్న పాతతరం వ్యక్తులకు, లేక ఆ పార్టీ చరిత్ర తెలిసినవాళ్లకు ముఖ్యంగా, కృష్ణా, గుంటూరు ప్రాంతం వారికి బాగా గుర్తుండిపోయే ఇద్దరు మహిళామూర్తులు వున్నారు. పేరొందిన తమ నాయకుల జీవన సహచరులుగా కొంతకాలం గడిపిన తరువాత విడిపోవడంవల్ల, తాము పిల్లలతో మిగిలిపోయి కూడా, జీవనపోరాటం కొనసాగించి, అత్యంత గౌరవ ప్రతిష్ఠలు సంపాదించుకుని జీవితాన్ని గెలిచినవారు, తరువాతి తరాలవారికి ఒక పాఠంలా, ఒక ఆదర్శప్రాయమైన ఉదాహరణలా వెలుగులిచ్చినవారు ఆ మహిళలు. ఒకరు కొండపల్లి కోటేశ్వరమ్మగారు, మరొకరు నంబూరి పరిపూర్ణగారు. ఆ మగవాళ్లు (కృష్ణాజిల్లా కమ్యూనిస్ట్ పార్టీ సెక్రటరీలుగాను ఆ తరువాత రాష్ట్ర పార్టీ సెక్రటరీలుగానూ, కేంద్ర నాయకులుగాను ఎదిగినవారు) ఒకరు కొండపల్లి సీతారామయ్య, మరొకరు దాసరి నాగభూషణరావు.

ఈ రెండు ఉదంతాలు స్త్రీ పురుష సంబంధాలను, వైవాహిక జీవితాలను, అభ్యుదయవాదులుగా వున్న మగవారు భార్యల పట్ల ఏ రకమైన వైఖరితో ప్రవర్తిస్తున్నారు అన్న విషయాన్ని జనబాహుళ్యంలో చర్చకు దారితీసిన సందర్భాలు. ఈ మహిళలిద్దరూ పార్టీలో అంకిత భావంతో పనిచేస్తూ ప్రజానాట్యమండలి కళాకారులుగా పేరు పొందినవారు. కోటేశ్వరమ్మ–సీతారామయ్యల విషయంలో అప్పటి పార్టీ ఆయనను క్రమశిక్షణా చర్యగా పార్టీ నుండి తొలగించింది. కాని తరువాత ఆయనే ఒక పంథాకు 'పీపుల్స్‌వార్' అధినాయకుడై, గొప్ప విప్లవకారునిగా పేరు సంపాదించాడు. ఇద్దరు పిల్లలు తండ్రి దరిచేరినా, ఆమె 'నిర్జన వారధి'గా మిగిలిపోయినా, రాజీపడని ధీరగా జీవితం గడిపి ఎందరో స్త్రీలకు స్ఫూర్తిగా నిలిచింది. ఆయన జీవితం నుండి తప్పుకున్నా, పిల్లల కోరిక మేరకు ఆమె చివరివరకూ 'కొండపల్లి' కోటేశ్వరమ్మగానే వుండిపోయింది. పిల్లల తల్లిగా ఇంటి పేరును స్వంతం చేసుకుంది. మరి, పరిపూర్ణ– దాసరి నాగభూషణరావుల విషయంలో, పార్టీ అనుమతితోనూ, పార్టీ పెద్దల సమక్షంలోనే వీరి పెండ్లి జరిగినా, ముగ్గురు పిల్లలు కలిగాక, ఆయన బాధ్యతారాహిత్యం, పైకి కనపడని వివక్ష, పితృస్వామిక భావజాల ప్రభావం కారణంగా పన్నెండు సంవత్సరాల కుటుంబజీవితం విచ్ఛిన్నమైపోతున్న సమయంలోగాని, ఏకపక్ష ప్రకటనగా ఆయన కాపురం నుండి శాశ్వతంగా 'వాకౌట్' చేసినప్పుడుగాని, గతంలో రద్దు చేసుకున్నానని నమ్మబలికి మరో వివాహ బంధాన్ని ఆర్థిక ప్రయోజనాలతోసహా పునరుద్ధరించుకున్నప్పుడుగాని, పార్టీ నుండి ఈమెకు కావలసిన నైతిక మద్దతు కూడా లభించలేదు. ఆయన కనపడితే పిల్లలు వణికిపోయి, భయంతో బిగుసుకుపోయే దుస్థితిలోకి జారిపోయారు. మరి ఆయన నాయకత్వం మాత్రం సిపిఐలో అంచెలంచెలుగా పెరుగుతూ పోయింది. ముగ్గురు పిల్లల బాధ్యత పూర్తిగా తానే వహిస్తూ ఆమె ప్రభుత్వ ఉద్యోగంతో నెట్టుకొస్తూ, తన తల్లి సాయంతో పిల్లల ఆలనాపాలనా చేస్తూ సామాజికవివక్షను ఎదుర్కుంది. తన విషయంలో కులవివక్ష మరో అదనపు భారమయ్యింది. అయినా జీవితాన్ని 'వెలుగుదారులలో' నడిపించుతూ, తాను నంబూరి పరిపూర్ణగా వుంటూ తన వ్యక్తిత్వాన్ని మిగుల్చుకుంటూ, పిల్లలకు 'దాసరి' ఇంటి పేరును వారసత్వ హక్కుగా నిలబెట్టింది. 'ఉంటాయి మాకు ఉషస్సులు' అనే ఆత్మ స్థైర్యాన్ని నింపుతూ, ముగ్గురు పిల్లలను చక్కని వ్యక్తిత్వం, సౌశీల్యం గల విద్యాధికులుగా గర్వించదగ్గ స్థానాలకు చేర్చిన ఆత్మగౌరవ పతాక ఆమె జీవితం. స్వంత పిల్లలకే కాదు ఆ తరం వారందరికీ, ఒంటరి పోరాటం చేస్తూ జీవన సమరం గెలుచుకున్న ఆదర్శనీయ స్ఫూర్తిగా నిలిచింది. ఆ పిల్లలకు తండ్రి మాత్రం ఎన్నడో చూసిన ఒక ఎర్రటి పొడుగు మనిషిగా మిగిలిపోయాడు.

ఉద్యమాల ఉద్వేగాలు, ఉత్సాహాలు జీవితం పొడవునా ఆమెను ఉత్తేజభరితం చేస్తూనే వున్నాయి. అప్పటి కమ్యూనిస్టు పార్టీ కలిగించిన చైతన్యం, ఆలోచనలు ఆ వ్యక్తిత్వంలో మిళితమైపోయాయి. నాటి కమ్యూనిస్టు నాయకులు అందించిన ప్రోత్సాహం, ముఖ్యంగా తన సోదరులు కురిపించిన ఆదరణ అభిమానాలు, ఇద్దరు సోదరులు ఉద్యమశీలురయి జైలు పాలయినా, సామాజిక సేవా కార్యక్రమాలకు వెనుకాడని తన కుటుంబ నేపథ్యం, జీవితానికి పునాదులై నిలిచిన, చదువు సంధ్యల సాధనకు ప్రోది చేసిన వ్యక్తుల గురించి ఇప్పటికీ గుర్తుంచుకుని అపురూపంగా చెప్పుకుంటుంటే వినటం ఒక అద్భుత సంస్కారమూర్తి సాక్షాత్కరించిన అనుభవం కలిగిస్తుంది. అన్నయ్య నంబూరి శ్రీనివాసరావు, తండ్రిలాంటి దర్శి చెంచయ్యగారి బోధనలో, శిక్షణలో తాను పొందిన రాజకీయ చైతన్యం, గతితార్కిక ఆలోచనా విధానం; మహీధర సోదరుల కుటుంబాల సాంగత్యంలో ఏర్పడిన కుల–వర్ణ–మతవ్యవస్థల ఆధిపత్యాన్ని, వాటి తిరోగామి భావాలని నిరసించాలన్న స్పృహ, పూనిక; లబ్ధప్రతిష్ఠులైన అనేకమంది విద్వాంసులతో, విజ్ఞులతో కలిగిన పరిచయాల వల్ల తనలో పరిమళించిన సంస్కృతి, సంస్కారం, రసజ్ఞత; రాజమండ్రి గవర్నమెంట్ బాలికల పాఠశాల, కాకినాడ పి.ఆర్. కాలేజి రోజులలో స్టూడెంట్ ఫెడరేషన్‌లో చురుకైన క్రియాశీలత, మహిళాసంఘాల నిర్మాణంలోనూ,

కార్యకలాపాలలో పాల్గొనటం ద్వారా పెంచుకున్న అవగాహన, నాయకత్వ లక్షణాలు ఆమె జీవితాన్ని తేజోవంతం చేశాయి. ఆ తేజస్సులోని కాంతులే ఆమె రచనలు కనుక మనం చాలా శ్రద్ధగా చదివి తెలుసుకోవాల్సిన అంశాలు అందులో ఎన్నో వుంటాయి.

కుటుంబం, సమాజం, రాజకీయం, ఉద్యోగం అనే రంగాలలో గడించిన అనేక గడ్డు అనుభవాలు, చేసిన ఆత్మగౌరవ పోరాటాలు, స్వావలంబనకు, మహిళా సాధికార జీవితానికి సాగించిన సమరాలు, సాధించిన విజయాలు, నడచిన ముళ్లబాటలు, చేరుకున్న గమ్యాలు ఆమెనో అనుభవాల గనిని చేశాయి. ప్రగతిశీల భావజలధిని చేశాయి. ఆ సాగరంలో తలలెత్తిన తరంగాలు ఆమె రచనలు. కథలు, వ్యాసాలు, రేడియో ప్రసంగాలు... రూపం ఏదైనా నిక్కచ్చిగా, సూటిగా, తేటగా తీర్చిన గీతాలు అవి. ఆమె ఆలోచనాధారలు అభ్యుదయ మార్గాలు. ఆచరణలో పండిన అభిప్రాయాలు, అనుసరించదగ్గ మార్గదర్శకాలు. ముఖ్యంగా స్త్రీల జీవితాలకు సంబంధించిన అనేక సమస్యలపట్ల గత ఛాందసానికి, అత్యాధునిక విశృంఖలతకీ సమాన దూరంలో, అతి సంయమనంతో మార్క్సిస్టు భావజాలంతో అన్వేషించిన సమాధానాలు ఆమె రచనలు. ఎన్నో జీవితానుభవాలతో మగ్గిన వయసులో దాదాపు ఉద్యోగం నుండి రిటైర్ అయ్యాక రచయితగా చేయి కదలించటంవల్ల, ఉద్వేగాల కన్న బోధనాంశం ఆమె రచనలలో ఎక్కువగా కానవస్తుంది. అయితే సమస్యలను ఆమె తీర్పరి దృష్టితోకాక తీర్చే దృష్టితో స్పృశించటంతో రచన ఒక ఆత్మీయురాలి సంవేదనగా, సలహాగా వుంటుంది. పాఠకునికి ఆమె ఆత్మీయురాలు కనుక ఆ కలం లాలిస్తుంది, బుజ్జగిస్తుంది, అలుగుతుంది, తిడుతుంది, కన్నెర్ర జేస్తుంది, మూతి ముడుస్తుంది. పాఠం చెబుతుంది. ఏది చేసినా నీ బాగునే కోరుతుంది అమ్మలాగా, అందుకే ఆమె రచనలు 'శిఖరారోహణ' చేశాయి.

తన రచనల ద్వారానే తప్ప అప్పటికి ముఖపరిచయం లేని దాసరి ఆమరేంద్ర, సాహితీ మిత్రురాలు దాసరి శిరీషగారి తల్లిగా 'ఆలంబన' కూకట్‌పల్లి వేదికలో తొలిసారి ఆమెను చూశాను. అక్కడి చర్చలలో స్పష్టంగా తన అభిప్రాయాలు ప్రకటిస్తున్న ఆ పెద్దావిడ రచయిత్రి నంబూరి పరిపూర్ణగారని తెలుసుకున్నాను. అప్పటికే 'వుంటాయి మాకు ఉషస్సులు' కథా సంకలనం-1998 చదివి వుండటంతో, ఆమెపట్ల గౌరవంతో పాటు అభిమానమూ కలిగింది. పరిచయమూ పెరిగింది. తరువాత అనేక సందర్భాలలో ముఖ్యంగా అమరేంద్ర, శిరీషగారి పుస్తకావిష్కరణల సభలలో పలకరించేవాడిని. తన 75 సంవత్సరాల జన్మదిన ఉత్సవంలో ఆమెకు అపురూపమైన కానుక ఇచ్చారు పిల్లలు. పరిపూర్ణగారివి, శిరీషవీ, అమరేంద్రవీ కథలు కలిపి చిన్నబ్బాయి శైలేంద్ర విశ్లేషణలతో, ఆమె సాహిత్యాభిరుచికి రూపంకట్టినట్లు ప్రచురించిన 'కథాపరిపూర్ణం' సంకలనం 2006లో ఆవిష్కరించారు. అదో మధురానుభూతిగా ఆమె చెపుతుంటారు. ఇదొక ప్రయోగమేకాక ఈ కథకుల కుటుంబ వాత్సల్యానికి ఉదాహరణగా నిలిచిపోయింది. ఇప్పుడు మనవరాలు అపర్ణ రచనలను కూడా కలిపి మూడుతరాల కథాసంకలనం తెస్తే అది ఆమెకు అనిర్వచనీయమైన ఆనందం కలిగిస్తుంది. 12 కథలు, 50 సంవత్సరాలుగా రాస్తున్న వ్యాసాల నుండి కొన్ని కలిపి ప్రచురించిన మరో సంకలనం 'శిఖరారోహణ' 2016లో వచ్చింది. ప్రచురణకర్తలు చెప్పినట్లు అది ఒక సాహిత్య సంఘటన కాదు 'పరిపూర్ణ జీవితపు ప్రతీక'. ఆ పుస్తకావిష్కరణసభలో తన జీవితాన్ని నెమరు వేసుకుంటూ ఆవిడ జ్ఞాపకాలను విప్పుతుంటే విని పరుగులెత్తిన రక్తం సవ్వడులు నాకింకా వినిపిస్తూనే వున్నాయి. చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో గోర్కీ' అమ్మ' నాటక ప్రదర్శనకు వచ్చి మిత్రులెందరినో కలవేస్తూ చెప్పిన మాటల జ్ఞాపకం ఇంకా తాజాగానే వున్నది. 2017లో వెలువరించిన స్వీయకథ 'వెలుగుదారులలో' ఒక ఇతిహాసపు వెలుగులతో తెలియని చరిత్రకోణాలను ఆవిష్కరిస్తుంది. తెలిసిన చరిత్రకు కొత్త దృష్టిని ఆపాదిస్తుంది. అది ఒక వ్యక్తి జీవితం మాత్రమే కాదు తెలుగుజాతి నడిచి వచ్చిన అభ్యుదయపరంపరలో ఒక భాగం. ఆమె స్వీయచరిత్ర చదవటంతో మన దృష్టి నిశితమూ, విశాలమూ అవుతుంది. జీవితాన్ని అర్థం చేసుకోవటంలో. అర్థవంతంగా జీవించటంలో అది కొత్త కాంతిని ప్రసరిస్తుంది.

ఆవిడ జీవితంలోని కష్టాలను, నష్టాలను, క్లేశాలను, ఆక్రోశాలను, ఖేదాలను, మోదాలను, అన్ని జీవిత ఘట్టాలను తూకం వేయటంగాని, ఆమె అభిప్రాయాలన్నీ ఉటంకించి వాటన్నిటినీ సమర్థించటంగాని నా ఉద్దేశ్యం కాదు. కానీ బాల్య, యవ్వనాలలో పొందిన శిక్షణ, తాను సంతరించుకున్న విద్య, సంస్కారం, తార్కిక ఆలోచనా గరిమ, ఆ జీవితాన్ని ఎలా నిలబెట్టాయో, ఆమెకు తారసపడిన వ్యక్తుల ఉద్దీప్తగుణాలను తాను ఆవాహన చేసుకుని తాను ఎలా ఎదిగిందో, సామాజిక జీవితంలో మిళితమైతే నిష్క్రియాత్మకంగా కనిపించే జీవితం ఎంత వికాసవంతంగా మారుతుందో అనే విషయాలను అవగతం చేసుకోవటానికి గొప్ప ఉదాహరణ పరిపూర్ణమ్మగారి జీవితం అని మాత్రం చెప్పగలను. తరాల అంతరాలు అధిగమిస్తూ, ఎదిగిన మనవలు, మనవరాళ్లతో కూడా ఆధునిక ఆలోచనాధోరణులతో చర్చించి, ఎదుగుతున్న కొత్త ఆలోచనలకు సంయమనం, సమతూకం నేర్పగల వైదుష్యం ఆమె జీవితం.

తన వ్యక్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని పట్టి ఇచ్చే రెండు సంఘటనలు మాత్రం గుర్తుచేసుకుందాం. 1943లో దర్శి చెంచయ్యగారి పిలుపు పై స్కూలు చదువులకోసం పరిపూర్ణగారు మద్రాసు వెళ్లారు. ఆయన రికమెండేషన్‌తో ఉచితంగా భోజనం, వసతి కల్పించి, చదివించే ఒక సేవాసదనంలో ఫ్రీ బోర్డరుగా చేర్చారు. ఈవిడ కుటుంబం మతానికి శ్రీవైష్ణవ ముద్రాంకితం, కులానికి మాల కావటంతో వీరిని మాల దాసరులు అని వ్యవహరించేవారు. వారు పౌరోహిత్యం నెరపినా కులరీత్యా వివక్షత వుండేది. ఆ సేవాసదనంలో రుసుము వసూలుచేసి సౌకర్యాలు కల్పించే ఏర్పాటు కూడ వుంది. అందుకని ఉచితంగా చదువుకునే 'దిగువ' తరగతివారు, తమ ఖర్చులు భరించే మొదటి తరగతి ఉన్నత కులాల వారి గదులు తుడిచి, వంటలు చేసి సేవలు చేసేవారు. విద్యార్థుల మధ్య చూపిస్తున్న ఈ వివక్ష, అవమానమూ ఏమాత్రం భరించలేనని ఈ చదువు కంటే, రోజూ 12 మైళ్లు నడిచి వెళ్లి ఊరు దగ్గర వున్న స్కూలులోనే చదువుకుంటానని, సేవాసదనానికి మాత్రం వెళ్లనని పరిపూర్ణ చెంచయ్యగారికి ఖండితంగా చెప్పేసింది. దాంతో ఆయన పాపను తమ ఇంటిలోనే వుంచుకుని శారదా

విద్యాలయంలో చదివించారు. కులం, పేదరికం వల్ల చూపించే వివక్షతను ఆమె ఎక్కడా, ఎప్పుడూ సహించలేదు. ఉద్యోగ జీవితంలో, సంసారంలో కనపడ్డ వివక్షతలను జీవితమంతా ఆమె ప్రతిఘటిస్తూ వచ్చింది. సోషల్ ఎడ్యుకేషన్ ఆర్గనైజర్‌గా ఆవిడ ఉద్యోగం సంపాదించుకున్నప్పుడు, 'నేను ఈ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తున్న కమ్యూనిస్టును, మరి నా భార్య ఇదే ప్రభుత్వ ఉద్యోగిని ఎలా కాగలుగుతుంది? నువ్వు ఉద్యోగంలో చేరడానికి వీలులేదు,' అని కామ్రేడ్. ఎన్.ఆర్. దాసరి భర్త స్థానం ఇచ్చే అధికారంతో అడ్డగించి ఆర్డర్స్‌ని చించివేస్తే – అప్పటివరకు కుటుంబం గురించి, పిల్లల బాగోగుల గురించి ఒక్కనాడు కూడా పట్టించుకోకుండా తన సంపాదనలోనే నెలనెలా ఎంతోకొంత తీసుకు వెళ్లిపోతున్న ఆయనను, ఆయన బాధ్యతారహితమైన, వింత పలాయనవాద ప్రవర్తనను నిరసిస్తూ, 'మీకిష్టం వున్నా, లేకపోయినా నేను ఉద్యోగంలో చేరక తప్పదు, చేరతాను. పిల్లల భవిష్యత్తు కోసం అదే మంచిది,' అని నిష్కర్షగా చెప్పి తాను ఉద్యోగంలో చేరిపోయింది. 'పార్టీ నిర్మాణాన్ని ముందుకు తీసుకుపోయే దీక్ష, నాయకునికి వుండవచ్చు కానీ కుటుంబం, కన్నబిడ్డల పోషణ, వాళ్ల భవిష్యత్తుతో తనకు సంబంధమే లేదనుకోవటం యే విధమైన నైతిక ధర్మం?' అని ఆమె నిలదీసింది. అప్పుడు ఆత్మవిశ్వాసంతో ఆమె వేసిన అడుగు ఆమెకు పిల్లలకు ఎంతో ఆలంబనగా మారింది. పెళ్లి, సంసారము, నిర్బంధ కాలంలో అజ్ఞాత జీవితము చదువును ఇంటర్‌తోనే ఆపివేయగా తదనంతర బ్రతుకు పోరాటంలో సెకండరీ గ్రేడ్ ట్రైనింగు, ఆ తరువాత నాన్ సైన్సు గ్రూపుతో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. సాధించిన డిగ్రీ, ప్రమోషన్లకు అర్హతనే కాక ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చిందని ఆమె అంటారు. బ్రతుకు ఈడ్వడం కాక, కొన్ని మానవీయ విలువలతో బతకడం, ఆ విలువలను తరువాతి తరాలకు అందించి ఆ దారిన నడుస్తున్న తన పిల్లల, వారి పిల్లల ఎదుగుదలకు పొంగిపోయే మురిపెం ఆ జీవితమిప్పుడు. అందుకే ఆమె కలం ఇప్పటికీ పరుగులు తీస్తూనే వుంది.

జీవితం పొలిమేరల నుంచి పోరాడి గెలిచిన మనిషిగా 90 ఏండ్ల అనుభవాలు మూటగట్టిన మానవి పరిపూర్ణగారు. మిగల ముగ్గిన పనసతొనల మాధుర్యంలా వాటిని పంచుతూ, ఆధునిక జీవిత పోకడలను ఆకళింపు చేసుకుని తన మనవరాళ్ల వయసున్న పిల్లలకు సైతం జీవిత పాఠాలు, సూచనలు అందిస్తున్న అనుభవబోధిని ఆమె. చావు పుటుకల గతుకుల్నీ, గమనాలనీ తట్టుకుంటూ తన ఉనికికి ఒక అర్థం కల్పించుకుంటూ రచయిత్రిగా కలం కదిలిస్తూ, నలుగురు కూడిన వేళ గళం విప్పుతూ తన యవ్వనాకాశపు వీధుల్లో విహరించిన పాటల పావురాళ్లను మళ్లీ ఎగురవేస్తూ కళగా గమిస్తున్నది ఆమె జీవితం. నిర్మొహమాటంగా మంచిచెడులను తన దృక్కోణం నుండి వివరిస్తూ అభ్యుదయ వారసత్వాన్ని కొనసాగిస్తున్న ధన్యజీవి అమ్మ పరిపూర్ణమ్మ. మరింత ఆరోగ్యంగా, మరింత ఆనందంగా మరెంతోకాలం మనకు మార్గదర్శిగా కాలాన్ని ఆహ్లాదభరితంగా గడపాలని కోరుకుంటూ అమ్మకు ముకుళిత హస్తాలతో అభిమానపూర్వక అంజలి. తొంభై వత్సరాల ఉత్సవంగా, ఆమె కథాపరిపూర్ణంగా మనందరికీ కనువిందుగా, చిరునవ్వుల స్యందనంగా సాగిపోవాలని కోరుకుంటూ ఆ తల్లికి, స్ఫూర్తివల్లికి మనసా వందనం.

**("ఒక దీపం – వేయి వెలుగులు" పుస్తకం నుండి.**
**ఈ పుస్తక ఆవిష్కరణ సభ 27-8-2022 జూమ్‌లో జరిగింది)**

# ముప్పై ఏళ్లక్రితం ప్రజాసాహితి

**సంపుటి : 16 సంచిక : 1 అక్టోబర్ 1992**

**సారా** వ్యతిరేక పోరాటంలో చైతన్యపూరిత మహిళ పాత్ర గురించి ప్రగతిశీల మహిళాసంఘం – స్త్రీ విముక్తి వారికి మోహన్ గీసిన పోస్టర్ల నుండి ముఖచిత్రం రూపొందించారు. రెండవ అట్టలో శ్రీధరన్ రాసిన 'రగిలింది పోరు' పాటనూ, మూడవ కవరు పేజీలో బి. రామారావు రాసిన 'ఎందాకని సహించం' కవితనూ నాల్గవ అట్టపైన విన్ రాసిన 'వద్దు! వద్దు! తాగొద్దు' జనంపాటను ప్రచురించారు. 'చైతన్య మహిళా లోకానికి జేజేలు!' అనే సంపాదకీయం, దివికుమార్, ఉదయ్ రాసిన 'శబ్దం' అనే వీధి నాటకం, కత్తుల కాంతయ్య రాసిన 'అందరూ సారా తాగాల' అనే వ్యంగ్యం, కాట్రగడ్డ దయానంద్ రాసిన '"సారా'జ్యం" అనే కథనూ, 'ఒక వేకువ కోసం....' అనే పుస్తకంపై ఛాయరాజ్ చేసిన సమీక్షను ప్రచురించారు. సమాజం వెన్నుపై పుట్టిన రాచపుండు (సారా వ్యాపారం) నగ్న స్వరూపాన్ని చిత్రించిన నవల 'అగమ్యగమ్యం'ను కొత్తపల్లి రవిబాబు పరిచయం చేశారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల గురించి డా॥ కిరణ్మయి అనువాదం చేసిన 'భూత(తా)ల స్వర్గం'ను అందించారు. తుపాకీ సన్నీలను ప్రతిఘటించే మానవతా విలువల 'అంకురం' సినిమాను విక్రమ్ సమీక్షించారు.

అంబేద్కర్ రాసిన 'సారా పాలనింక సాగదు' అనే పాటను, 'వాడని మందారాలు' శీర్షికలో రోహిణీ పిక్చర్స్ 'గృహలక్ష్మి' (1938) సినిమాలో 'కల్లు మానండోయ్!' పాటనూ, యం. నిరంజన్ రాసిన 'సర్కారు సారనాప కలిసిరండి వురుకుదాం!' పాటనూ, చైతన్యవాహిని, ఉత్తరాలు, స్వీకారం శీర్షికలతోపాటు 'పిల్లల ప్రపంచం' శీర్షికలో 'అద్భుత కథలే పిల్లల ప్రపంచం', 'బాలల ఆదర్శం' 'బాధ్యత' అనే కథనూ ప్రచురించారు.

1/8 డెమ్మీలో 60 పుటలు. వెల : రూ. 5/-

వ్యాసం

## సినీ వ్యాకరణాన్ని సరికొత్తగా నిర్మించిన రెబెల్

# జా లుక్ గొదార్

– బాలాజీ (కోల్‌కతా)

"కథకు ప్రారంభం, మధ్య భాగం, ముగింపు ఉండాలి, కానీ అదే క్రమంలో ఉండాలని లేదు."

ఈ మాట అన్నవాడు పక్కా పిచ్చోడిలా అనిపిస్తాడు సనాతన వాదులకు! కానీ అదే అతడి ప్రత్యేకత! అతడి మాటలోనే కాదు పనిలోనూ నిత్యనూతనత్వం కనిపిస్తుంది. అతడు చేసిన పని సినిమాలు తీయడం! తీయడమంటే 1955 నుండీ జీవితాంతం సినిమాలు తీస్తునే వున్నాడు. సినిమా వ్యాకరణాన్ని నిత్యం ధ్వంసిస్తూ, నిత్యనూతనంగా సరికొత్తది సృష్టిస్తూనే గడిపాడు. గత సెప్టెంబరు 13, 2022 నాడు 91 ఏళ్ల వయసులో చనిపోయాడు. అతడి పేరు జా లుక్ గొదార్. జీవితంలో ఎక్కువకాలం స్విట్జర్లాండ్‌లో గడిపిన ఫ్రెంచి సినిమా దర్శకుడు ఆయన. తన చావుకు కూడా తనే స్క్రిప్టు రాసుకున్నట్టు చనిపోయాడు. అతడు నివాసముంటున్న స్విట్జర్లాండు రోలే పట్టణంలో 'స్వేచ్ఛా మృత్యువు' లేదా 'సహాయక ఆత్మహత్య' ద్వారా జీవితం చాలించాడు. అది ఆ దేశంలో చట్టబద్ధమే. వృద్ధాప్యం వల్ల వచ్చిన శారీరక సమస్యలతో బాధపడుతున్న ఆయన ఈ నిర్ణయం తీసుకున్నాడు.



### సినిమాల్లోకి రాకముందు :

జా లుక్ గొదార్ 1930 దిశెంబర్ 3న ప్యారిస్‌లో డబ్బున్న కుటుంబంలో జన్మించాడు. ప్రపంచ యుద్ధం కారణంగా అతడిని స్విట్జర్లాండు పంపించేశారు. జీవితంలో ఎక్కువ కాలం స్విట్జర్లాండులోనే గడిపాడు. అందుకే అతడి ఫ్రెంచి సంభాషణ స్విస్ యాసతో వుండేది. స్విట్జర్లాండులోనే విద్యాభ్యాసం ప్రారంభమైంది. యుద్ధానంతరం ప్యారిస్ వచ్చి సోర్బోన్ యూనివర్శిటీలో చేరాడు. ఫ్రెంచ్ రాజధానిలో అప్పట్లో సినిమా సంస్కృతి బలంగా వుండేది. సినిమాలపై చర్చలూ, రాతలూ సాగేవి. హెన్రీ లాంగ్లోయిస్ అనే ఆయన 'సినిమాథేక్' అనే సినిమా క్లబ్బు నడిపేవాడు. గొదార్ అందులో చేరాడు. థియేటర్ ముందు వరుసలో కూర్చొని మరీ సినిమాలు చూసి, ఆపై వాటిపై చర్చించేవాడు. అక్కడ ఆయనకు సినీ దర్శకులు ఫ్రాంకోయిస్ ట్రూఫాట్, జాక్వెస్ రివెట్, క్లాడ్ చబ్రోల్, ఎరిక్ రోహ్మెర్ వంటి వారు పరిచయమయ్యారు. వీరంతా 'నోవెల్లే వేగ్' లేక 'నవతరంగం' అన్న సినీ ఉద్యమానికి కేంద్రబిందువులయ్యారు. పాత ఫ్రెంచి సినీ పద్ధతులను కూల్చివేసి 1950ల చివరలో ఒక తుఫానులా ఈ ఉద్యమం ఊపందుకుంది.

ఇది కాకుండా గొదార్ ఆండ్రే బాజిన్ స్థాపించిన 'కాహియర్స్ దు సినిమా' పత్రిక కోసం సినిమా సమీక్షలు రాసేవాడు. ఈ సమీక్షల్లో చాలా మటుకు వ్యాసాలు 'గొదార్ ఆన్ గొదార్' పుస్తకంలో లభిస్తాయి. "విమర్శకుడిగా ఉన్నపుడు నన్ను నేను చిత్రనిర్మాతగా భావించాను. ఈ రోజు దర్శకుడిగా ఉండి కూడా నన్ను నేను విమర్శకుడిగానే భావిస్తాను." – అనంటాడు ఒక వ్యాసంలో. గొదార్ ఎటువంటి దర్శకుడు కాబోతున్నాడో సిగ్నల్స్ ఇచ్చాయి ఆనాటి అతడి వ్యాసాలు. అతడికున్న ఈ సినిమా పిచ్చి వదిలించాలని కుటుంబసభ్యులు డబ్బులు ఇవ్వడం మానేశారు. అతడి తండ్రి అతడ్ని అమెరికా తీసుకెళ్లాడు. అమెరికా అంటే మాటలా? పెద్ద పెద్ద స్టూడియోలతో చలనచిత్రాల స్థావరం! అక్కడున్నపుడు ఒక లఘు చిత్రమన్నా చేయాలనుకున్నవాడు కేవలం కారు కిటికీలోంచి ఒక షాట్ మాత్రమే తీయగలిగాడు. మళ్లీ ఫ్రాన్సుకు తిరిగి వచ్చాక అమ్మగారి స్నేహితుడి రికమెండేషన్‌తో ఒక డ్యాం నిర్మాణ సైటులో కూలి పని సంపాదించి అక్కడ సంపాదించిన డబ్బుతోనే అక్కడి కూలీల జీవితాలపై 'ఆపరేషన్ కాంక్రీట్' (1955) సినిమా నిర్మించాడు. ఆ తర్వాత కూడా చిన్న చిన్న సినిమాలు తీశాడు. కానీ అతని స్నేహితుడు ట్రూఫాట్ 1958లో 'ది 400 బ్లోస్' తో పేరు సంపాదించిన తర్వాత ఇక ఫీచర్ ఫిల్మ్ నిర్మించాల్సిందే అని నిర్ణయానికి వచ్చాడు.


### తొలి సినిమాలు :

అతని తొలి సినిమా 'బ్రెత్‌లెస్' జనవరి 1960లో విడుదలైంది. ఎడిటింగ్‌లో 'జంప్ కట్' అనే సరికొత్త వరవడిని ఈ సినిమాలో సినీ ప్రపంచానికి గొదార్ అందించాడు 'ది లిటిల్ సోల్జర్' (1963) అల్జీరియన్ యుద్ధాన్ని ప్రస్తావించినందువల్ల నిషేధానికి గురైంది. 1960ల తొలిదశలోని సినిమాలు ఒకలా వుండగా క్రమంగా 1960ల మధ్య కాలం నాటికి 'మస్కులిన్ ఫెమినిన్' (1966) సినిమా సరికి అతడిలోని రాడికల్ భావాలు స్పష్టంగా కనిపించసాగాయి. ఆ సినిమాలో ఒక టైటిల్ కార్డు తన కంటే చిన్న తరం పిల్లల గురించి "మార్క్స్, కోకా–కోలాలకు పుట్టిన పిల్లలు" అని వర్ణిస్తుంది. 'పియరోట్ లే ఫౌ' (1965) సినిమా ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో 'ఇండోచైనా నుండి అమెరికా దళాలు వెనక్కి వెళ్లేవరకూ నేను వియత్నాం యుద్ధాన్ని వ్యతిరేకిస్తూనే వుంటాను' అన్న మాటను చివరికంటా నిలుపుకున్నాడు.

## విప్లవ సినిమాల దశ :

1967లో మొదటి దశ సినిమాల 'లా చినోయిస్' నిర్మించాడు. ఇందులో ప్యారిస్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో విహారయాత్రకై వచ్చిన ఐదుగురు యువకులు తమని తాము 'మార్క్సిస్ట్-లెనినిస్టులు'గా చెప్పుకుంటూ, ఉదయం లేచిన దగ్గరి నుంచీ రోజంతా వాదించుకుంటూ, విప్లవానంతర సమాజాన్ని ఊహిస్తూ విప్లవాన్ని రిహార్సల్స్ చేస్తూ ఉంటారు. వారి పరిసరాలన్నీ 'రెడ్ బుక్' ఎరుపుతో తళతళ మెరుస్తున్నాయి. ఆ రోజుల్లో ప్రపంచమంతా అదే పరిస్థితి. వీధుల్లో, క్యాంపస్‌లలో యువకులు పెద్దఎత్తున ఉద్యమిస్తున్నారు. కలకలం రేపుతున్నారు. చివరికి ప్యారిస్‌లోనూ 'మే-68' తిరుగుబాటు జరిగింది. చాలా విమర్శలను ఎదుర్కొన్నా ఈ సినిమా అందరి దృష్టినీ ఆకర్షించింది.

1968లో వచ్చిన 'వీకెండ్' ఆధునిక బూర్జువా సమాజ పోకడపై ఘాటైన వ్యంగ్యాస్త్రం సంధిస్తుంది. వారసత్వంగా రాబోయే డబ్బు సంపాదించడం కోసం ఒకరినొకరు చంపుకోవాలని ప్లాన్ వేసుకున్న వివాహిత స్త్రీ పురుషులు చివరికి నరమాంస భక్షక హిప్పీల బృందం దాడికి గురౌతారు. సినిమా ఆఖర్లో "కథ సమాప్తం, సినిమా కూడా సమాప్తం" అనే కార్డు పడుతుంది.




1968 మే తిరుగుబాటులో గొదార్ కూడా వ్యక్తిగతంగా పాల్గొన్నాడు. లాంగ్లోయిస్‌ను 'సినిమాథెక్' నుండి తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ వీధి బారికేడ్‌ల ముందు ప్రదర్శన జరుపుతూ 'కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్' మూసివేయించే ఉద్యమంలో కూడా పాల్గొన్నాడు. చివరికి జూన్ ఎన్నికలలో గాలిస్ట్ పాలన పునరుద్ధరణ జరగడాన్ని ఆయన చాలా విచారంగా "సున్నాకి తిరిగి రావడం"గా వర్ణించాడు. గొదార్ ఈ సంఘటనలకు ప్రతిస్పందిస్తూ ఒక దశాబ్దం పాటు చలనచిత్ర పరిశ్రమ నుండి స్వీయ నిర్బంధ బహిష్కరణ శిక్ష తనకుతానే విధించుకున్నాడు.

'లే గై సవోయిర్', 'ఎ ఫిలిం లైక్ ఎనీ అదర్', 'బ్రిటిష్ సౌండ్స్' వంటి ప్రయోగాత్మక సినిమాలు తీసారు. టీవీలో వాటి ప్రసారాలను నిషేధించారు. కొన్నింటిని ర్యాడికల్ వామపక్ష వర్గాల్లో మాత్రమే స్క్రీనింగ్ చేసుకునేవారు. ఆ రోజుల్లో గొదార్‌లానే సనాతన కమ్యూనిస్ట్ ఉద్యమం భ్రమల నుండి బయటపడి మావో ఆలోచనల ప్రేరణలో పడిన మేధావులు చాలా మంది వున్నారు. వారిలో ఫిలిప్ సోల్లెర్స్, జాక్వెస్ రాన్సియర్, అలైన్ బాడియో, సార్త్రే వంటి వారి పేర్లను ఉల్లేఖించవచ్చు.

## డిజిగా వెర్టోవ్ గ్రూప్ :

1969 నుండి తన వ్యక్తిగత పేరు ప్రఖ్యాతుల్ని పక్కన పెట్టి యువ మావోయిస్టు విద్యార్థి జీన్-పియర్ గోరిన్‌తో కలిసి సోవియట్ చిత్రనిర్మాత పేరు మీదుగా 'డిజిగా వెర్టోవ్ గ్రూప్' (లేదా డివిజి) ఏర్పరిచాడు. సినీ నిర్మాణాన్ని ఒక కలెక్టివ్ వర్కుగా చేపట్టాడు. గొదార్ - గోరిన్‌లను కలిపి 'డిజిగా వెర్టోవ్ జంట' అని చుట్టుపక్కల వాళ్లు అభివర్ణించేంతగా వారు కలిసి పనిచేశారు. 1969లో 'ప్రావ్దా', 'విండ్ ఫ్రమ్ ది ఈస్ట్', 'స్ట్రగుల్ ఇన్ ఇటలీ', 1970లో 'వ్లాదిమిర్ అండ్ రోసా', 'అంటిల్ విక్టరీ' (అసంపూర్ణ చిత్రం), 1972లో 'టౌట్ వా బీన్', 'లెటర్ టు జేన్' సినిమాల్ని గొదార్ నిర్మించాడు. కానీ ఈ సినిమాలకు తగిన సంఖ్యలో ప్రేక్షకులు కరువయ్యారు. ఈ సినిమాలు నిర్లక్ష్యానికి గురైనవైనప్పటికీ మార్క్సిస్ట్ సినీ శిల్పాన్ని ఆకళింపు చేసుకోదలచిన వారికి ఇవి అద్భుతమైన చారిత్రక సాక్ష్యాలుగా మిగిలి వున్నాయి.

లెనిన్ రాసిన 'ఏం చెయ్యాలి?' (వాట్ ఈజ్ టు బి డన్?) అన్నది మనకు తెలుసు. కానీ సినిమా విషయంలో 'ఏం చేయాలి?' అన్న వ్యాసాన్ని గొదార్ ఆ రోజుల్లో రాశాడు. అందులోని కొన్ని ముఖ్య అంశాలను చూద్దాం.

## సినిమా విషయంలో 'ఏం చేయాలి?' :

***'1. మనం రాజకీయ సినిమాలు తీయాలి; లేదా***
***2. మనం రాజకీయంగా సినిమాలు తీయాలి.'***

*- ఈ రెండూ ఒకదానికొకటి విరోధమైనవి, ప్రపంచంలోని రెండు వ్యతిరేక భావనలకు చెందినవి.*

*ఒకటోది ఆదర్శవాద, మెటాఫిజికల్ భావనకు చెందినది. రెండోది మార్క్సిస్ట్, గతితార్కిక భావనకు చెందినది. మార్క్సిజం ఆదర్శవాదానికి వ్యతిరేకంగా, గతితార్కికం మెటాఫిజికల్‌కు వ్యతిరేకంగా పోరాడుతుంది. ఈ పోరాటం పాత, కొత్తల మధ్య, కొత్త ఆలోచనలకూ, పాత వాటికీ మధ్య పోరాటం. మనుషుల సామాజిక ఉనికే వారి ఆలోచనను నిర్ణయిస్తుంది. పాత - కొత్తల మధ్య పోరాటం వర్గ పోరాటమే.*

*ఒకటో పని చేయడమంటే బూర్జువా వర్గానికి చెందిన జీవిగా ఉండడమే. రెండోది అమలు చేయడం అంటే శ్రామికవర్గ తరగతి స్థానాన్ని చేపట్టడం. ఒకటోది పరిస్థితుల వివరణ ఐతే రెండోది నిర్దిష్ట పరిస్థితికి చెందిన నిర్దిష్ట విశ్లేషణ చేయడం. ఒకటోది అమలు చేయడం అంటే ప్రపంచాన్ని వివరించడానికి వాస్తవ ప్రపంచ సూత్రాలను అర్థం చేసుకోవడం. రెండోది అమలు చేయడం అంటే ఆ ప్రపంచాన్ని సక్రియంగా మార్చడానికి దాని రహస్యాన్ని అర్థం చేసుకోవడం. ఒకటోది ప్రపంచపు దౌర్భాగ్యాన్ని వివరిస్తే, రెండోది పోరాటంలో ఉన్న ప్రజలను చూపిస్తుంది.*

*ఒకటోది నిర్వహించడం అంటే సినిమాను నిర్మించే ముందే పంపిణీ చేయడం. రెండోది అమలు చేయడం అంటే సినిమాను పంపిణీ చేసే ముందే నిర్మించడం, ఉత్పత్తే పంపిణీపై పైచేయిగా ఉండాలని నమ్ముతూ ఉత్పత్తి చేయడం.*

*రెండో పని చేయడమంటే 'ఐక్యత అనేది వ్యతిరేకతల పోరాటం' (లెనిన్) అని తెలుసుకోవడం, ఉత్పత్తి సంబంధాలు, విప్లవ పోరాటాల చరిత్రను తెలుసుకోవడం, మిలిటెంట్‌గా ఉండటం."* - ఇలా సాగుతుంది ఆ వ్యాసం.

'టౌట్ వా బీన్' గొదార్, గోరిన్ కలిసి నిర్మించిన ఆఖరు సినిమా. పెద్ద స్టార్లను పెట్టి తీసినప్పటికీ, కథా చిత్రంగా తీసినప్పటికీ ఇది ఫెయిలైన తర్వాత ఈ 'జంట' విడిపోయారు. 1971లో ఒక తీవ్రమైన మోటార్‌సైకిల్ ప్రమాదం తర్వాత కొంత కాలం విశ్రాంతి తీసుకున్నాడు గొదార్.

**ఆఖరు దశలో సినిమాలు :**

ఆ తర్వాత వచ్చిన సినిమాలు విప్లవాత్మక వర్గ పోరాటాలు తగ్గించి, గృహ జీవితం, లైంగిక సంబంధాలు, కుటుంబం వంటి 'సూక్ష్మ రాజకీయాల'పై ఎక్కువ దృష్టి సారించాయి. 'నుమెరో డెక్స్' (1975) ఆధునిక కుటుంబ జీవితాన్ని విశ్లేషిస్తే, 'హియర్ అండ్ ఎల్స్‌వేర్' (1976) పాలస్తీనా విముక్తి ఉద్యమం గురించి మాట్లాడుతుంది. 'సిక్స్ ఫోయిస్ డ్యూక్స్/సుర్ ఎట్ సౌస్ లా కమ్యూనికేషన్' (1976), 'ఫ్రాన్స్/టూర్/డెటూర్/డ్యూక్స్/ఎన్‌ఫాంట్స్' (1978) అనే రెండు ముఖ్యమైన టెలివిజన్ ధారావాహికల సంగతి కూడా చెప్పుకోవాలి.

1980వ దశకంలో తన నివాసాన్ని స్విస్ గ్రామమైన రోల్‌కి మార్చి ఒకరకమైన భౌగోళిక ప్రవాసంలోకి వెళ్ళిపోయాడు గొదార్. 1985లో వచ్చిన 'హెయిల్ మేరీ' చిత్రాన్ని కాథలిక్ చర్చి దైవదూషణగా ముద్ర వేసింది. రెండవ ప్రపంచ యుద్ధంలో మరణ శిబిరాలను నిరోధించడంలో విఫలం కావడాన సినిమా కళ చచ్చింది అని బాధపడుతూ, ఆ విషయాన్నే తన 'హిస్టోయిర్(స్) డు సినిమా' (1988–1998) అనే చలనచిత్ర చరిత్రను చెప్పే నాలుగు గంటలన్నర వీడియో ప్రాజెక్ట్‌లో ప్రస్తావించాడు. ఆ తర్వాత గొదార్ చాలా కొద్ది సినిమాలు తీశాడు. 'అవర్ మ్యూజిక్' (2004)లో పాలస్తీనాపై ఇజ్రాయెల్ ఆక్రమణను తీవ్రంగా దూషిస్తాడు. 'ఫిలిం సోషలిజం' (2010) సోషలిజం పునరుజ్జీవనాన్ని ఊహిస్తుంది. ఒక నౌక మునిగిపోయిన దృశ్యం చూపుతూ నయా ఉదారవాదం ఏదో రోజు చావడం ఖాయమని సింబాలిక్‌గా చెబుతాడు ఈ సినిమాలో. జీవితకాలం పాటు ఎన్నో రకాల కెమేరాలతో పనిచేసిన అతడు 'గుడ్‌బై టు లాంగ్వేజ్' (2014) సినిమాలో 3–డీతో ప్రయోగం చేశాడు. 2018లో 'ది ఇమేజ్ బుక్' సినిమా వచ్చింది.

జంప్ కట్స్, హ్యాండ్ హెల్డ్ కెమెరా, లాంగ్ టేక్స్, రెఫరెన్షియాలిటీ – ఇలా ఎన్నో కొత్త చిత్ర నిర్మాణ పద్ధతులకు ఆద్యుడు గొదార్. 'బ్రెత్‌లెస్' సినిమాతో సినిమా కళను 'గతి'శీలంగా, ఆ తర్వాత ప్రగతిశీలంగా పరుగులు పెట్టించిన గొదార్, తన తుది శ్వాసను తనే నిర్ణయించుకుని 'గుడ్ బై టు సినిమా' చెప్పేసిన తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఉన్న అతడి సినిమా ప్రేమికులు ఒక రకమైన విషాదకర శూన్యతలో గడుపుతూ, అతని సినిమాలను నెమరువేసుకుంటున్నారు. ●

## చైతన్యవాహిని

**18–9–2022** ఆదివారం శ్రీకాకుళం పట్టణంలో జనసాహితి పూర్వ అధ్యక్షులు, ప్రజాసాహిత్య, సాంస్కృతికోద్యమ కవి ఛాయరాజ్ 9వ వర్ధంతి సభ జరిగింది. ఈ సభకు జనసాహితి రాష్ట్రకమిటీ సభ్యులు, ఏపిటిఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కొప్పల భానుమూర్తి అధ్యక్షత వహించారు. ఆయన తన అధ్యక్షోపన్యాసంలో ఛాయరాజ్ రచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, వర్తమాన సామాజిక సంక్షోభాలకి పరిష్కారాలు ఛాయరాజ్ కవిత్వంలో లభిస్తాయని, నేటి తరానికి ఛాయరాజ్‌ను పరిచయం చేయాల్సిన బాధ్యత మనందరం మీద ఉన్నదన్నారు. కవి ఛాయరాజ్ గతి తార్కిక ఆలోచన విధానాన్ని కొనసాగించడమే ఆయనకిచ్చే నిజమైన నివాళి అని ఆయన పేర్కొన్నారు. తాను కథలు రాయటం ఛాయరాజ్‌గారి ఆధ్వర్యంలోనే నేర్చుకున్నానన్నారు. రచయిత చింతాడ తిరుమలరావు ఛాయారాజ్‌గారి సాహిత్య సమీక్ష చేస్తూ ఛాయరాజ్ గారితో తనకు గల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 'తొలెరుక' కావ్యాన్ని జనసాహితి ప్రధాన కార్యదర్శి పి. మోహనరావు సమీక్ష చేశారు. ఛాయరాజ్ ప్రజా గ్రంథాలయ కో కన్వీనర్ సదాశివుని శంకర్రావు 'దుఖ్ఖేరు' కావ్యాన్ని సమీక్ష చేస్తూ ఛాయరాజ్‌గారి దార్శనికత వివరించారు. వర్తమాన సామాజిక సంక్షోభంలో – రచయితలు, మేధావులు ఎటువైపు!!?? అనే అంశంపై ఐ.టి.ఆర్.వి. శివాజీ ఛాయరాజ్ స్మారకోపన్యాసం చేశారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో మేధావులు రచయితలు తమ బాధ్యతను జాగ్రత్తగా నిర్వహించాల్సిన పరిస్థితి ఉన్నదని, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ యొక్క మరో రూపాన్ని మనం ఛాయరాజ్ కోణంలో దర్శించాలని, పేర్కొన్నారు. ప్రస్తుతం శ్రామికులు, రైతులు విద్యార్థులు, మహిళలు సంక్షోభంలో ఉన్నారని, అప్రజాస్వామిక విధానాలు రోజురోజుకీ పెరుగుతున్నాయని, సామాన్యులు సంక్షోభంలోకి నెట్టివేయబడుతున్నారన్నారు. రచయితలు మేధావులు ఏకమై ప్రజలకు పరిస్థితిని అవగాహన అయ్యేవిధంగా పనిచేయాలని, ప్రజలను సమాయత్త పరచాలన్నారు. సమావేశంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ ఛాయరాజ్‌గారితో తమకు గల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సామాజిక కవి ఛాయరాజ్ కుమార్తె ఆగ్నేయ, అల్లుడు మల్ల పద్మనాభరావు మాట్లాడుతూ ఛాయరాజ్‌గారి కుమార్తెగా పుట్టడానికి గర్విస్తున్నానని ఉద్వేగభరితంగా మాట్లాడారు. ఛాయరాజ్ స్మృతిగీతాన్ని పి. మోహనరావు బృందం ఆలపించారు. వర్తమాన కవి కంచరాన భుజంగరావు ఛాయరాజ్ 'శ్రీకాకుళం' కావ్యం నుండి కొన్ని ఖండికలను ఆహుతులకు వినిపించారు. ఈ సభకు ఛాయరాజ్ ప్రజా గ్రంథాలయ కన్వీనర్ చావలి శ్రీనివాస్ ఆహ్వానం పలుకగా దాసరి రామ్మోహనరావు వందన సమర్పణ చేశారు. సమావేశంలో ప్రజాసాహితి నాగరాజు, కె ఉదయకిరణ్, దాసరి రామ్మోహనరావు, కొంక్యాన వేణుగోపాల్, వి. నవీన్‌కుమార్, కాళీపట్నం సుబ్బారావు, రంగారావు భాగవతార్, టి.ఎస్.ఆర్. ఆచార్యులు, కె. గోవిందరావు, మొయిద హనుమంతరావు, సాహిత్య అభిమానులు, మేధావులు రచయితలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ●

కవిత

# సెల్ఫీ కాదు

- కంచరాన భుజంగరావు

స్వేచ్ఛ కోసం
ఉరికంబానికి ఊపిరి బలిచ్చిన
పోరాటయోధుల వారసులం మనం!
అమృతోత్సవ ఉత్సవ వేళ
స్వాతంత్ర్యాన్ని కాపాడుకునేందుకు
చివరి నెత్తుటి బొట్టును కూడా
వెచ్చించడానికి సిద్ధం మనం!

అర్ధరాత్రి సంకెళ్లు తెగిన జాతికి
సూర్యోదయం ఒక సహజమైన ఆశ
తెల్లవారడం ఒక అనంతమైన భరోసా
కాకపోతే 27,375 ఉదయాలు
ఎదురుచూపులుగా కరిగిపోవడమేమిటన్నదే
ఇప్పుడు తాజా ప్రశ్న

ముదురుతున్న విద్వేష ఛాయలను
మసకబారిన మరకల గోడలను
వజ్రోత్సవ వేడుక రంగులతో
పెయింటింగ్ వేసి కప్పుకోవచ్చు
కానీ ఒక చెమట జెండా ఒంటి మీద
చిరుగుల అంగీ ఎగురుతున్నప్పుడు
ఎక్కడో పంపకాల నది, గట్టు కట్టుకుని
తడి ఆశల్ని ఎండబెట్టిందనే కదా అర్థం!

దొరల బూట్లలో కాలు పెట్టినప్పుడే
అభివృద్ధి నడక ఎక్కడో తప్పటడుగులు వేసింది
కొందర్ని మేరువులుగా బలిపించి
కూముల్ని కురచబార్చింది
ఇప్పుడు చూడండి
కేవలం రెండొందల మర్రి చెట్ల నీడ
దేశాన్ని కమ్మేసింది

ఎదుగూ బొదుగూ లేని బీదల వేల
వాడల్లోకి మురికివాడల్లోకి మునగదీసుకుంది

పెట్టుబడి ఒక్కటే
వీసా లేకుండా దేశాలు తిరిగేస్తుంది
ఈ గడ్డ మీద
పెట్టుబడికి ఉన్నంత స్వేచ్ఛ
వేరెవరికైనా ఉందంటారా?

అనుదిన దర్శనంలా
చరిత్ర నమోదవుతూనే ఉంటుంది
ఏ మాధ్యమంలోనూ వెలుగు చూడని నిజమే
నిజమైన వార్త అయ్యుంటుంది
వక్రీకరణలకు నిజానికి మధ్య
భవిష్యత్ తరం ఒక అడ్డుగీత పెడుతుంది
ఉద్దేశ పూర్వక మౌనం
ఒక వర్తమాన సత్యాన్ని దాచిపెడుతున్నప్పుడు
ఆ మౌనం ఒక అబద్ధం అవుతుంది
ఏదోనాటికి ప్రజాద్రోహం తప్పక రుజువవుతుంది

ఇప్పుడిక దేశభక్తి అంటే
తిరంగా సెల్ఫీ కాదు సామీ
రెక్కల మీది వివక్ష బరువుతో
తరాలుగా కూలబడిన పిట్టలకు
రెక్క విదిల్చే తెగువ నివ్వడం!
చిరకాల ఆకాంక్షలా అందీ అందకుండా
ఊరించే ఉపాధి ఉద్యోగావకాశాలను
నిరుద్యోగ సైన్యం దక్కించుకోవడం!
రెండు గుండెల వాళ్ళ కపటత్వాన్ని ఎదురొడ్డి
ఉన్న ఒక్క గుండెను స్వేచ్ఛాకాశం కోసం
ప్రజా పతాకను చేసి ఎగరేయడం!

PRAJA SAAHITI October 2022 (TELUGU) Rs. 25/- RNI No.APTEL/1977/00571 Postal Regd. No. Vj/030/2021-2023
No. of Pages : 36 Date of Publication : 28th of Last Month Posting : 1st or 2nd of Every Month




ప్రజాసాహితి 30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం, విజయవాడ - 520002.
Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada
A PUBLICATION OF JANASAAHITHI